





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


‘సత్తా చోరీ’లో బిజెపి సర్కార్ నిమగ్నం
కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ఇసి బిజెపి కోసమే పనిచేస్తుంది

శత్రువు దాడిచేస్తే
మన గగనతలం అభేద్యం

05


సంపుటి 28, సంచిక: 66 | సోమవారం | 25-08-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00




# అరుణ తారకు అంతిమ వీడ్కోలు

## సురవరం సుధాకరరెడ్డికి ‘రెడ్ ఆర్మీ’ నాలుగు కిలోమీటర్ల కవాతుతో తుది యాత్ర


- అధికార లాంఛనాలతో ప్రభుత్వ గౌరవ వందనం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏపి సిఎం చంద్రబాబు సహా పలువురు ప్రముఖ జాతీయ, రాష్ట్ర రాజకీయ దిగ్గజ నేతలు నివాళి
- మగ్దూంభవన్ నుంచి గాంధీ ఆసుపత్రి వరకు అంతిమయాత్ర
- దారిపొడవునా ఎర్రజెండాలతో రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు
- ప్రజానాట్యమండలి కళాకారుల విప్లవ గేయాలాపనలు
- సుధాకర్‌రెడ్డి అమర్ హై అంటూ మార్మోగిన నినాదాలు
- భారీగా తరలివచ్చిన సిపిఐ శ్రేణులు, అభిమానులు
- గాంధీమెడికల్ కాలేజీకి భౌతికకాయం అప్పగింత




భౌతికకాయంపై అరుణపతాకం










సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ. బేబి



సిపిఐ ఏపి నేతలు



బిఆర్ఎస్ నేతలు



టిపిసిసి చీఫ్



గాంధీ ఆసుపత్రికి భౌతికకాయం అప్పగింత

ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ అగ్రనేత, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డికి ‘రెడ్ ఆర్మీ’తో సిపిఐ ఘనంగా అంతిమ వీడ్కోలు పలికింది. హైదరాబాద్ హియత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సురవరం సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వ అధికార లాంఛనాలతో గౌరవ వందనం అనంతరం మధ్యాహ్నం 3.20 గంటలకు ఆయన అంతిమయాత్ర మగ్దూంభవన్ నుంచి ప్రారంభమై హియాయత్‌నగర్ వై జంక్షన్, నారాయణగూడ చౌరస్తా, చిక్కడల్లి, ఆర్‌టిసి చౌరస్తా, గోల్కొండ చౌరస్తా, ముషీరాబాద్ ప్రాంతాల మీదుగా సికింద్రాబాద్ ప్రభుత్వ గాంధీ మెడికల్ కాలేజీకి చేరింది. అంతిమయాత్రలో ముందు భాగంలో పోలీసు కవాత్ ఉండగా, అనంతరం రెడ్ షర్టు వాలంటీర్లు ఎర్ర జెండాలతో కవాతు, ప్రజా నాట్య మండలి కళాకారుల విప్లవ గేయాలాపనలు, డప్పుల మధ్య సురవరం సుధాకర్‌రెడ్డి అమర్ రహే నినాదాలు మారుమోగాయి. భారీ సంఖ్యలో తరలి వచ్చిన సిపిఐ కార్యకర్తలు, నాయకులు, సుధాకర్‌రెడ్డి అభిమానులు, ప్రజలతో దారి పొడవునా అశ్రునయనాల మధ్య అంతిమ యాత్ర కొనసాగింది. హిమాయత్‌నగర్‌లో సిపిఐ నగర నాయకత్వం పుష్పాంజలి ఘటించింది. ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం వద్ద సుధాకర్ రెడ్డి అంతిమ యాత్రకు పుష్పాంజలి ఘటించారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలోని తరువాయి 2లో

### సురవరం సుధాకరరెడ్డికి శాశ్వత గుర్తింపునిస్తాం

అధికారం, ప్రజాప్రతినిధిగా లేకున్నా నమ్మిన సిద్ధాంతాన్ని వీడని మహోన్నత నేత - కొనియాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

02

## లైఫ్ సైన్సెస్ రంగానికి కేంద్రంగా తెలంగాణ

ఫార్మా, బయో, మెడ్‌టెక్ రంగాలకు కీలకంగా మారిన హైదరాబాద్

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ సాధిస్తాం

బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

లైఫ్ సైన్సెస్, వైద్య రంగాలకు ప్రకృతి ఒక ఉత్తమ గురువుగా పనిచేస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) బయోడిజైన్‌కు మంచి ఉదాహరణ అని, మన మెదడును ఆధారంగా చేసుకునే కృత్రిమ మేధస్సును సృష్టించగలిగామన్నారు. గచ్చిబౌలిలోని ఏఐజి హాస్పిటల్ నిర్వహించిన బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్ 2025 (ఆసియాపసిఫిక్) సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ‘ఇన్నోవేటింగ్ ఫర్ భారత్ ది బయోడిజైన్ బ్లూప్రింట్’ను సిఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, భారత దేశం స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జరుపుకునే 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంతో ‘తెలంగాణ రైజింగ్ 2047’ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ లక్ష్యాలను సాధించడంలో వైద్య పరికరాలు, మెడ్‌టెక్ కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తరువాయి 2లో

### బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లపై

## మంత్రుల కమిటీ కసరత్తు

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై రాష్ట్ర మంత్రుల కమిటీ ప్రత్యేకంగా సమావేశమై కసరత్తు చేసింది. హైదరాబాద్ ప్రజా భవన్‌లో ఆదివారం ఈ సమావేశం జరిగింది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఓబిసిల కులగణనను చేపట్టిందని కమిటీ పేర్కొంది. ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణనను ప్రభుత్వం చేపట్టిందని తెలిపింది. ఈ సర్వేలో సేకరించిన డాటాను శాసనసభలో ప్రవేశపెట్టి, స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదింపజేసి, గవర్నర్‌కు పంపినట్లు వివరించింది. ఈ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉంది. మరోవైపు, సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో, రిజర్వేషన్‌ల కల్పనలో ఎలాంటి న్యాయపరమైన వివాదాలు తలెత్తకుండా అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి అభిప్రాయాన్ని మంత్రుల కమిటీ కోరింది. ఇదే అంశంపై సోమవారం జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ఢిల్లీలోని ప్రముఖ న్యాయ నిపుణుల సలహాలు కూడా తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. కమిటీ సభ్యుడు మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్ ద్వారా అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డికి తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

### గణేశ్, దుర్గామాత మంటపాలకు

## ఉచిత విద్యుత్

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో పండుగ వాతావరణం నెలకొంటున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను ప్రకటించింది. ఈ ఏడాది గణేశ్ మంటపాలతో పాటు, దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే దుర్గా మాత మంటపాలకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ సౌకర్యం రాష్ట్రవ్యాప్తంగా వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సదుపాయం పొందడానికి మంటపాల నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొంది ఉండాలి. ఈ నెల 27వ తేదీ నుంచి గణేశ్ చతుర్థి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ నిర్ణయంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాజధాని హైదరాబాద్‌తో సహా పలు జిల్లాల్లో మంటపాల ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ప్రకటించడంతో మంటపాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని, ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని భక్తులు, తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## భారత్‌లో అమెరికా దౌత్యవేత్తగా
## ట్రంప్ సన్నిహితుడు సెర్గియో గోర్

**న్యూయార్క్/వాషింగ్టన్:** భారత్‌లో అమెరికా దౌత్యవేత్తగా సెర్గియో గోర్ ఎంపికయ్యారు.సెర్గియో గోర్ ప్రస్తుతం వైట్‌హౌస్‌లో పిపిఓ (అధ్యక్షుడి వ్యక్తిగత కార్యాలయం) సంచాలకుడుగా పనిచేస్తున్నారు. తదుపరి దౌత్యవేత్తగా నియామకపు తేదీని ధృవీకరించేవరకూ గోర్ పిపిఓ డైరెక్టర్ పదవిలోనే కొనసాగుతారు. ఆయన పదోన్నతి గురించి సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టింగ్ పెట్టారు. 38 ఏళ్ళు వయసుగల గోర్ ట్రంప్‌కు తనకు అత్యంత సన్నిహితుడు. "అనేక సంవత్సరాలుగా తనకున్న గ్రేట్ ఫ్రెండ్ గోర్" అని ట్రంప్ పేర్కొన్నారు. ఆయన మంచి పనిమంతుడని ప్రశంసించారు. దక్షిణ మధ్య ఆసియా వ్యవహారాల ప్రత్యేక దూతగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించారు. భారత్‌–అమెరికా మధ్య టారిఫ్‌ల ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ట్రంప్ నుండి ఈ ప్రకటన వెలువడింది. అతి తక్కువ రికార్డు సమయంలో గోర్, ఆయన బృందం నాలుగువేలమంది అధికారులను ఫెడరల్ డిపార్ట్‌మెంట్‌లలో నియామకాలు చేసిందని ట్రంప్ ఈ సందర్భంగా ప్రశంసించారు. 95 శాతం నియామకాలు కూడా పూర్తయ్యాయని పేర్కొన్నారు.

## ఆస్ట్రేలియాలో లక్షలాదిమంది
# ఇజ్రాయెల్ వ్యతిరేక ర్యాలీలు

**సిడ్నీ:** గాజాలో పాలస్తీనా ప్రజలను ఊచకోత కోస్తున్న ఇజ్రాయెలీ పాలకులకు వ్యతిరేకంగా ఆదివారంనాడు ఆస్ట్రేలియాలోని సిడ్నీ, బ్రిస్‌బేన్, మెల్‌బోర్న్ నగరాలు సహా 40 ప్రాంతాలలో లక్షల మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఒక్కబ్రిస్‌బ్రేన్‌లోనే 50,000 మంది నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాలస్తీనియన్ల ఊచకోత నిలిపివేయాలని, ఆకలి చావులు అరికట్టాలని, గాజా సంపూర్ణ ఆక్రమణ ప్రణాళిక అమలు చేయకూడదని సిడ్నీలో ర్యాలీ నిర్వాహకుడు జోస్ లీస్ డిమాండ్ చేశారు. బ్రిస్‌బేన్‌లో జరిగిన ప్రదర్శనలో క్వీన్‌ల్యాండ్ సెనేటర్ లారిస్సా వాటర్స్ పాల్గొని ప్రసంగించారు. ఇజ్రాయెల్‌కు ఆయుధాలు సరఫరా చేయడంపై ఆంక్షలు విధించాలని ప్రపంచదేశాలు కోరుతున్నప్పటికీ నెతన్యాహూ పట్టించుకోవడంలేదని విమర్శించారు. రెండు వారాల క్రితం కూడా సిడ్నీలో ఇదేవిధంగా ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మహా ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ తర్వాత ఆస్ట్రేలియా ప్రభుత్వ వైఖరిలో కూడా చాలా మార్పు వచ్చిందని సెనేటర్ లారిస్సా వాటర్స్ అన్నారు. ఇజ్రాయెల్‌ను అడ్డుకునేందుకు ప్రపంచదేశాలు నెతన్యాహూపై తీవ్ర ఒత్తిడి తీసుకురావాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. పాలస్తీనా స్వతంత్ర్య దేశానికి గుర్తింపు ఇవ్వాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయించి ఒక ప్రకటన చేయడంతో ఇటీవలికాలంలో ఇజ్రాయెల్‌–ఆస్ట్రేలియా మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇజ్రాయెల్‌కు చెందిన పచ్చిమితవాద పార్లమెంటేరియన్ ఎంకె సిమ్హా రోత్‌మన్‌ను ఆస్ట్రేలియాలో పర్యటించకుండా అడ్డుకుంటూ ఆ దేశ హోంమంత్రి టోరీ బుర్క్ ఆగస్టు 18న ప్రకటన చేశారు. ఇజ్రాయెల్ కూడా ప్రతిస్పందించి వీసా ఆంక్షలు విధించింది. దీంతో రెండు దేశాలమధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అప్పటినుండీ ఆస్ట్రేలియాలో ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రదర్శనలు కూడా బాగా పెరిగాయి. గాజాలో యుద్ధం విరమించాలని ప్రజలు వీధుల్లోకి వచ్చిన ప్రదర్శనలు చేస్తున్నారు.




## ఒకవైపు రష్యాపై డ్రోన్ దాడులు
## మరోవైపు ఉక్రేన్‌లో స్వాతంత్ర్య వేడుకలు

**కీవ్:** ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధం ఆగిపోయి శాంతి నెలకొనాలని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ఆకాంక్షించారు. ఉక్రేన్ 34వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. యుద్ధం ముగించేందుకు ప్రధానంగా అమెరికా సహా యూరప్ దేశాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో కార్నీ పైవిధంగా ఉద్ఘాటించారు. కీవ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కార్నీ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఉక్రేన్ సార్వభౌమాధికార, ప్రాదేశిక సంరక్షణకు అన్నివిధాలుగా కెనడా దోహదకారిగా ఉంటుందన్నారు. అదేవిధంగా ఈ వేడుకలలో ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాట్లాడుతూ, ఉక్రేన్ దేశాన్ని పునర్నిర్మించుకుంటామని, తగిన బలాన్ని, శక్తిసామర్థ్యాలను కూడదీసుకుని మంచి భద్రతా ఏర్పాట్లతో శాంతియుతంగా జీవనం సాగిస్తామని అన్నారు. ఇదిలా ఉండగా, మరోవైపు ఆదివారం తెల్లవారక ముందుగానే ఉక్రేన్ డ్రోన్లు రష్యాపై దాడులు చేశాయి. పశ్చిమ కుర్స్క్ ప్రాంతంలోని అణు విద్యుత్ కేంద్రంవద్ద డ్రోన్ దాడులు జరిగాయని రష్యా విమర్శించింది. రష్యాపై ఉక్రేన్ చేసిన డ్రోన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టామని రష్యా సైనికవర్గాలు తెలిపాయి. 95 ఉక్రేన్ డ్రోన్లు కూల్చివేశామని ప్రకటించాయి. ఆదివారం తెల్లారక ముందుగానే రష్యాలో అనేక ఇంధన కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రేన్ దాడులకు దిగిందని రష్యా అధికారులు విమర్శించారు. కుర్స్క్‌లో విద్యుత్ కేంద్రంవద్ద మంటలను సకాలంలో స్పందించి సిబ్బంది ఆర్పివేశారు. ఈ విద్యుత్ కేంద్రంవద్ద ట్రాన్స్‌ఫామ్స్‌లు డ్రోన్ దాడులవల్ల అగ్నిబారినపడ్డాయని చెప్పారు. ఈ విమర్శలపై ఉక్రేన్ వర్గాలు స్పందించలేదు. అదేవిధంగా ఉక్రేన్ ఒక ప్రకటన చేస్తూ, 72 డ్రోన్లను, క్రూయిజ్ క్షిపణులను రష్యా తమపై ప్రయోగించిందని, 48 డ్రోన్లను కూల్చివేశామని తెలిపింది. కాగా ద్నిప్రో పెట్రోవస్క్‌లోని ఫిలియా ప్రాంతాన్ని విముక్తిచేసి ఆక్రమించుకున్నట్లు రష్యా సైనిక వర్గాలు ప్రకటించాయి.

## అంతిమ వీడ్కోలు
(మొదటి పేజీ తరువాయి)

నేతల బృందం అరుణపతాకాలు చేబూని సుధాకర్‌రెడ్డికి భౌతికకాయానికి పూలమాలలు వేసి అరుణాంజలి సమర్పించారు.

**మెడికల్ కళాశాలకు భౌతిక ఖాయం అప్పగింత**

సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధనల నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాలకు అప్పగించారు. సురవరం కోరిక మేరకు భార్య డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, కుమారులు కపిల్, నిఖిల్‌లతో కలిసి సిపిఐ నేతలు సురవరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయాన్ని గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఇందిర, ఫిజియాలజీ హెచ్‌ఓడి ప్రొఫెసర్ రమాదేవి, అనాటమీ ప్రొఫెసర్ సుధాకర్‌బాబులకు అప్పగించారు. సురవరం భౌతికకాయానికి ఎంబామింగ్ (రసాయనాల పూత) చేసి భద్రపరుస్తామని, వైద్యవిద్యార్థుల పరిశోధనలు, శరీర నిర్మాణం, సైంటిఫిక్ నాలెడ్జ్ పెంచుకునేందుకు దోహదపడుతుందని ఈ సందర్భంగా ప్రొఫెసర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కె.శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, ఈ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఎన్ఎఫ్ఐడబ్లు నాయకురాలు అనీ రాజా తదితరులు సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి చివరి సారిగా నివాళులు అర్పించారు. విద్యార్థి దశ నుంచి అనేక పోరాటాలు చేస్తూ ప్రజాసేవలో జీవితం గడిపిన సుధాకర్ రెడ్డి చివరికి తన భౌతిక కాయాన్ని కూడా వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా గాంధీ ఆసుపత్రికి అందజేశారని నేతలు కొనియాడారు.

## సురవరం సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వ గౌరవ వందనం

సిపిఐ అగ్రనేత, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో గౌరవ వందనం సమర్పించింది. హైదరాబాద హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో భౌతికకాయానికి ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ పోలీసులు అంతిమ గౌరవ వందనం (శోక్ శస్త్ర) సమర్పించారు. హైదరాబాద్ నగర ఆర్మ్‌డ్ రిజర్వ్ (సిఎఆర్)కు చెందిన ఆర్ఎస్ఐ జి.ఉపేంద్ర నేతృత్వంలో సాయుధ పోలీసులు వెంకటేష్, జగదీష్, రాజు, అంజి, శ్రీకాంత్, షఫీ, అనాస్, ఆనంద్, దీపక్, హన్మంత్‌లు తుపాకాలు తలక్రిందులు చేసి సురవరం సుధాకర్ రెడ్డికి సంతాప సూచకంగా గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా సిఎఆర్‌కు చెందిన పోలీసు బ్యాండ్ బృందం సురవరం సుధాకర్‌రెడ్డికి సంతాప సూచకంగా గౌరవ వందనం పలికింది.



## ఉచిత విద్యుత్
(మొదటి పేజీ తరువాయి)

ఉత్సవ కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**ముఖ్యమైన భద్రతా మార్గదర్శకాలను జారీ చేసిన పోలీసులు**

ఉచిత విద్యుత్‌తో పాటు పోలీసులు కొన్ని ముఖ్యమైన భద్రతా మార్గదర్శకాలను జారీ చేశారు. మండపాలను తాత్కాలికంగానే ఏర్పాటు చేయాలని, అగ్ని ప్రమాదాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. అదనంగా, మండపాల వద్ద ఇసుక సంచులు, నీటి డ్రమ్ములను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి) విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించి, పర్యావరణాన్ని కాపాడాలని నిర్వాహకులను కోరారు. నిమజ్జనం రోజున రద్దీని తగ్గించడానికి, విగ్రహాలను 3, 5 లేదా 7 రోజుల్లో నిమజ్జనం చేసే విధంగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం కోసం ఫిట్‌నెస్ ఉన్న వాహనాలను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలంటే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవడం తప్పనిసరి. డిజెలకు మాత్రం అనుమతి లేదని పోలీసులు తేల్చి చెప్పారు. మతపరమైన ప్రాంతాల వద్ద పోస్టర్లు, జెండాలు, బ్యానర్లు పెట్టకూడదని, రద్దీ ప్రదేశాలలో డ్రోన్‌ల వాడకం నిషేధమని పోలీసులు స్పష్టం చేశారు. విరాళాలను స్వచ్ఛందంగా మాత్రమే తీసుకోవాలని, అలాగే మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ ఏడాది వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్‌నబి ఒకే రోజు రావడంతో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

## సిఎం సహా పలువురికి ధన్యవాదాలు
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ అగ్ర నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి అంతిమ వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొని, నివాళ్లు అర్పించిన, ప్రభుత్వం తరపున అధికార లాంఛనాలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ధన్యవాదాలు తెలిపారు. ఎపి సిఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రముఖులు వెంకయ్యానాయుడు, బండారు దత్తాత్రేయ, బిఆర్ఎస్ నాయకులు కెటిఆర్, రాష్ట్ర మంత్రులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు ప్రముఖులు, మేధావులు రాజకీయాలకు అతీతంగా సుధాకర్‌రెడ్డి అంతిమ వీడ్కోలులో పాల్గొని, నివాళులు అర్పించడం సురవరం దేశానికి, రాష్ట్రానికి సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు అందించిన సేవలకు నిదర్శనమని అన్నారు. భారతదేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో విద్యార్థి, యువజన సంఘాలకు, వామపక్ష ఉద్యమాలకు నాయకత్వం వహించిన కమ్యూనిస్టు, ప్రగతిశీల భావాలు పునికిపుచ్చుకున్న గొప్ప రాజకీయ నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని కూనంనేని సాంబశివరావు కీర్తించారు. అంతటి మహానాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి మరణం నుంచి కూడా స్ఫూర్తిని పొంది ఆయన రాజకీయ, మానవత విలువల వారసత్వాన్ని, పోరాట పటిమను, ఆశయాలను ఆదర్శాలను సురవరం రాజకీయ వారసులుగా ముందుకు తీసుకెళ్తామని కూనంనేని ఉద్ఘాటించారు.

# నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు
### నిజాయితీ, నిస్వార్థ, నిరాడంబరజీవి గొప్ప కమ్యూనిస్టు నేత సుధాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి తుది శ్వాస వరకు నిలబడిన నిజాయితీ, నిస్వార్థ, నిరాడంబర జీవితాన్ని గడిపిన కమ్యూనిస్టు మహా నేత సురవరం సుధాకర్‌రెడ్డి అని సమాజంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీలో, చట్ట సభలలో ఎన్నో ఉన్నతమైన బాధ్యతలు నిర్వర్తించినప్పటికీ ఏనాడూ ఆవేశం, కోపం ఆయనలో చూడలేదర్కొన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి మరణం వామపక్ష ఉద్యమానికి, యావత్ దేశానికి, బడుగు బలహీన వర్గాలకు తీరని లోటు అని కన్నీటి పర్యంతమయ్యారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణకు సురవరం పోరాడారు : ఏపి సిఎం చంద్రబాబు**

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సిపిఐ నేత సురవరం సుధాకర్ రెడ్డి పోరాడారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం, దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి చంద్రబాబు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డితో ఉన్న రాజకీయ సంబంధాల గురించి సిపిఐ నేతలతో పంచుకున్నారు. 'సురవరంతో నాకు సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉంది. సుధాకర్ రెడ్డి, నేను కలిసి ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాం. నిత్యం ప్రజాహితం కోసం ఆయనతో కలిసి పోరాడం. ఎంపిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ప్రజలకు సేవలందించారు. సుధాకర్ రెడ్డి నన్ను ప్రత్యేకంగా అభిమానించేవారు. నేను చేసే పనులను, కార్యక్రమాలను అభినందించి ప్రోత్సహించేవారు. ఆయన సేవలను, పోరాటాలను నా జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేను. సుధాకర్ రెడ్డి చనిపోయినా పోరాట వారసత్వాన్ని మనకు ఇచ్చిపోయారు. సుధాకర్ రెడ్డి మరణం సిపిఐతో పాటు, తెలుగు వారికి తీరని లోటన్నారు.

**నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన వ్యక్తి సురవరం : వెంకయ్య నాయుడు**

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన వ్యక్తి సురవరం అని కొనియాడారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నప్పటికీ ఆ పదవికి వన్నె తెచ్చిన వ్యక్తి సురవరం అని, ఆయనలేని లోటు పూడ్చలేనిదన్నారు.

**పేదల కోసం పరితపించారు : మహేష్ కుమార్ గౌడ్**

టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పేదల కోసమే పరితపించిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం రాష్ట్రానికి తీరని లోటు అని అన్నారు. ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ జీవితాంతం పోరాటాలతో గడిపిన మహనీయుడు సురవరం సుధాకర్ రెడ్డి అని అన్నారు.

**సురవరం రాజకీయ జీవితం నేటి యువతకు ఆదర్శం: భట్టి విక్రమార్క**

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సురవరం సుధాకర్ రెడ్డి లాంటి ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందన్నారు. దేశంలో సిపిఐ బలోపేతానికి ఆయన కృషి చేశారని, చిన్న నాటి నుంచి ప్రజల పక్షాన నిలబడి, ప్రజల కోసం పోరాడారని గుర్తు చేశారు. ఆయన రాజకీయ జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు. సురవరం పేరు చిరస్థాయిగా నిలిచేలా కేబినెట్ లో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.

**తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు : కెటిఆర్**

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో అనేక హోదాల్లో పనిచేసిన సుధాకర్‌రెడ్డి ఎన్నో విప్లవ ఉద్యమాలు, ఎన్నో ప్రజా ఉద్యమాల్లో ఎన్నో కార్మికుల ఉద్యమాల్లో, తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారన్నారు. విద్యార్థి నాయకుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి జాతీయస్థాయిలో సిపిఐకి ఏడేళ్ల పాటు ప్రధాన కార్యదర్శిగా పనిచేయడం సాధారణమైన విషయం కాదన్నారు. ప్రజల పట్ల, ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహనతో అన్ని ప్రజా సమస్యలపై క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమంలో పనిచేసిన ప్రతి ఒక్కరికి బాధాకరరమన్నారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధించి సిపిఐ మద్దతు తెలిపిందని, జాతీయ స్థాయిలో తాము కలిసి పనిచేసే అవకాశం వచ్చిందన్నారు. కెసిఆర్ కూడా సుధాకర్ రెడ్డితో ఉన్న అనుభవాలను గుర్తు చేసుకున్నారన్నారు. ఎంఎల్ఏ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి నాయకత్వం విద్యార్థి దశలో తమకు స్ఫూర్తినిచ్చిందన్నారు. తుది శ్వాస విడిచే వరకు ఆయన ప్రజల కోసమే ఆలోచించారన్నారు.

**కార్మికుల సంక్షేమం, ప్రయోజనాల కోసం సూచనలు చేసేవారు: బండారు దత్తాత్రేయ**

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ నమ్మిన భావజాలానికి కట్టుబడిన మహనీయుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. తాను కేంద్ర కార్మిక శాఖ మంత్రి ఉన్నసమయంలో సురవరం కార్మికుల సంక్షేమం, ప్రయోజనాలకు సంబంధించి సూచనలు చేసేవారని గుర్తుచేశారు. సిద్ధాంతపరంగా తాము వేరైనప్పటికీ ఏనాడూ కూడా విమర్శించుకోలేదని, సద్విమర్శ మాత్రం చేసేవారని గుర్తు చేశారు.

**ప్రజా ప్రభుత్వాల ఏర్పాటులో సురవరం కృషి మరువలేనిది: మధుయాష్కిగౌడ్**

మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వాల ఏర్పాటులో సురవరం కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు మాట్లాడుతూ సురవరం తాను సమకాలీకులమని, తామిద్దరం కలిసి చదువుకున్నామని గుర్తు చేశారు. ఆయన మృతి సోషలిస్టు సమాజానికి తీరని నష్టంగా భావిస్తున్నానని అన్నారు. సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి మరణంతో శిఖరం మునిగిపోయిందా, సముద్రం కుంగిపోయిందా అన్నట్టుగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

**శాంతి దూత మిషన్‌కు సుధాకర్‌రెడ్డి మద్దతిచ్చారు : కె.ఎ.పాల్**

ప్రజా శాంతి పార్టీ అధ్యక్షులు కె.ఎ పాల్ మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి ఎంపిగా ఉన్న సమయంలో శాంతి దూత మిషన్‌కు మద్దతునిచ్చారని గుర్తు చేశారు. కమ్యూనిస్టులకు ధ్యేయం, నీతి, నిజాయితీ ఉన్నదన్నారు. కమ్యూనిస్టులు కలవాలని ప్రజా గాయకుడు గద్దర్ కూడా ప్రజాశాంతి పార్టీలో ఉన్నప్పుడు అభిలషించారని అన్నారు. బహుజనులకు న్యాయం జరగాలని కోరుకుంటున్నామన్నారు.

**దేశానికి, బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటు : బోయినపల్లి వినోద్ కుమార్**

బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి మరణం భారతదేశానికి, బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు తీరని లోటు అని అన్నారు. గత పదేళ్ల కెసిఆర్ నాయకత్వంలోని ప్రభుత్వంలో సురవరం అనేకసార్లు ఫోన్ చేసి, కొన్ని సమస్యలపైన స్పందించాల్సిన విధానంపైన పలు సలహాలు ఇచ్చేవారని గుర్తు చేశారు. ఆయన ఒక నిజమైన దేశభక్తుడు అని, ప్రజల పట్ల అపారమైన ప్రేమ కలిగిన నాయకుడని కొనియాడారు. సురవరంతో తనకు 1975 సంవత్సరంలో తెనాలిలో జరిగిన అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ శిక్షణ శిబిరంలో పరిచయడం ఏర్పడిందని గుర్తు చేసుకున్నారు. సుధాకర్ రెడ్డి వ్యక్తిత్వం, ఆలోచనా శక్తి తనపై గొప్ప ప్రభావాన్ని చూపిందని, ఆయన ఉపన్యాసాలు ఎల్లప్పుడూ స్పష్టత, విశ్లేషణతో ఉండేదన్నారు. ప్రపంచ రాజకీయ పరిణామాలపై విస్తృతమైన అవగాహనతో తమకు దిశా నిర్దేశం చేసే వారని అన్నారు. 2004లో తాను హన్మకొండ ఎంపిగా, సురవరం నల్లగొండ ఎంపీగా ఉన్నప్పుడు కూడా తెలంగాణ రాష్ట్రం అవసరమనే అభిప్రాయాన్ని సురవరం కేంద్రానికి లిఖితపూర్వకంగా తెలియజేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రణబ్ ముఖర్జీ కమిటీకి కూడా ఆయన సమర్థవంతమైన సూచనలిచ్చారన్నారు. సుధాకర్ రెడ్డి మరణం తనతో పాటు, అన్ని వామపక్ష ప్రజాతంత్ర శక్తులకు చాలా బాధ కలిగించిందని, దేశ రాజకీయ పరిస్థితులు మతోన్మాదం వైపు దారితీస్తున్నందుకు ఆయన ఆందోళన వ్యక్తం చేసేవారని వినోద్ కుమార్ అన్నారు. వామపక్ష, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత కోసం తపనపడిన మహనీయుడు సురవరం అని వినోద్ కుమార్ అన్నారు.

**కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం పోరాడిన గొప్ప నాయకుడు: మంత్రి సీతక్క**

హిమాయత్‌నగర్‌లోని మఖ్దూంభవన్‌లో సిపిఐ జాతీయ కార్యాదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర రెడ్డికి మంత్రి దనసరి అనసూయ సీతక్క ఘనంగా నివాళులర్పించారు. కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం జీవితాంతం నిబద్ధతతో పోరాడిన యోదుడని ఆమె స్మరించంఆరు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన కన్నుమూయడం వామపక్షాలకు, ప్రజాస్వామ్య వాదులకు తీరని లోటని పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**సురవరంకు నివాళులర్పించిన మంత్రి కృష్ణారావు**

హిమాయత్‌నగర్ మగ్దూం భవన్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నివాళులు అర్పించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన సురవరం సుధాకర్‌రెడ్డికి తనతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా జూపల్లి నెమరేసుకున్నారు.

## విలువలపై రాజీపడని నిరాడంబర నేత
### సురవరం సుధాకర్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ అగ్ర నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి అధికారంలో ఉన్నా లేకపోయినా, ప్రజాప్రతినిధిగా ఉన్నా లేకపోయినా సుధాకర్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతాన్ని ఎప్పుడూ వదలలేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కొనియాడారు. మరణం నిరుపేదలకు, బహుజనులకు, సిద్ధాంతపరమైన రాజకీయాలను శ్వాసగా జీవిస్తున్న ప్రతి ఒక్కరికీ తీరని లోటు అని అన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి ముఖ్యమంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సురవరం సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. సిపిఐ నేతలు డి.రాజా, కె.నారాయణ, చాడ వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, అజీజ్ పాషాతో పాటు అనేక మంది నాయకులను ముఖ్యమంత్రి కలిసి సురవరం సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ విద్యార్థి రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల వరకు తన చివరి శ్వాస వరకు సిద్ధాంతాలు, విలువల విషయంలో రాజీపడకుండా నిరాడంబరంగా జీవించారని కొనియాడారు. ఎఐఎస్ఎఫ్ నుంచి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించినా, ఏనాడూ అహంకారం, అహంభావం తన దరిదాపుల్లోకి రానీయలేదన్నారు. పాలమూరు బిడ్డగా బూర్గుల రామకృష్ణ రావుగారు, ఎస్.జైపాల్ రెడ్డి కోవలో కంచుపాడు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి పాలమూరు జిల్లాకు ఎంతో వన్నె తెచ్చారని సిఎం పేర్కొన్నారు. హైదరాబాద్ రాష్ట్ర విముక్తి పోరాటంలో, పత్రికా సంపాదకుడిగా ఎనలేని సేవలు అందించిన సురవరం ప్రతాప రెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టాలని సుధాకర్ రెడ్డి శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుతో లేఖ పంపించినప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆయన సూచన మేరకు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టామని సిఎం చెప్పారు. ఇదే సందర్భంగా సుధాకర్ రెడ్డిని వ్యక్తిగతంగా కలిసి మాట్లాడుతానని ఆరోజు చెప్పానని, అయితే కొంత ఆలస్యమైందని, ఈ రకంగా కలుసుకోవలసిన పరిస్థితి వస్తుందని ఊహించలేదన్నారు. కాంగ్రెస్ పిఎసి సమావేశంలోనూ వారి సేవలను స్మరించుకుని ఘనంగా నివాళులర్పించామని, కాంగ్రెస్ అధ్యక్షులు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే సంతాప సందేశాన్ని పంపించామని, ప్రభుత్వ పక్షాన సురవరం కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు.

## సురవరం సుధాకర్‌రెడ్డిని శాశ్వతంగా గుర్తుంచుకునే విధంగా ప్రభుత్వం నిర్ణయం

"జీవితాంతం సిద్ధాంతపరమైన విలువలతో కూడిన రాజకీయంతో పనిచేసిన కమ్యూనిస్టు మహానేత సురవరం సుధాకర్ రెడ్డిని శాశ్వతంగా గుర్తుంచుకునే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఈ విషయంపై రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి సముచితమైన నిర్ణయం తీసుకుంటాం" అని తెలంగాణ సిఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. 'విలువలతో కూడిన సిద్ధాంత నిబద్ధత కలిగిన నాయకుల విషయంలో ప్రభుత్వానికి సంపూర్ణ సానుకూల దృక్పథం, సానుభూతి ఉంది. అందుకే కొండా లక్ష్మణ్ బాపూజీ గౌరవార్థం ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజీకి వారి పేరును పెట్టుకున్నాం. మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరును పెట్టాం. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జైపాల్‌రెడ్డి పేరు, ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరును చిరస్థాయిగా గుర్తుంచుకునేలా అనేక విధాలుగా గౌరవించుకున్నాం. అదే స్థాయిలో సుధాకర్‌రెడ్డిని కూడా ప్రభుత్వం గుర్తిస్తుంది.' అని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

## కేంద్రంగా తెలంగాణ
(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగానికి కేంద్రంగా ఉందని, ఫార్మా, బయోటెక్, లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్ వంటి రంగాలకు హైదరాబాద్ కీలకంగా మారిందని ఆయన వివరించారు.

సుల్తాన్ పూర్‌లో మెడికల్ డివైజ్ పార్క్ ఏర్పాటు చేశాం సుల్తాన్ పూర్‌లో దేశంలోనే పెద్ద మెడికల్ డివైజ్ పార్క్ ఏర్పాటు చేశామని, ఇప్పటికే 60పైగా కంపెనీలు అక్కడ ఉన్నాయని తెలిపారు. మెడికల్ డేటాను పరిశోధన కోసం కంపెనీలకు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఇన్నోవేటర్స్, స్టార్టప్‌ల ఏర్పాటుకు ఇదే సరైన సమయమని అన్నారు. మానవాళిని ఆరోగ్యంగా మార్చడానికి ప్రయత్నం చేద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఏ వస్తువునైనా రూపొందించినప్పుడు దాని ప్రయోజనం, పనితీరు, రూపం అనేవి ప్రాథమిక అంశాలుగా ఉంటాయన్నారు. డయాగ్నస్టిక్ పరికరాలు, ఇమేజింగ్ టెక్నాలజీలు, ఇంప్లాంట్లు, శస్త్రచికిత్స పరికరాలు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయని, స్థానిక స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)లు గ్లోబల్ కంపెనీలతో కలిసి పనిచేస్తున్నాయని ఆయన చెప్పారు.

**ప్రజల కోసం మేధస్సు**

సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరిశోధనలు చేస్తున్నందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, ఏఐజి హాస్పిటల్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. ఇంతకాలం మన మేధస్సును ఇతర దేశాల ప్రజల కోసం ఉపయోగించామని, ఇప్పుడు మన ప్రజల మంచి కోసం పనిచేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి తమ ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. డేటా గోప్యతను పాటిస్తూ, ఇక్కడి ప్రజల వైద్య సహాయం కోసం అవసరమైన డేటాను అందిస్తామని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీలు, కార్పొరేషన్‌లు, విద్యా సంస్థలు, పరిశోధనా కేంద్రాలతో అనుసంధానం చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అనిశ్చిత పరిస్థితులు, పన్నులు, యుద్ధాలు, వాణిజ్యపరమైన అడ్డంకులు వంటివి ఎదురవుతున్నాయని, ఈ సమయంలో ఆవిష్కరణలకు తెలంగాణ సరైన వేదిక అని అన్నారు. మానవాళిని మరింత ఆరోగ్యంగా మార్చడానికి అందరం కలిసి ప్రయత్నం చేద్దామని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.






















# కమ్యూనిస్టు దిగ్గజానికి విప్లవాంజలి














# సురవరం సుధాకర్ రెడ్డికి ఘన నివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్


సిపిఐ అగ్రనేత, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డికి 'రెడ్ ఆర్మీ'తో సిపిఐ ఘనంగా అంతిమ వీడ్కోలు పలికింది. సమాజంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులు, కళాకారులు, రచయితలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు, రాజకీయాలలో ప్రముఖ ప్రాత పోషించిన రాజకీయ ఉద్దండులు, న్యాయనిపుణులు, వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో నేతలు, చిన్న కంపెనీలో పనిచేసే సాధారణ కార్మికుడు, పొలం పనిచేసే రైతుకూలీ వరకు కార్మికులు, శ్రామికులు హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌కు తరలివచ్చి సుధాకర్‌రెడ్డికి కడసారిగా కన్నీటి వీడ్కోలు పలికారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని వర్గాలూ రాజకీయాలకతీతంగా సురవరం సుధాకర్ రెడ్డికి 'భాష్పాంజలి' శ్రద్ధాంజలి ఘటించారు. ఒక 'అరుణతార'ను కోల్పోయామని, సామాజిక, కమ్యూనిస్టు పోరాట యోధుడి గొంతు మూగబోయిందని కన్నీంటి పర్వంతమయ్యారు. సురవరంతో తమకు ఉన్న అనుబంధాన్ని, ఆనాటి పోరాట ఘట్టాలను, సాధించిన విజయాలను, హక్కులను ఇలా ఒక్కోక్కటిగా పలువురు గుర్తు చేసుకున్నారు. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయం సందర్శనార్థం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు ఆదివారం ఉదయం 9:35 గంటలకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సురవరం భౌతిక కాయంపై సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో పాటు జాతీయ కార్యదర్శివర్గం 'అరుణ పతాకాన్ని' కప్పి రెడ్ సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా డి.రాజా పుష్పాలతో శ్రద్ధాంజలి ఘటించి, తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గం పులమాలలు వేసి నివాళి అర్పించారు. సురవరం కుటుంబ సభ్యులు పుష్పాలతో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కళాకారులు, కవులు, రచయితలు, ప్రజాప్రతినిధులు, మేధావులు, కార్మిక, రైతు, మహిళా సంఘాల ప్రతినిధులు, సురవరం అభిమానులు భౌతిక కాయానికి పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. జన హృదయాల్లో చెరగని ముద్ర వేసిన సుధాకర్‌రెడ్డికి కడసారి వీడ్కోలు పలికేందుకు వచ్చిన వారు 'రెడ్ సెల్యూట్ కామ్రేడ్ సురవరం' అనే నినాదాలతో హైదరాబాద్‌లోని ప్రాంతాలు మార్మోగాయి. "లాల్ సలాం...లాల్ సలాం.. కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి... లాల్ సలాం.. నిరుపేదల పెన్నిధి లాల్ సలాం... లాల్ సలాం" అంటూ ప్రజా నాట్య మండలి కళాకారులు గేయాలను ఆలపించారు.

## ప్రముఖుల నివాళి

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తాసుఖేందర్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ కె.కేశవరావు, సుప్రీంకోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, ఎంపిలు అయోధ్య రాంరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర తదితరులు పూలమాలతో సుధాకర్ రెడ్డికి నివాళ్లు అర్పించారు.

## శ్రద్ధాంజలి ఘటించిన వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు

సుధాకర్‌రెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి బి.మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ఎంఎల్‌ఎలు మల్‌రెడ్డి రంగారెడ్డి, బాలునాయక్, రాంచందర్ నాయక్, పాయల వెంకటేశ్వర్లు, మెగారెడ్డి, మందుల సామ్యూల్, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, రాష్ట్ర రైతు, వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు బెల్లయ్య నాయక్, వెన్నెల తదితరులు నివాళ్లు అర్పించారు. మాజీ ఎంపిలు వి.హనుమంతరావు, మధుయాష్కీ గౌడ్, కెవిపి.రాంచందర్‌రావు, ఎం.అంజన్‌కుమార్ యాదవ్, అలాగే బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు, మాజీ ఎంపిలు బోయినపల్లి వినోద్ కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, వి.శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ అజయ్ కుమార్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు భాస్కర్‌రావు, మాజీ ఎంపి రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఎంఎల్‌ఎలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్, ఎంఎల్‌సి తాతామధు, నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ చెరుకు సుధాకర్ శ్రద్ధాంజలి అర్పించారు. టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, లోక్‌సత్తా మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌ఎలు జయప్రకాష్ నారాయణ,టిడిపి రాష్ట్ర నాయకులు బక్కని నర్సింహులు, టిడి. జనార్ధన్, నల్లెల కిశోర్, కట్టరాములు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్, మాజీ ఎంఎల్‌సి కపిలవాయి దిలీప్ కుమార్, వైసిపి మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి, భౌతికకాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



## సిపిఐ నాయకుల నివాళ్లు

సిపిఐ జాతీయ కార్యదర్శులు బినయ్ విశ్వం, గిరీష్ శర్మ, డాక్టర్ కె.నారాయణ,సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పశ్యపద్మ, పల్లా వెంకట్‌రెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, సిపిఐ రాజ్యసభ సభ్యులు సందోష్ కుమార్, సిపిఐ తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, బిహార్ రాష్ట్ర కార్యదర్శి రాంనరేష్‌పాండే, సిపిఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి, పాండిచేరి రాష్ట్ర కార్యదర్శులు సుధాకర్‌రెడ్డికి పుష్పాంజలి ఘటించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్, సి.రామచంద్రయ్య, కేరళ మంత్రి రాజన్‌తో పాటు వివిధ రాష్ట్రాలు, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి నాయకులు పెద్దసంఖ్యలో హాజరై సుధాకర్‌రెడ్డికి నివాళులు అర్పించారు.

## సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి ఘన నివాళి

సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డికి సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి ఘన నివాళి అర్పించింది. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, ఇటి.నర్సింహ,రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, పల్లా వెంకటరెడ్డి, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనర్సింహా, వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, వి.సీతారామయ్య, పల్లా నర్సింహా రెడ్డి, నెల్లికంటి సత్యం, ఎస్.కె.సాబీర్ పాషా, దండి సురేశ్, సి.హెచ్.రాజారెడ్డి, ఎస్.బాల్‌రాజ్, పాలమాకుల జంగయ్య, ఎన్.జ్యోతి, బెజవాడ వెంకటేశ్వ ర్లు, ఛాయాదేవి, రామడుగులక్ష్మ ణ్, కలకొండ కాంత య్య, ఇ.ఉమామహేశ్, పంజాల శ్రీనివాస్, ముత్యాల విశ్వనాథం, యానాల దామోదర్ రెడ్డి,షేక్ బాసుమియా, రమావత్ అంజయ్య నాయక్,(గిరిజన సమా ఖ్య), ఎం.డి యూసుఫ్,ఎస్.బాలరాజ్, ఎం. నర్సిం హ, (ఎఐటియుసి) వలీ ఉల్లా ఖాద్రీ, తిరుమలై, హరీశ్‌బాల,తిరుమలై (ఎఐఎస్ఎఫ్),అనీరాజా, జ్యోతి, (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు), పల్లె నర్సింహ, లక్ష్మి నారాయణ(ప్రజా నాట్య మండలి) తదితరులు సుధాకర్‌రెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి అరుణాంజలి ఘటించారు.

## వామపక్ష నాయకుల నివాళి

సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయంపై సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్య, డి.జి.నర్సింహారావు, టి.జ్యోతి, చెరుకుపల్లి సీతారాములు, బి.వెంకట్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, పాలడుగుభాస్కర్, సాయిబాబు, వెంకటేష్ (సిఐటియు), మధు (ఎపిసిసిఐ(ఎం), మాజీ ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి పుష్పగుచ్ఛాలుంచి భాష్పాంజలి ఘటించారు. అలాగే వామపక్షాల నేతలు సాధినేని వెంకటేశ్వర్‌రావు, కె.గోవర్ధన్, వేములపల్లి వెంకట్రామయ్య (సిపిఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసీ), వి. సంధ్య, ఝాన్సీ, (పిఒడబ్ల్యు), పోటురంగారావు, ర మ, అశోక్, ఎస్.ఎల్.పద్మ (సిపిఐఎం.ఎల్– మాస్ లై న్), అమర్(జనశక్తి), విమలక్క(అరుణోదయ సంస్కృతిక మండలి), కె.మురహరి, శ్రీధర్ (ఎస్‌యుసిఐ (యు), మద్దికాయల అశోక్, ఓంకార్, ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, (ఎంసిపిఐ(యు), సామాజిక కార్యకర్త లక్ష్మి నారాయణ, వీక్షణం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మేథావులు, ప్రజా సంఘాల నేతల నివాళి

మఖ్దూంభవన్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయంపై ప్రజా సంఘాల నాయకులు మంద కృష్ణ మాదిగ(ఎంఆర్‌పిఎస్), కె.యాదవరెడ్డి, డాక్టర్ డి.సుధాకర్, కెవిఎల్(ఐయిప్సో), జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ మొలుగరం కుమార్, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.వి.సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టులు కె.రాంచంద్రమూర్తి, ఆంధ్రజ్యోతి అధినేత రాధాకృష్ణ, దేవులపల్లిఅమర్, కట్ట శేఖర్ రెడ్డి, కె.శ్రీనివాస్, కె.విరాహత్ అలీ(టియుడబ్ల్యుజె),బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఐఎఎస్ చిరంజీవి, జూలూరి గౌరిశంకర్ పుష్పగుచ్ఛాలుంచి నివాళ్లు అర్పించారు. ప్రజా సంఘాల నేతలు శంకర్, (ఎఐబిఇఎ), ఎల్లంకి అనిల్ కుమార్, (ఎఐబిఓఎ), వి.చెన్నకేశవరావు, కె.రజని (సిఆర్ ఫౌండేషన్), పద్మాకర్, ఎస్.బాబు, ఈదురు వెంకన్న(టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ), మక్కెన సుబ్బరావు (ప్రజాపక్షం సంపాదకులు), సినీ ప్రముఖులు ఆర్.నారాయణమూర్తి, వందేమాతరం శ్రీనివాస్, సుద్దాల అశోక్ తేజ, తమ్మా రెడ్డి భరద్వాజ్, శ్రవణ్, కవి గోరటి వెంకన్న, రాపోలు సుందర్శన్ (అరసం), ఏటుకూరి కృష్ణమూర్తి (తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధ డు), మాజీ మంత్రి రాజేశంగౌడ్, బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ తదితరులు సురవరం భౌతికకాయంపై పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అమెరికాతో సత్వర పరిష్కారం చేసుకోండి
### భారత్‌ను కోరిన నిక్కీహేలీ

**న్యూయార్క్ :** రష్యా నుండి ముడి చమురు దిగుమతులపై డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటనలను, ఆయన ఉద్దేశాలను సీరియస్‌గా తీసుకోవాలని రిపబ్లికన్‌పార్టీ నాయకురాలు నిక్కీహేలీ భారత్‌ను కోరారు. భారతదేశం ఈ విషయాన్ని అనివార్యంగా పరిగణనలోకి తీసుకుని వీలైనంత త్వరగా అమెరికాతో ఒక పరిష్కారం చేసుకోవాలని, చైనాను ఎదుర్కోవాలంటే అమెరికాకు ఒక స్నేహితుడు ఉండాలని ఆమె తన వ్యాసంలో పేర్కొన్నారు. వాణిజ్యంపై అభిప్రాయభేదాలు, రష్యా చమురు దిగుమతి వంటి అత్యంత సంక్లిష్టమైన, నిర్వహణకు సాధ్యంకాని సమస్యలను ఒక ఒప్పందం ద్వారా విజయవంతంగా పరిష్కరించుకోవాలని నిక్కీహేలీ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. గత వారం న్యూస్‌వీక్‌కు అభిప్రాయ వ్యక్తికరణ వ్యాసాన్ని ఆమె పోస్టింగ్ చేశారు. భారత్–అమెరికా మధ్య సంబంధాలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయని, భారత్ వస్తువులపై ట్రంప్ 50 శాతం సుంకాలు విధించారని వార్తలు వెలువడిన తర్వాత ఆమె ఈ అభిప్రాయం ప్రకటించారు.



## సాధారణ స్థితిలోనే మంజీరా గేట్లు
### స్పష్టం చేసిన జలమండలి అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మంజీరా బ్యారేజీ గేట్లు పనిచేయడం లేదన్న వదంతులను జలమండలి అధికారులు ఖండించారు. ఈ మేరకు, మంజీరా గేట్లు అన్ని సక్రమంగా పనిచేస్తున్నాయని, అవి సాధారణ స్థితిలో ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం మంజీరా నుండి 2 క్రెస్ట్ గేట్లు, 1 స్కవర్ వెంట్ ద్వారా 15,130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సింగూర్ నుండి ప్రవాహం 9,226 క్యూసెక్కులుగా ఉంది. ఈ నెల 13వ తేదీ నుండి ఈ రోజు ఉదయం 6:00 గంటల వరకు గేట్లలో ఎలాంటి అంతరాయం లేకుండా సగటున 46,000 క్యూసెక్కులతో మొత్తం 28.09 టిఎంసిల నీటిని విడుదల చేశారు. మంజీర బ్యారేజీకి కానీ, దాని గేట్లకు కానీ ఎలాంటి ప్రమాదం లేదని జలమండలి అధికారులు అధికారికంగా ప్రకటించారు. హైదరాబాద్‌కు మంచినీరు సరఫరా చేసే మంజీరా నదిలో వరద పరిస్థితిపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయరాదని అధికారులు కోరారు. ఒకవేళ ఏమైనా సందేహాలుంటే, సంబంధిత అధికారుల నుండి ధ్రువీకరించుకోవాలని సూచించారు.




## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. హైదరాబాద్‌లోని స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టిఎస్ ) అధ్యక్షుడు ఎం. పర్వత్ రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సదానందం గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ అభివృద్ధిలో ఎస్‌టియు కీలక పాత్ర పోషించిందని అభినందించారు. పెండింగ్‌లో ఉన్న వివిధ బిల్లులను ప్రభుత్వం దశల వారీగా చెల్లిస్తుందని హామీనిచ్చారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందే ఏర్పడి, ప్రభుత్వ గుర్తింపు పొందిన తొలి ఉపాధ్యాయ సంఘం ఎస్‌టియు అని అన్నారు. రాష్ట్రంలో తొలి పిఆర్‌సి ఏర్పాటు, పెన్షన్ రూల్స్ సాధన, అప్రెంటిస్ విధానం రద్దు కోసం ఎస్‌టియు చేసిన కృషిని చాడ వెంకట్ రెడి గుర్తు చేశారు. టిజెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎస్‌టియు పాత్రను గుర్తు చేశారు. ఉపాధ్యాయ సంక్షేమానికి పర్వత్ రెడ్డి చేసిన సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఎస్‌టియు చరిత్రను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథ రెడ్డి, పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ కె. లింగయ్య, ఆర్‌జెడి సత్యనారాయణ, సంఘ రాష్ట్ర నాయకులు ఆటసదయ్య, ఎల్.ఎం. ప్రసాద్, జుట్టు గజేందర్, ఎ.వి. సుధాకర్, రవి, నర్సింహారెడ్డి, శంకర్ మాతంగి, పోల్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, కృష్ణా రెడ్డి, సంఘ రాష్ట్ర నాయకులు, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## సురవరం మరణం వామపక్ష, కార్మిక,
# ప్రజా ఉద్యమాలకు తీరని లోటు
### సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి మరణం వామపక్ష, కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.అంటోని బేబీ అన్నారు. ఢిల్లీలో సిపిఐ(ఎం) కార్యాలయంలో జరిగిన వామపక్ష సమావేశాలకు సిపిఐ బృందానికి సురవరం సుధాకర్ రెడ్డి నాయకత్వం వహించేవారని, ప్రజా సమస్యలపై లోతుగా అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు చూపేవారని ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉద్యమాలను బలమైన శక్తిగా తయారుచేయడంలో సురవరం సుధాకర్ రెడ్డి ఎంతో కృషి చేశారని, నల్లగొండ నుంచి రెండు పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికైన సురవరం శ్రామికవర్గ సమస్యలపైనే ప్రధానంగా మాట్లాడేవారని అంటోని బేబీ గుర్తు చేశారు. కమ్యూనిస్టు నేతగా సురవరం సుధాకర్ రెడ్డి నిరాడంబరత, విషయ పరిజ్ఞానంతో చివరి వరకు కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి ఉన్నారని బేబీ కొనియాడారు. దేశంలో మతతత్వం విజృంభిస్తున్న ప్రస్తుత సమయంలో వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల ఐక్య ఉద్యమాలు ఎంతో అవసరమని, అందుకు వామపక్ష శ్రేణులు పోరాటాలకు పునరంకితమవ్వాలని అన్నారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ ఉమ్మడి ఏపిలో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో సురవరం సుధాకర్ రెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు.

కమ్యూనిస్టు సిద్ధాంతాలు, సాహిత్యం పట్ల పార్టీ శ్రేణులను చైతన్యవంతం చేసిన సురవరం సుధాకర్ : సిపిఐ ఏపి నేతలు

కమ్యూనిస్టు సిద్ధాంతాలు, సాహిత్యం పట్ల పార్టీ శ్రేణులను సురవరం సుధాకర్ రెడ్డి నిరంతరం చైతన్యవంతం చేస్తూ, ప్రజా ఉద్యమాలలో సమర్ధవంతంగా పని చేయడానికి ప్రోత్సహించేవారని సిపిఐ ఏపి రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వర్ రావు అన్నారు. సిపిఐ ఏపి రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వర్, మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్, సి.రాంచంద్రయ్యలతో కూడిన పార్టీ ప్రతినిధి వర్గం మఖ్దూంభవన్‌లో సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయంపైన పుష్ప గుచ్ఛాలు పెట్టి శ్రద్ధాంజలి ఘటించింది. ఉమ్మడి ఏపిలో వేలాది మంది యువతను, విద్యార్థులను,యువ కమ్యూనిస్టు ఉద్యమకారులుగా సుధాకర్ రెడ్డి తీర్చిదిద్దారని వారు కొనియాడారు. ముప్పాళ్ల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ పేదలు, వ్యవసాయ కార్మికుల, అభ్యున్నతి కోసం సుధాకర్ రెడ్డి ప్రత్యేక కృషి చేశారని పేర్కొన్నారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గిరిజనులకు అటవీహక్కుల చట్టం తదితర చట్టాలు రూపొందించడంలో చట్టసభలలో సురవరం తన వంతు పాత్రనునిర్వర్తించారని కొనియాడారు. సి.రాంచంద్రయ్య మాట్లాడుతూ పాలమూరు నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన సుధాకర్‌రెడ్డి కష్టజీవులకు మార్గదర్శకులుగా ఉంటారని పేర్కొన్నారు. ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమానికి అప్పటి సిపిఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సురవరం సుధాకర్ రెడ్డి సంపూర్ణ సహకారం అందించారని గుర్తు చేశారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పీడిత ప్రజలు, బడుగుబలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి, నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ బాధిత ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి సుధాకర్ రెడ్డి పార్లమెంట్‌లో విశేష కృషి చేశారని కొనియాడారు.

### అవకాశం ఇస్తే రాజ్యాంగ పరిరక్షణకు
## శక్తి మేర పోరాడతా
### మాజీ జస్టిస్ సుదర్శన్ రెడ్డి

**చెన్నై :** అవకాశం ఇస్తే రాజ్యాంగ పరిరక్షణకు తన శక్తి మేర పోరాడతానని మాజీ న్యాయమూర్తి, ఇండియా ఐక్య సంఘటన ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబరు 9న జరగనుంది. ఇందులో తమిళనాడుకు చెందిన సి.పి.రాధాకష్ణన్ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ తరపున పోటీ చేస్తుండగా... మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ నేతత్వంలోని ఇండియా ఐక్య సంఘటన తరపున పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సుదర్శన్ రెడ్డి రాష్ట్రాలకు వెళ్లి ఎంపీల మద్దతు పొందడానికి ప్రయత్నిస్తున్నారు. ఆదివారం చెన్నై విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు డీఎంకేకు చెందిన ఎ.రాజా, కళానిధి వీరసామి, విల్సన్, తమిళనాడు కాంగ్రెస్ నాయకుడు సెల్వపెరుంథకై, ఇతరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ రాష్ట్ర హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. 'తమిళనాడు గొప్ప వ్యక్తులకు నేను నా నివాళులు అర్పిస్తున్నాను. తమిళనాడు భారతదేశానికి మార్గదర్శక రాష్ట్రం. విద్య, ఆరోగ్య సంరక్షణలో ముందంజలో ఉంది. నేను చాలా తీర్పులు ఇచ్చాను. ఇప్పుడు మీరు నాకు తీర్పు ఇవ్వాలి. అవకాశం ఇస్తే రాజ్యాంగాన్ని కాపాడటానికి నా శక్తి మేర పోరాడతాను' అని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ మాట్లాడుతూ 'రాజ్యాంగాన్ని కాపాడాలంటే సుదర్శన్ రెడ్డి అవసరం. ఉపరాష్ట్రపతి పదవికి సుదర్శన్ రెడ్డి అర్హుడు. సుదర్శన్ రెడ్డి తమిళనాడును, తమిళనాడు ప్రజల మనోభావాలను గౌరవించే వ్యక్తి. ప్రజాస్వామ్యాన్ని నమ్మే వారందరూ సుదర్శన్‌రెడ్డిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా అంగీకరిస్తారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే సుదర్శన్ రెడ్డి గెలవాలి. బీజేపీ 'తమిళం' ముసుగు ధరించి మద్దతు అడుగుతోంది' అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సుదర్శన్‌రెడ్డి తనకు మద్దతు ఇవ్వాలని డీఎంకేకు చెందిన ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. ఆయన ఇండియా ఐక్య సంఘటనలోని ఇతర పార్టీల నాయకులను కూడా కలుస్తారు.

## అర్హులకే సంక్షేమ పథకాలు
### మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా లబ్దిదారులు వెంటనే పూర్తి చేసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అధికారులు, నాయకులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆదివారం మంత్రి జూపల్లి వీపనగండ్ల బొల్లారంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మండల కేంద్రంలో రూ. 3.90 కోట్ల వ్యయంతో వీపనగండ్ల .. బెక్కం బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 19 మంది మహిళ మైనార్టీ లబ్దిదారులకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. తర్వాత బొల్లారంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన పల్లె దావఖాన భవనాన్ని ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా ఐదు లక్షల రూపాయలతో జిల్లా పరిషత్ పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిఇల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ , అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీనివాసులు, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వరలక్ష్మి, డా. వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీరయ్య, పాన్‌గల్ సింగిల్‌విండో మాజీ అధ్యక్షురాలు బాల్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు రావుల నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, నాయకులు ఉన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినిమా ఉండాలి
### సినీ నిర్మాతలు, దర్శకులతో సిఎం రేవంత్ రెడ్డి భేటీ



**హైదరాబాద్:** సినిమా పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం జూబ్లీహిల్స్ సిఎం క్యాంప్ ఆఫీసులో తెలుగు చలనచిత్ర పరిశ్రమకు సంబంధించిన సినీ నిర్మాతలు, దర్శకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ తెలుగు సినిమా పరిశ్రమ అంతర్జాతీయ స్థాయికి వెళ్లిందని, సజినిమా పరిశ్రమలో పని వాతావరణం ఇంకా బాగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని, నిర్మాతలు, కార్మికులు, ప్రభుత్వం కలిసి ఒక పాలసీ తీసుకువస్తే బాగుంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. సినీపరిశ్రమ లో వివాదం ఉండరాదనే అభిప్రాయంతోనే కార్మికుల సమ్మె విరమణకు తాను చొరవ తీసుకున్నట్లు చెప్పారు. తెలుగు సినిమారంగ కార్మికులను కూడా తాను పిలిచి మాట్లాడుతానని తెలిపారు. సినీపరిశ్రమలోకి కొత్త గా వచ్చే వారికి నైపుణ్యత పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సినీపరిశ్రమలో వివిధ అంశాల్లో నైపుణ్యాలను పెంపుదల కోసం ప్రత్యేకంగా ఒక కార్పస్ ఫండ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్కిల్ యూనివర్సిటీ లో సినిమా పరిశ్రమ కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. పరిశ్రమ లో నిర్మాతలు, కార్మికుల అంశం లో సంస్కరణలు అవసరమని, అయితే కార్మికుల విషయంలో నిర్మాతలు మానవతాదృక్పదంతో వ్యవహరించాలన్నారు. సినీ కార్మికులను, నిర్మాతలను కూడా రాష్ట్ర ప్రభుత్వం కాపాడుకుంటుందని తెలిపారు. సినిమా పరిశ్రమ కు మానిటరింగ్ అవసరమని, పరిశ్రమకు ఏం కావాలో ఒక కొత్త పుస్తకాన్ని రాసుకుందామన్నారు. సినీపరిశ్రమలో వ్యవస్థలను ఎవరైనా నియంత్రిస్తామంటే రాష్ట్ర ప్రభుత్వం సహించదని స్పష్టం చేశారు. ఎంతటి వారైనా సరే సినీ పరిశ్రమలోని వారందరూ చట్ట పరిధి లో పని చేయాల్సిందేన్నారు. పరిశ్రమ విషయంలో తాను న్యూట్రల్ గా ఉంటానని ముఖ్యమంత్రి చెప్పారు.

హైదరాబాద్ లో అంతర్జాతీయ సినిమాల చిత్రీకరణ కూడా జరుగుతోందని, తెలుగు సినిమాల చిత్రీకరణ ఎక్కువగా రాష్ట్రంలోనే జరిగేలా చూడాలని, తెలుగు సినిమా పరిశ్రమను అంతర్జాతీయ స్థాయిలో ఉంచడమే తన ధ్యేయం అని సిఎం అన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు. నిర్మాతలు అల్లు అరవింద్, డి.సురేష్ బాబు, జెమిని కిరణ్, స్రవంతి రవికిశోర్, నవీన్ ఎర్నేని, వంశీ, బాపినీడు, డివివి దానయ్య, వంశీ, గోపి, చెరుకూరి సుధాకర్, సాహు, అభిషేక్ అగర్వాల్, విశ్వ ప్రసాద్, అనిల్ సుంకర, శరత్ మరార్, ఎన్వీ ప్రసాద్, ఎస్కేన్, రాధామోహన్, దాము.. దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, బోయపాటి శ్రీనివాస్, సందీప్ రెడ్డి వంగా, వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి, వెంకీ కుడుముల తదితరులు ఉన్నారు.

## మహిళా అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/వెల్దండ :** అన్నిరంగాల్లో మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్‌ప్రజా ప్రభుత్వం అన్నిరంగాల్లో మహిళలకు అధికప్రాధాన్యతతో ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్రపంచాయతీరాజ్, మహిళా,శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం పెద్దాపూర్ గ్రామంలోని యువ నాయకులు కాయితికిశోర్‌రెడ్డి నివాసానికి చేరుకున్న మంత్రి సీతక్కతోపాటు రాష్ట్రస్పోర్ట్స్ అథారిటిచైర్మన్ శివసేనారెడ్డిలను మహిళలు, కాంగ్రెస్ పార్టీనాయకులు శాలువాతో సన్మానించి ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా మహిళలతో మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్రోల్‌పంపులు, ఆర్‌టిసి అద్దెబస్సులను మహిళా సంఘాలకు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. అదాని, అంబానిలకు ఫలితమైన సోలార్‌విద్యుత్‌ప్లాంట్లను ఆడబిడ్డలకు అందిస్తున్నామన్నారు. త్వరలో మరిన్ని వ్యాపారాల్లోకి మహిళాసంఘాలను ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టామని ఆమె తెలిపారు. ఈఏడాది అనుకున్న లక్ష్యాలకుమించి మహిళలకు వడ్డీలేని రుణాలు అందించామని రూ.20వేలకోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించుకుంటే రూ.22వేలకోట్ల వరకు రుణ సౌకర్యం కల్పించామని ఆమె వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ యువ నాయకులు కిశోర్‌రెడ్డి, రాష్ట్రయువజన కాంగ్రెస్ మాజీ కార్యదర్శులు మెరుగు రమేష్‌రెడ్డి, తక్కళ్లపల్లి శేఖర్, కిసాన్‌సెల్‌తాలుకా అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి
### ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలి
### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్టీ మారిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి, దమ్ముంటే ఉప ఎన్నికల్లో పోటీ చేసి తిరిగి గెలవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు సవాల్ విసిరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తన 20 నెలల పాలనలో తెలంగాణ ప్రజలకు చేసిన మంచిని చూపించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ప్రజల కోసం కాకుండా, తమ స్వార్థం కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్లారని కెటిఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి అనవసరమైన, టైమ్‌పాస్ మాటలు చెబుతూ, తమపై కేసులంటూ పిచ్చిగా మాట్లాడుతున్నారని కెటిఆర్ ఎద్దేవా చేశారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల పాలనలో హైదరాబాద్ అభివృద్ధిలో దూసుకుపోయిందన్నారు. 2014లో బిఆర్ఎస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని, కెసిఆర్ సిఎం అయిన ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యను పూర్తిగా పరిష్కరించారని, ఇన్వర్టర్లు, జనరేటర్లు కనిపించకుండా చేశారని చెప్పారు. హైదరాబాద్‌ను కులం, మతం, ప్రాంతం పేరు మీద రాజకీయాలు చేయకుండా, అన్నదమ్ములుగా తీర్చిదిద్ది అభివృద్ధి చేశామని ఆయన వివరించారు. అందుకే 2023లో కాంగ్రెస్‌కు ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా రాకుండా నగర ప్రజలు ఓట్లు వేశారన్నారు.

'కాంగ్రెస్ నేతల బ్లాక్‌మెయిల్ దందాల కోసమే హైడ్రా పనిచేస్తోంది'..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా కేవలం కాంగ్రెస్ నేతల బ్లాక్‌మెయిల్ దందాల కోసం మాత్రమే పని చేస్తోందని కెటిఆర్ ఆరోపించారు. ఈ అరాచకాల కారణంగానే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పూర్తిగా కుప్పకూలిందన్నారు. బిఆర్ఎస్ హయాంలో రియల్ ఎస్టేట్‌లో నాయకులు వేలు పెట్టలేదని, కబ్జాలు, గూండాగిరి జరగలేదన్నారు. హైడ్రా అరాచకాలతో హైదరాబాద్ నగరం వృద్ధి అతలాకుతలమైందన్నారు. హైడ్రా పేదల ఇళ్లను కూల్చివేస్తూ, బిల్డర్లను బెదిరించి, 'ఆర్ఆర్ టాక్స్' పేరుతో వసూళ్లకు పాల్పడుతోందని ఆరోపించారు. కూకట్‌పల్లిలో హైడ్రా భయంతో బుచ్చమ్మ అనే మహిళ ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గం చెరువు ఎఫ్‌టిఎల్‌లో సిఎం రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి అక్రమంగా కట్టిన ఇంటిని కూల్చే దమ్ము హైడ్రాకు ఉందా అని కెటిఆర్ ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ పేదల ఇళ్లను హైడ్రా కూల్చివేస్తోందని, కానీ అధికారంలో ఉన్న పెద్దల జోలికి వెళ్లడం లేదని విమర్శించారు.

# ఎక్సైజ్ శాఖలో పెరుగుతున్న శిక్షలు

**తెలంగాణలో మెదక్‌లో తొలి జైలు శిక్ష**
**రెండేళ్లలో డబుల్ ఫిగర్ నిందితులకు**
**10, 5 సంవత్సరాల శిక్షలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేసులు నమోదు చేయడమే కాదు. నమోదు చేసిన కేసుల్లోని నిందితులకు శిక్షలు ఎంత మందికి పడుతున్నాయని అనేదే అసలు సిసలైన ప్రశ్న ? కేసుల నమోదు చేసే పవర్ లాండ్ అర్డర్ నిర్వహించే పోలీస్ శాఖకు, ఎన్‌డిపిఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) తోపాటు నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్, నాటుసారా తయారీ అమ్మకాలు, కల్తీ మద్యాం తయారీపై కేసులు నమోదు చేసే అధికారం అవకాశం ఎక్సైజ్ శాఖకు ఉంది. ఈ రెండు శాఖలు నమోదు చేసే కేసుల పంచానామా, చార్జీషీట్, సాక్ష్యుల వాగ్మూలాలు కేసుల్లో శిక్షలు పడడానికి ప్రధాన పాత్ర పోషిస్తాయి. నిన్న మొన్నటి వరకు మర్డర్, మానభంగం, దొంగతనం, చీటింగ్‌పై పలువురు నిందితులకు శిక్షలు పడడం, వినడం, చూడడం జరిగింది. కాని ఈ మధ్య ఎక్సైజ్ శాఖ పరిధిలో నమోదు అవుతున్న కేసుల్లో కూడ నిందితులకు పదేళ్లు, ఐదేళ్ల జైలు శిక్షలు, రూ. లక్ష, రూ.50 వేల జరిమానాలు న్యాయమూర్తులు విధిస్తూ వస్తున్న తీర్పులతో ఎక్సైజ్ శాఖ సిబ్బందిలో ఆత్మ స్థైర్యం పెరిగింది.

**ఎన్‌డిపిఎస్‌లో కేసులు నమోదు..**

2022 నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) కేంద్రా హోం మంత్రిత్వశాఖ సమాచారం మేరకు దేశంలో ఎన్‌పీడీఎస్ చట్టం కేరళలో 22,619 కేసులు, మహారాష్ట్రలో 13,830, పంజాబ్‌లో 12,442 , ఉత్తర ప్రదేశ్‌లో 11,541, తమిళనాడ్‌లో 10,385, ఏపీలో 1391, తెలంగాణలో 1279 కేసులు నమోదైనట్లు రికార్డులు చెపుతున్నాయి.

**శిక్షలు కూడ ఇదే తీరులో..**

పంజాబ్‌లో 132, ఉత్తర ప్రదేశ్‌లో 2925, ఏపీలో 325, తెలంగాణలో 365 , మద్యా ప్రదేశ్‌లో 2689, హర్యానాలో 1189 మందికి శిక్షలు పడినట్లు రికార్డులు చెపుతున్నాయి.

**తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి..**

తెలంగాణలో 2023 నుంచి ఎక్సైజ్ కేసుల్లో శిక్షలు పడడం ప్రారంభమయ్యింది. 2023లో తెలంగాణలో ఎన్‌డిపిఎస్‌లో 16 కేసులు, 2024లో 11 కేసులు, 2025లో 12 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి. తెలంగాణలోని మొత్తంగా 64 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి. తెలంగాణలో 33 జిల్లాలో ఎక్కువగా శిక్షలు పడిన జి ల్లాగా సంగారెడ్డి, మెదాక్ జి ల్లాలుగా ఉన్నాయి. ఈ రెండు జి ల్లాల్లో 36 కేసుల్లో శిక్షలు పడ్డాయి.


**నిబంధనలు పాటించడమే శిక్షలు పడడానికి కారణాలు**
**– జె.హరి కిషన్, డిప్యూటి కమిషనర్, మెదక్**

నాతో పాటు కింది స్థాయి యంత్రాంగం కేసు నమోదులో నిబంధనలు పాటించాలని అదేశించడం ఒకటైతే. కేసు నమోదు సమయంలో నిర్వహించే పంచానామాలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ఇన్‌వాల్వ్ చేయడం ప్రధానం. ఇదే తీరును అన్ని స్టేషన్లలో పాటించిడం వల్ల ఎక్కువ కేసుల్లో శిక్షలు పడుతున్నాయి. శిక్షలు పడిన ప్రతి కేసులో పదేశ్ళు, ఐదే శిక్షలతోపాటు రూ. లక్ష, రూ.50 వేల జరిమానాలు పడ్డాయి. 2010లో సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 600 కేజీల గంజాయిని పట్టుకున్న కేసులో 2013లో వచ్చిన తీరులో ఒకరికి 20 సంవత్సరాలు ఏడుగురికి 10 సంవత్సరాలు శిక్షలు పడడం మా ఎక్సైజ్ సిబ్బందికి స్పూర్తినిచ్చి నట్లయ్యింది. ఇదే తీరులో జి ల్లాలో అన్ని స్టేషన్లలో శిక్షలు పడే విధాంగా కేసుల్లో చార్జీషీట్ దాఖలు చేస్తున్నారు.

**శిక్షలు పడడం ఎక్సైజ్‌శాఖ పనితీరుకు నిదర్శనం**
**– డైరెక్టర్ షానవాజ్ ఖాసిం డైరెక్టర్**

ఎక్సైజ్ శాఖలో నమోదవుతున్న కేసుల్లో ప్రతియేటా నిందితులకు శిక్షలు పడుతుండడం శుభ పరిణామమని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం నమోదు చేసిన కేసుల్లో శిక్షలు పడుతుంటే ఎక్సైజ్ సిబ్బందికి తాము పడిన కష్టానికి ఫలితం దక్కిందని భావిస్తారు. శిక్షలు ప్రతియేటా పెరుగుతుండం ఎక్సైజ్‌శాఖ పనితీరు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 15 మంది పాకిస్థానీ మత్స్యకారుల అరెస్టు

**భజ్ :** గుజరాత్ కచ్ జిల్లాలోని ఇండో–పాక్ సరిహద్దు సమీపంలో సరిహద్దు భద్రతా దళం 15 మంది పాకిస్థానీ మత్స్యకారులను అరెస్టు చేసి, ఇంజిన్‌తో అమర్చిన కంట్రీ బోట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బిఎస్‌ఎఫ్ తెలిపింది. రాష్ట్రంలోని కచ్ ప్రాంతం కోరి క్రీక్‌లోని సరిహద్దు అవుట్‌పోస్ట్ సాధారణ ప్రాంతంలో గుర్తించబడిన గుర్తు తెలియని పడవకు సంబంధించిన నిర్దిష్ట సమాచారం ఆధారంగా బిఎస్‌ఎఫ్ శనివారం గాలింపు ఆపరేషన్ నిర్వహించిందని పేర్కొంది. పొరుగున ఉన్న బెట్స్‌లో విస్తృతంగా గాలించామి, ఆ సమయంలో 15 మంది పాకిస్థానీ మత్స్యకారులను అరెస్టు చేసి ఒక ఇంజిన్‌తో అమర్చిన కంట్రీ బోట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బిఎస్‌ఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. పొరుగు దేశం సింధి ప్రావిన్స్‌లోని సుజావల్ జిల్లాకు చెందిన పాకిస్థానీ జాతీయులైన మత్స్యకారులు బిఎస్‌ఎఫ్ 68వ బెటాలియన్ సరిహద్దు అవుట్‌పోస్ట్ సాధారణ ప్రాంతంలో గుర్తించినట్లు వెల్లడించింది. పడవలో దాదాపు 60 కిలోల చేపలు, తొమ్మిది ఫిషింగ్ వలలు, డీజిల్, ఐస్, ఆహార పదార్థాలు, చెక్క కర్రలు ఉన్నాయి. వారి వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్, రూ.200 పాకిస్థాన్ కరెన్సీని కూడా స్వాధీనం చేసుకున్నట్లు బిఎస్‌ఎఫ్ తెలిపింది.

## 'సత్తా చోరీ'లో బిజెపి సర్కార్ నిమగ్నం



కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి సర్కార్ మరో చోరీకి పాల్పడబోతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. 'ఓటు చోరీ' తర్వాత, బిజెపి ఇప్పుడు 30 రోజుల్లో ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చివేసే బిల్లులను తీసుకురావడం ద్వారా 'సత్తా చోరీ'లో నిమగ్నమైందని విమర్శించారు. అరెస్టును ఆయుధంగా ఉపయోగించి ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచే బిల్లులను తీసుకువస్తుందని మండిపడ్డారు. ఈ బిల్లులు పౌరులు ఎన్నికైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే లేదా తొలగించే హక్కును తొలగిస్తాయని, ఇడి, సిబిఐ వంటి సంస్థలకు ఆ అధికారాన్ని ఇస్తాయని ఖర్గే పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై బుల్డోజర్‌ను నడపడం లాంటిదేనని ఖర్గే అభివర్ణించారు. హర్యానా, మధ్యప్రదేశ్ జిల్లా కాంగ్రెస్ కమిటీలకు (డిసిసి) కొత్తగా నియమితులైన అధ్యక్షులతో ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. బూత్, మండల్ కమిటీలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఈ ప్యానెల్‌లలోని వ్యక్తులు పార్టీకి విధేయులుగా ఉండేలా చూసుకోవాలని, కాంగ్రెస్ సిద్ధాంతం నుండి వైదొలగకుండా చూసుకోవాలని ఖర్గే డిసిసి చీఫ్‌లను హెచ్చరించారు. 'జిల్లా అధ్యక్షుడు తన ఆధ్వర్యంలో బ్లాక్ కమిటీని ఏర్పాటు చేస్తాడు. ఆయన మండల్, బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తాడు. మీరు ఈ కమిటీలను ఏర్పాటు చేసినప్పుడు, ఈ వ్యక్తులందరూ పార్టీకి విధేయులుగా, కష్టపడి పనిచేసేవారిగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా, వారు కాంగ్రెస్ సిద్ధాంతం నుండి తొలగిపోకూడదు' అని ఖర్గే అన్నారు. ఎవరైనా వారిని ప్రలోభపెట్టినా, వారి విధేయత కాంగ్రెస్ వైపు ఉండాలి, అలాంటి వ్యక్తులు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. కాంగ్రెస్ సంస్థలో జిల్లా ఓరెసిడెంట్ బలమైన లింకని, రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఎన్నుకోవాల్సి వస్తే, శాసనసభలలో అభ్యర్థిని ఎన్నుకోవడంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషిస్తారన్నారు. దేశంలో ప్రభుత్వం ఏర్పాటు కావాలంటే, లోక్‌సభలో గెలవడానికి డిసిసిల మద్దతు అవసరం చెప్పారు.

'ఈ మధ్య, ఈ సంప్రదాయంలో స్వల్ప మార్పు వచ్చింది. మంత్రులు తమకు ఇష్టమైన వారిని జిల్లా అధ్యక్షుడిని చేయడం ప్రారంభించారు. సామర్థ్యం, భావజాలాన్ని విస్మరించడం ప్రారంభించారు. రాహుల్ (గాంధీ) జీ, నేను కాంగ్రెస్‌ను బలోపేతం చేయకుండా, జిల్లా అధ్యక్షులకు ప్రాముఖ్యత ఇవ్వకుండా బలంగా అధికారంలోకి రాలేమని గ్రహించామని' అని పేర్కొన్నారు. కర్ణాటకలోని మహదేవపుర స్థానంలో కుట్ర ద్వారా వ్యూహాత్మకంగా ఓట్లు ఎలా 'దొంగిలించబడ్డాయో' రాహుల్ గాంధీ ఇటీవల వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారని ఖర్గే ఎత్తి చూపారు. ఇటీవల ముగిసిన వర్షాకాల సమావేశాల గురించి మాట్లాడుతూ, ప్రతిపక్షం పార్లమెంట్ పనిచేయాలని, ప్రజల ముఖ్యమైన అంశాలపై చర్చించబడాలని కోరుకుంటున్నట్లు ఖర్గే అన్నారు, అయితే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, 'ఓటు చోరీ' వంటి కీలక విషయాలను చర్చించాలని బిజెపి ప్రభుత్వం కోరుకోవడం లేదని అన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కాంగ్రెస్ ఇచ్చిన బహుమతి అని ప్రజలకు చెప్పాలని ఆయన కాంగ్రెస్ నాయకులను కోరారు.

రాజీవ్ గాంధీ ఓటు వేసే వయస్సును 21 నుండి 18 సంవత్సరాలకు తగ్గించారు, తద్వారా ప్రజాస్వామ్యంలో యువత భాగస్వామ్యం పెరుగుతుంది ఆయన ఎత్తి చూపారు. ప్రతిపక్ష నాయకులపై ఉన్న 193 కేసుల్లో, ఇడి చర్య ఫలితంగా కేవలం రెండు కేసుల్లో మాత్రమే దోషులుగా తేలాడాన్ని చూశామని, చాలా మంది ముఖ్యమంత్రులు, మంత్రులను అరెస్టు చేసి నెలల తరబడి జైలులో ఉంచారని, కానీ ఇప్పుడు వారి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని సిబిఐ చెబుతోందన్నారు. మోదీ నేడు అవినీతి గురించి పెద్దగా మాట్లాడుతున్నారు, కానీ ఆయన అవినీతిపరులుగా పిలిచే వారందరినీ పార్టీలో చేర్చుకున్నారని, వారిని మంత్రులుగా కూడా చేశారని మండిపడ్డారు.

# ఇసి బిజెపి కోసమే పనిచేస్తుంది

ఎన్నికల సంఘం పక్షపాత ప్రవర్తన మారాల్సిన అవసరం ఉంది

ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శలు

రాహుల్, తేజస్వీ మోటార్ సైకిల్ రైడ్



**అరారియా :** కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శలను మరింత ముమ్మరం చేశారు. తూర్పు రాష్ట్రం బిహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) బిజెపికి సహాయం చేయడానికి ఎన్నికల కమిషన్ ఓట్లను దొంగిలించడానికి చేసిన సంస్థాగత ప్రయత్నమని ఆరోపించారు. బిహార్‌లో ఓట్లను దొంగిలించడానికి తాము ఎన్నికల సంఘాన్ని అనుమతించబోమన్నారు. ఆదివారం రాహుల్ గాంధీ ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్, ఇండియన్ ఇండియా కూటమికి చెందిన పలు నియోజకవర్గాల నాయకులతో కలిసి అరారియాలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోల్ ప్యానెల్ బిజెపి ప్రయోజనం కోసం పనిచేస్తోంద మండిపడ్డారు. ఇసి బిజెపి కోసం పనిచేస్తున్నట్లు పూర్తిగా బయటపడిందని రాహుల్ పేర్కొన్నారు. హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటకలో ఓటర్ల జాబితాలను తయారు చేయడంలో జరిగిన అవకతవకలను, జాబితాలో నకిలీ ఓటర్లను ఎలా చేర్చారో తాను బహిర్గతం చేశానని, ఈ విషయంపై ఎన్నికల కమిషన్ తన నుండి అఫిడవిట్ కోరిందని చెప్పారు. కానీ పాలక వర్గానికి చెందిన అనురాగ్ ఠాకూర్ విలేకరుల సమావేశంలో అదే విషయాన్ని చెప్పినప్పుడు, కమిషన్ అతని నుండి ఎటువంటి అఫిడవిట్ అడగలేదని ప్రశ్నించారు. ఈ చర్య ఇసి తటస్థంగా లేదని నిరూపిస్తుందన్నారు. ఎన్నికల సంఘం పక్షపాత ప్రవర్తన మారాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. బిహార్‌లోని అన్ని ఇండియన్ కూటమి నియోజకవర్గాల సభ్యులు రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఐక్యంగా పనిచేస్తున్నారని, ఫలితాలు ఫలవంతంగా ఉంటాయని కాంగ్రెస్ నాయకుడు నొక్కి చెప్పారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న ఎన్నికల కోసం ప్రతిపక్ష కూటమి త్వరలో ఒక సాధారణ మేనిఫెస్టోను విడుదల చేస్తుందని చెప్పారు. బిహార్‌లో చేపట్టిన ఓటరు అధికార్ యాత్ర గొప్ప విజయాన్ని సాధించిందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని, తమకు కోట్లాది మంది రాష్ట్ర ప్రజల మద్దతు లభించిందని హర్షం వ్యక్తం చేశారు. బిహార్‌లో ఎన్నికల సంఘం ప్రజల ఓట్లను దొంగిలిస్తున్నారనే వాస్తవాన్ని ఇది నిరూపించిందని ప్రతిపక్షనేత పేర్కొన్నారు. చిన్న పిల్లలు కూడా ఇప్పుడు 'ఓటు చోర్, గద్దీ చోడ్' (ఓటు దొంగ, అధికార సీటును ఖాళీ చేయండి) అనే నినాదాన్ని లేవనెత్తుతున్నారని, దీన్ని భట్టి తమ యాత్ర ప్రభావాన్ని ఊహించవచ్చన్నారు. అయితే, రాబోయే ఎన్నికలకు మహాఘట్‌బంధన్ తేజస్వి యాదవ్‌ను ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎందుకు ప్రకటించడం లేదనే ప్రశ్నకు ఆయన సమాధానాన్ని దాటవేశారు. తాము ఒకరితో ఒకరం సహకరించుకుంటున్నామని, 'ఓటు చోరీ' (ఓటు దొంగతనం)ని తనిఖీ చేయాలని సూచించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి కె శివకుమార్‌తో పాటు సిపిఐ (ఎంఎల్) లిబరేషన్‌కు చెందిన దీపాంకర్ భట్టాచార్య, విఐపి ముఖేష్ సాహ్ని సహా ఇండియా కూటమికి చెందిన అనేక మంది నాయకులు కూడా సంయుక్త విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. అంతకు ముందు జరిగిన యాత్రలో మాట్లాడుతూ దేశంలోని పేదలు, యువతకు అన్ని ఉపాధి అవకాశాలను మూసివేసినందుకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించిన తర్వాత నరేంద్ర మోదీ ప్రభుత్వం... ఇప్పుడు ఎన్నికల కమిషన్ సహాయంతో ఎస్‌ఐఆర్ ద్వారా పేదల ఓట్లను దొంగిలించాలనుకుంటోంది అని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, దాని మిత్రపక్షాలకు బిహార్ ప్రజలు తగిన సమాధానం ఇస్తారని జోస్యం చెప్పారు.

### రాహుల్, తేజస్వీ మోటార్ సైకిల్ రైడ్

కాగా, రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ ఆదివారం బిహార్ పూర్ణియా జిల్లాలోని అరారియా వీధుల గుండా మోటార్ సైకిళ్లపై 'ఓటర్ అధికార్ యాత్ర' చేశారు. ఈ ఇద్దరు నాయకులను చూడటానికి ప్రజలు వీధుల్లో బారులు తీరారు.

బిహార్ ఎస్‌ఐఆర్ ఓటర్ల నుంచి ఇప్పటివరకూ..

## 98.2శాతం మంది ధృవీకరణ పత్రాలు అందాయ్

తప్పుడు వివరాలు సరిచేసుకునేందుకు

సెప్టెంబరు 1 ఆఖరిగడువు : ఎన్నికల సంఘం వెల్లడి



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్) సందర్భంగా కొత్తగా నమోదు చేసుకున్న వారిలో 98.2శాతం మంది నుంచి ధృవీకరణ పత్రాలు ఇప్పటికే అందాయని ఆదివారం ఎన్నికల కమిషన్(ఇసి) వెల్లడించింది. తాజాగా ప్రచురించిన ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తెలియజేయడానికి మరో 8 రోజుల గడువు ఉంది. ఓటర్లు వారి గణన ఫారమ్‌లను సమర్పించేటప్పుడు వారి వద్ద ఉన్నటువంటి అవసరమైన పత్రాలను కూడా సమర్పించడానికి క్లెయిమ్‌లు, అభ్యంతరాల వ్యవధి అవకాశాన్ని కూడా ఇస్తున్నట్లు ఎన్నికల కమిషన్ నొక్కిచెప్పింది. ముసాయిదా జాబితాలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేయించుకోవడానికి ఇదే చివరి అవకాశమని ఎన్నికల కమిషన్ తెలిపింది. బిహార్ సిఇఓ కార్యాలయం నుండి అందిన సమాచారం ప్రకారం.. ఓటర్ల నుంచి ఇప్పటివరకు 98.2శాతం డాక్యుమెంట్లు అందాయని ఇసి వెల్లడించింది. జూన్ 24నుంచి ఆగస్టు 24వరకు 98.2శాతం మంది వ్యక్తులు వారి డాక్యుమెంట్లు సమర్పించారు. దీని అర్థం ఒక రోజుకు సగటున1.64 శాతం. ఇంకా 8 రోజుల గడువులో సెప్టెంబర్ 1వరకు మిగతా 1.8శాతం ఓటర్లు వారి డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని తెలియజేసింది. ఓటర్ల జాబితాలో పేరు చేర్చాలని అభ్యర్థిస్తూ ఆధార్‌కార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 డాక్యుమెంట్లలో ఏదైనా ఒకటి సమర్పించినట్లయితే అంగీకరించాలని సుప్రీం కోర్టు ఇసిని ఆదేశించిన విషయం తెలిసిందే. ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్‌ఐఇ)ఓటర్ల జాబితాను నిర్వహించడంపై విశ్వాసం ఉంచాలని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టును కోరింది.

సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం..

## సభా సమావేశాలను అడ్డుకోవడం సహేతుకం కాదు

ప్రతిపక్షాలకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హితవు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్, అసెంబ్లీలు బహిరంగ చర్చ, చర్చలకు స్థలాలని, కానీ సంకుచిత రాజకీయాల కోసం ప్రతిపక్షం పేరుతో సభను సెషన్ తర్వాత సెషన్ నడవకుండా చేయడం మంచిది కాదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హితవు పలికారు. ఆయన ఆదివారం ఇక్కడ 'ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్'ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా అమిత్‌షా ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో పదేపదే అంతరాయం, వాయిదాల కారణంగా ప్రతిపక్షాల నిరసనల నేపథ్యంలో కొద్దిసేపైనా కార్యకలాపాలు నిర్వహించకుండానే సమావేశం ముగిసింది. ఎప్పుడైతే పార్లమెంట్‌లో పరిమిత బహిరంగ చర్చ లేదా చర్చ జరగుతుందో అప్పుడు జాతి నిర్మాణంలో సభ సహకారం ప్రభావితం అవుతుందని హోంమంత్రి అన్నారు. ప్రజాస్వామ్యంలో చర్చ జరగాలి. కానీ ఎవరైనా సంకుచిత రాజకీయాల కోసం ప్రతిపక్షం పేరుతో సభను నడపకుండా అడ్డుతగలడం సహేతుకం కాదు. 'ప్రతిపక్షం ఎల్లప్పుడూ సంయమనంతో ఉండాలి. కానీ, ప్రతిపక్షం పేరుతో రోజురోజుకూ లేదా ఒక సమావేశాల తర్వాత సమావేశం నిర్వహించకుండా ఉంటే అది మంచిది కాదు. దేశం దాని గురించి ఆలోచించాలి, ప్రజలూ దాని గురించి ఆలోచించాలి. ఎన్నికైన ప్రతినిధులూ దాని గురించి ఆలోచించాలి' అని ఆయన చెప్పారు. అన్ని చర్చలూ కొంతఅర్థవంతంగా ఉండాలని, స్పీకర్ పదవి గౌరవ ప్రతిష్ఠల్ని పెంచేలా ఉండాలి అని కూడా అమిత్‌షా వ్యాఖ్యానించారు. 'ప్రజల సమస్యలను లేవనెత్తడానికి నిష్పాక్షిక వేదికను అందించడానికి మనం కృషి చేయాలి. ట్రెజరీ, ప్రతిపక్షం రెండింటి వాదనలు నిష్పాక్షంగా ఉండాలి. హౌస్ పనితీరు సంబంధిత సభ నియమ నిబంధనల ప్రకారం ఉండేలా చూసుకోవాలి. హస్తినాపురంలో మహాభారతంలోని ద్రౌపది పాత్రకు జరిగిన అన్యాయాన్ని ఆయన ఉదహరించారు. సభ గౌరవం దిగజారినప్పుడల్లా దేశం తీవ్రపరిణామాలను చవి చూసింది అని అమిత్‌షా ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో లేదా శాసనసభలలో చర్చ జరగకపోతే ఇవి నిర్జీవ భవనాలుగానే మిగిలిపోతాయని అమిత్‌షా అన్నారు. 'ఈ భవనాలలో అభిప్రాయాలను వ్యక్తీకరించే పనిని స్పీకర్ నాయకత్వంలో సభ్యులు చేస్తారు. అప్పుడే అది దేశం, రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేసే ఒక జీవిగా అవుతుంది' అని ఆయన విశదీకరించారు. ఏ చట్టమైనా ప్రజల సంక్షేమం, దేశ సమగ్రాభివృద్ధి పరిపాలనా సామర్థ్యాన్ని నిర్ధారించడం, దేశ అంతర్గత భద్రత, బాహ్య భద్రత లక్ష్యంగా ఉండాలని అమిత్‌షా అన్నారు. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి తొలిసారి ఎన్నికైన విఠల్‌భాయ్ పటేల్‌కు హోం మంత్రి ఈ సందర్భంగా నివాళులు అర్పించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సోదరుడైన విఠల్‌భాయ్ పటేల్ అందించిన సేవలు సంవత్సరాలుగా మసకబారాయని హోంమంత్రి అమిత్‌షా ఆవేదన వ్యక్తం చేశారు.

అదనపు కట్నం కోసం

## భార్యను తగులపెట్టిన కిరాతక భర్త

పారిపోతుండగా కాలిపై పోలీసులు కాల్పులు

గ్రేటర్ నోయిడాలో సంఘటన

కొడుకు ముందే కట్నం జ్వాలల్లో సమిధైన నిక్కీ

**నోయిడా :** తన భార్యను తల్లిదండ్రులతో కలిసి అదనపు కట్నం కోసం తీవ్రంగా వేధిస్తూ నిప్పంటించి తగులబెట్టి చంపిన ఓ కిరాతక భర్త పోలీసులపై ఎదురుతిరిగి తీవ్రంగా గాయపడ్డ ఉదంతం సంచలనం సృష్టించింది. విపిన్ భాటి అనే నిందితుడు పోలీస్ కస్టడీ నుంచి పారిపోతూ పోలీసుల కాల్పుల్లో గాయపడ్డ సంఘటన ఆదివారం గ్రేటర్ నోయిడాలో చోటుచేసుకుంది. నిందితుడు విపిన్ భార్యను కట్నం కోసం వేధిస్తున్నాడని, రూ.36లక్షల అదనపు కట్నాన్ని డిమాండ్ చేస్తూ భార్యకు నిప్పంటించిన కేసులో నిందితుడుగా ఇతడు పోలీస్ కస్టడీలో ఉన్నాడని ఒక అధికారి చెప్పారు. నిందితుడైన విపిన్ భాటిని రోజువారీ వైద్య పరీక్షల నిమిత్తం ఎస్కార్ట్ వాహనంలో తీసుకెళ్తుండగా దాదాపు మధ్యాహ్నం 130గంటల సమయంలో అతడు పారిపోయేందుకు ప్రయత్నించాడని గౌతమ్ బుద్ధ నగర్ పోలీస్ పిఆర్‌ఓ చెప్పారు. అతడిని వెంబడించి పట్టుకునే క్రమంలో పోలీసులు అతడి కాలిపై కాల్చగా నిందితుడు గాయపడ్డాడు. భాటి స్వగ్రామమైన సిర్సా కస్నా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంది. అయితే విపిన్ భాటి ఆయన భార్య నిక్కీని జుట్టుపట్టుకుని లాక్కెళుతున్న ఒక కలతపెట్టే వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోన్న నేపథ్యంలో శనివారం పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. మరో వీడియో క్లిప్పింగ్‌లో నిక్కీ తగులబడుతున్న సమయంలో పరుగెత్తుకుంటూ వచ్చి మెట్లమీదే కుప్పకూలిపోవడం కూడా ప్రసారం అయ్యింది. గురువారం రాత్రి నిక్కీని హాస్పిటల్‌కు తరలిస్తున్న సమయంలో కన్నుమూశారు. అదే కుటుంబంలోని వ్యక్తిని వివాహం చేసుకున్న నిక్కీ అక్క కాంచన్ తన చెల్లిపై విపిన్ భాటి, ఆయన కుటుంబ సభ్యులు కట్నం కోసం దాడి చేస్తూ ఆమెను చంపుతున్న వీడియో రికార్డు చేసింది. 'మమ్మలను రోజుల తరబడి కొడుతున్నారు. వారు రూ.36లక్షలు కట్నం డిమాండ్ చేస్తున్నారు. నిక్కీ మెడ, తలపై గట్టిగా కొట్టారు. ఆమెపై యాసిడ్ విసిరి ఆమె కుమారుడి ముందే ఆమెకు నిప్పంటించారు' అని కాంచన్ విలేకరుల ముందు కంటతడి పెట్టింది. అడ్డుకోవడానికి ప్రయత్నించినప్పుడు తనపై కూడా దాడి జరిగిందని కాంచన్ చెప్పారు. అదనపు డిసిపి సుధీర్‌కుమార్ శుక్రవారం ఈ ఘటనపై మాట్లాడుతూ ఒక మహిళ కాలినగాయాలతో తమ హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యిందని ఫోర్టిస్ హాస్పిటల్ నుంచి పోలీసులకు సమాచారం అందిందన్నారు. తాము ఆమెను చికిత్స కోసం సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌కు సిఫారసు చేశామని తెలియజేశారన్నారు. కానీ పోలీసుల బృందం సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌కు చేరుకునేలోపే ఆ మహిళ గాయాలతో మరణించిందని అదనపు డిసిపి సుధీర్‌కుమార్ వివరించారు. 'విపిన్ భాటి మళ్లీ పెళ్లి చేసుకునేందుకు తన చెల్లి వెళ్లిపోవాలని వారి అత్త మామలు కోరుకుంటున్నారు. వారు నన్ను చెంపదెబ్బ కొట్టారు. నేను గాయపడి రోజంతా స్పృహ కోల్పోయాను 'అని కాంచన్ చెప్పింది. కాగా నిక్కీని ఆమె కుటుంబ సభ్యులు దహనం చేశారు. కాంచన్ ఫిర్యాదుపై పోలీసులు నిక్కీ భర్త విపిన్ భాటి, కుటుంబసభ్యులపై కాస్నా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు అయ్యింది. నిక్కీ, విపిన్ భాటిల వివాహం 2016లో జరిగింది. దంపతులకు ఒక కుమారుడు ఉన్నారు.

## శత్రువు దాడి చేస్తే మన గగనతలం అభేద్యం



బహుముఖ వలయ రక్షణ పరీక్షలు విజయవంతం

**న్యూఢిల్లీ:** భారత గగనతలం అభేద్యమైనదని, శత్రువుల ఆయుధాలు, మానవ రహిత డ్రోన్లు వంటివి ప్రవేశిస్తే క్షణాల్లో వాటిని తుత్తునియలు చేయగలమని ఒడిశా తీరం నుండి చేసిన పరీక్షల ద్వారా డిఆర్‌డిఓ (రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ) నిర్ధారించింది. దీంతో భారత గగనతలానికి బహుముఖ వలయ రక్షణ సామర్థ్యం చేకూరినట్లవుతుంది. సరికొత్త వార్‌ఫేర్‌లో దేశంలో కీలకమైన మౌలిక సదుపాయాలున్న ప్రాంతాలను శత్రు ఆయుధాల నుండి రక్షించడంలో దీనిదే ముఖ్యపాత్ర అవుతుంది. మొదటిసారి ఈ పరీక్షలు జరిగాయి. డిఆర్‌డిఓ సీనియర్ అధికారులు ఈ పరీక్షలను పర్యవేక్షించారు. ఆపరేషన్ సిందూర్ సైనిక చర్య జరిగిన మూడున్నర నెలల తర్వాత డిఆర్‌డిఓ దేశీయంగా తయారు చేసిన ఐఎడిడబ్ల్యుఎస్ అత్యాధునిక వ్యవస్థతో ఈ పరీక్షలు నిర్వహించింది. మన గగనతల వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దుకుని, భారత వాయుక్షేత్రాన్ని అభేద్యంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఒక కమాండ్ కంట్రోల్ వేదిక తయారు చేశారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించిన ఈ పరీక్షలు విజయవంతం కావడంతో ఈ వేదిక ద్వారా మన వ్యవస్థ చక్కగా పని చేస్తున్నాయని స్పష్టమైంది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా డిఆర్‌డిఓకు అభినందనలు తెలియజేశారు. భారత గగనతలంలోకి వివిధ ఎత్తుల్లో అనేక రకాల వేగంతో శత్రువుల విధ్వంసకర ఆయుధాలు ప్రవేశిస్తే క్షణాల్లో వాటిని ధ్వంసం చేసేందుకు వీలుగా డిఆర్‌డిఓ నిర్మించిన బహుముఖ వలయ గగనతల రక్షణ ఆయుధ ప్రయోగ వ్యవస్థ (ఐఎడిడబ్ల్యుఎస్) పనితీరును పరీక్షించారు. ఆధునిక యుద్ధరీతులవల్ల ప్రాంతీయ భద్రతకు సవాళ్ళు ఎదురవుతున్న తరుణంలో భారత సైనిక సామర్థ్యాన్ని మరింత పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత వచ్చింది. ఈ పరిస్థితులలో శత్రువు ఆయుధాలు మన గగనతలంలోకి ప్రవేశిస్తే సత్వరం స్పందించి భూతలం నుండి గగనతలంలోకి వాటిని ధ్వంసం చేయగల క్షిపణులు ప్రయోగించాలి. లేదా డ్రోన్లు వంటివాటిని పనిచేయకుండా తటస్థీకరించాలి. చాలా తక్కువదూరంలో ఉన్న ఆయుధాలను ధ్వంసం చేసేందుకు గగతలంలోకి దూసువెళ్ళే వ్యవస్థ (విఎస్‌హెచ్‌ఓఆర్‌ఎడిఎస్) క్షిపణులు, ఇతర హైపవర్ లేజర్ ఆధారిత ప్రత్యక్ష క్షిపణి ఆయుధా(డిఇడబ్ల్యు)లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఈ పరీక్షల్లో నిర్ధారించారు. ఐఎడిడబ్ల్యుఎస్ అనేది గగనతలంలో బహుముఖ వలయాల రక్షణ వ్యవస్థ. వివిధ ఎత్తులలో శత్రువు ఆయుధాలు మన గగనతలంలోకి ప్రవేశిస్తే వాటిని క్షణాల్లో ధ్వంసం చేసేందుకు ఈ ఐఎడిడబ్ల్యుఎస్ క్షిపణి వ్యవస్థను ఏర్పాటు చేశారు. అదేవిధంగా డిఆర్‌డిఓ ఒక సమగ్ర కమాండ్ కంట్రోల్ అభివృద్ధి చేసింది. ఈ కమాండ్ కంట్రోల్ ద్వారా అన్నిరకాల ఆయుధాలను నియంత్రించేందుకు, ధ్వంసం చేసేందుకు, మన క్షిపణులు సహా వివిధ ఆయుధాలను ప్రయోగించి శత్రు ఆయుధాలను తుత్తునియలు చేసేందుకు ఒక ఏకీకృత నియంత్రణ వ్యవస్థగా ఈ కమాండ్ కంట్రోల్ కీలక విధులు నిర్వహిస్తుంది.

'డిఆర్‌డిఓకు నా అభినందనలు, భారత సాయుధబలగాలు, ఆయుధ పరిశ్రమ ఎంతో విజయవంతంగా ఐఎడిడబ్ల్యుఎస్‌ను అభివృద్ధి చేసింది, ఈ సరికొత్త వ్యవస్థ భారత గగనతలానికి బహుముఖ వలయ రక్షణ సామర్థ్యాన్ని చేకూరుస్తుంది, ముఖ్యమైన మౌలిక సదుపాయాలున్న ప్రాంతాలకు ఇది రక్షణగా ఉంటుంది, శత్రువుల బెదిరింపులకు రక్షణగా ఉంటుంది' అని సోషల్ మీడియా వేదికగా రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఒక ప్రకటన అప్‌లోడ్ చేశారు. దీనికి కమాండ్ కంట్రోల్‌ను డిఆర్‌డిఓ అభివృద్ధి చేసింది. గగనతల రక్షణ కార్యక్రమానికి ఇదొక నోడల్ లేబొరేటరీ. విఎస్‌హెచ్‌ఓఆర్‌ఎడిఎస్, డిఇడబ్ల్యు రెండింటినీ ఇమ్రాత్ రీసెర్చ్ సెంటర్, సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిష్టమ్స్, సైన్సెస్ అభివృద్ధి చేశాయి.

దేశ స్వయం సమృద్ధి అన్వేషణలో...

## 'గగనయాన్' సరికొత్త అధ్యాయం

భవిష్యత్‌లో స్పేస్ మైనింగ్,విశ్వాంతరాళ శోధన

వ్యోమగాముల అభినందన సభలో రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ:** భారతదేశం స్వయం సమృద్ధి (ఆత్మనిర్భర్ భారత్) సాధించేందుకు చేస్తున్న కృషిలో గగనయాన్ ఒక సరికొత్త అధ్యాయానికి చిహ్నంగా నిలుస్తుందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రాబోయేకాలంలో అంతరిక్ష గ్రహాల్లో తవ్వకాలు, విశ్వాంతరాళ అన్వేషణ, అంతరిక్ష వనరుల సేకరణ వంటివన్నీ మానవ నాగరికతకు పునర్నిర్వచనం ఇస్తాయన్నారు. భారతదేశం ఎప్పుడూ ప్రపంచానికి 'వసుధైక కుటుంబం' అనే గొప్ప సందేశాన్ని ఇస్తోందన్నారు. భారత్ 2027లో చేపట్టే గగనయాన్ కోసం ఎంపికైన నలుగురు వ్యోమగాములను రాజ్‌నాథ్‌సింగ్ వజ్రాలుగా అభివర్ణించారు. భారత్ నుండి మొదటిసారి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి విజయవంతంగా వెళ్ళి వచ్చిన వ్యోమగామి శుభాంశు శుక్లాతోపాటు గగన్‌యాన్‌కు ఎంపికైన నలుగురు వ్యోమగాములను ఆదివారంనాడు న్యూఢిల్లీలోని సుబ్రొతో పార్కువద్ద ఎయిర్ ఫోర్స్ ఆడిటోరియంలో రాజ్‌నాథ్‌సింగ్ ఘనంగా సన్మానించారు. భారత వైమానిక దళం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆక్సియం మిషన్ విజయవంతమైన తర్వాత అందులో భాగస్తుడై భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన శుక్లా దేశానికి తిరిగి వచ్చిన తర్వాత మొదటిసారి ఈ అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ క్రిష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా నలుగురినీ గగనయాన్ కోసం ఎంపిక చేశారు. 2024 ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్రమోదీ తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించినప్పుడు మొదటిసారి అధికారికంగా ఈ నలుగురి పేర్లనూ ప్రపంచానికి తెలియజేశారు. 'రోదసీని కేవలం ఒక పరిశోధనా కేంద్రంగా మాత్రమే మనం చూడటం లేదు, ఆర్థిక, భద్రత, ఇంధన, మానవతా విభాగాల భవిష్యత్తుగా చూస్తున్నాం, మనదేశం క్రమంగా భూమిని దాటి అంతరిక్ష శోధనలో కొత్త సరిహద్దులకు విస్తరిస్తోంది, ఇప్పటికే చంద్రుడి నుండి అంగారక గ్రహం వరకూ మన ముద్రవేసుకున్నాం, ఈనాడు భారతదేశ గగనయాన్ వంటి సాహసకృత్యాలకు సిద్ధం అవుతోంది, ఈ విజయాలను కేవలం సాంకేతికపరమైన మైలురాళ్లుగా మాత్రమే చూడకూడదు, ప్రపంచంలో రోదసీ అన్వేషణలో అగ్రదేశాల సరసన భారత్ కూడా సమానంగా నిలబడుతోందని మనం గర్వంగా భావిస్తున్న సమయంలో స్వయంసమృద్ధి సాధన దిశగా భారతదేశం చేస్తున్న ప్రయాణంలో గగనయాన్‌ను ఒక నూతన అధ్యాయంగా చూడాలి. భారత రోదసీ కార్యక్రమం కేవలం ప్రయోగశాలకు మాత్రమే పరిమితం కాదు, వాహకనౌకలకు మాత్రమే పరిమితం కాదు, మన ప్రపంచదృక్పథానికి ఒక ప్రతిబింబం' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. చంద్ర యాన్ దగ్గర నుండి మంగళయాన్ వరకూ పరిమితమైన వనరులతో భారతదేశం తన సత్తాను చాటుకుంది, అపరిమితమైన ఆత్మస్థైర్యాన్ని చాటి చెప్పింది, అత్యంత సవాళ్ళతో కూడిన లక్ష్యాను సాధించేందుకు మన సంకల్పశక్తిని అసాధారణమైన విజయాలుగా మార్చగలుగుతామన్నారు. కార్యక్రమంలో సిడిఎస్ (రక్షణ సిబ్బంది ప్రధానాధిపతి) జనరల్ అనిల్ చౌహాన్, ఐఎఎఫ్ ప్రధాన ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ తదితరులు పాల్గొన్నారు. శుభాంశు శుక్లా సతీమణి, ఆయన కుమారుడు, కుటుంబ సభ్యులు ఇతర గగనయాన్ వ్యోమగాముల కుటుంబీకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రాంతీయ పార్టీల్లో తిరుగుబాటు సృష్టించేందుకే..


ఆ బిల్లులపై అఖిలేశ్ ధ్వజం

**లక్నో :** ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులను అనర్హులుగా ప్రకటించే చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చిందని, ప్రతిపక్ష నాయకులను వేధించడం, ప్రాంతీయ పార్టీలపై ఒత్తిడి తీసుకురావడం, వారిలో తిరుగుబాట్లను ప్రేరేపించడమే లక్ష్యంగా పెట్టుకుందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. తీవ్రమైన ఆరోపణలపై వరుసగా 30 రోజుల పాటు అరెస్టయిన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు లేదా మంత్రులను అనర్హులుగా ప్రకటించడానికి లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లులను ప్రస్తావిస్తూ... ఈ చర్య రాజకీయ ప్రేరేపితమని తెలిపారు. ఆదివారం ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో అఖిలేశ్ విలేకరులతో మాట్లాడుతూ 'ఈ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టాలని, ప్రాంతీయ పార్టీలపై ఒత్తిడిని సష్టించాలని, వారిలో తిరుగుబాట్లను సిద్ధం చేయాలని కోరుకుంటోంది. ఎన్నికల సమయంలో వారు ఎలా దోపిడీకి పాల్పడి ఓట్లను దొంగిలించారనే దానిపై నిజమైన చర్చ నుంచి దృష్టిని మళ్లించడానికి వారు ఉద్దేశపూర్వకంగా ఈ బిల్లును తీసుకువచ్చారు'అని విమర్శించారు.




# మానవ హక్కుల యుద్ధనౌక తస్లీమా

మత మౌఢ్యాన్ని నరనరాన జీర్ణించుకున్నవారికి, పురుషాధిక్యాన్ని ప్రదర్శించేవారికి తస్లిమా నస్రీన్ అంటే పడదు. మానవ హక్కులపై ఆమె గళమెత్తడం నచ్చదు. మహిళల అణచివేతకు వ్యతిరేకంగా నినదించడాన్ని, పురుషాధిక్యాన్ని ప్రశ్నించడాన్ని వారు సహించలేరు. అందుకే, ఆమె గళాన్ని నొక్కివేయడానికి ప్రయత్నిస్తునే ఉన్నారు. ఆమె కలానికి సంకెళ్లు వేయడానికి కుట్రలు పన్నుతునే ఉన్నారు. ఎన్ని బెదిరింపులు వచ్చినా... ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆమె తన మాట మార్చలేదు. బాట వీడలేదు. తస్లిమా అంటేనే మత మూఢత్వపు కట్టడాలను కూల్చిన విప్లవ స్వరం. దక్షిణాసియా ఖండం మతపు గోడలతో, లింగ అసమానతలతో, పితృస్వామ్యపు పోకడలతో కునారిల్లిపోతున్నప్పుడు, ఆ గోడల్ని ఛిద్రం చేసేందుకు గళం విప్పిన ఏకైక మహిళా రచయిత తస్లిమా. ఆమె పదాలు వసంత గీతాలు కావు.. అవి సమాజపు గుండెలో దూసుకుపోయే వజ్రాయుధాలు. ఆమె భాష వర్ణాల సౌందర్యం కాదు.. అది తిరుగుబాటు గర్జన. ఆమె వ్యక్తిత్వం ఒక రచయిత్రి సరిహద్దులు దాటింది. ఆమె మానవ హక్కుల యుద్ధనౌకగా మారింది. 1962 ఆగస్టు 25న బంగ్లాదేశ్‌లోని మైమెన్సింగ్ జిల్లాలో జన్మించిన తస్లిమా చిన్ననాటి నుంచే మతపరమైన ఆచారాలు, స్త్రీలపై వేసే ఆంక్షలు, కులవివక్షలను నిరసించింది. ఆమె తండ్రి వైద్యుడు. అయినప్పటికీ, సంప్రదాయ విశ్వాసాలకు బద్ధుడు. తల్లి మతపరమైన ఆచారాల్లో మునిగితేలే గృహిణి. ఈ వాతావరణంలో పెరిగిన తస్లిమా, చుట్టూ ఉన్న అసమానతల గోడలను దగ్గర నుంచి గమనించింది. ఆమె కళ్ల ముందు చిన్న వయసులోనే జరిగిన హిందూ–ముస్లిం ఉద్రిక్తతలు, స్త్రీలపై మతాధిపత్యం, పేదరికపు గాయాలు వంటి ఘటనలు సజీవ చిత్రాల్లా నిలిచిపోయాయి. ఈ అనుభవాలే తస్లిమాలో తర్కశక్తికి బీజం వేశాయి. తండ్రి మాదిరిగానే తస్లిమా వైద్య విద్య పూర్తి చేసి డాక్టర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించింది. అయితే, తండ్రి మాదిరి మత విశ్వాసపు అడ్డుగోలను నిర్మించుకోలేదు. ఆమె ఆసుపత్రుల గదుల్లో కేవలం రోగాలను మాత్రమే కాదు, సమాజపు గాయాలను కూడా చూసింది. ప్రసూతి వార్డుల్లో బాల్య వివాహాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్న చిన్నారి వధువులు... గర్భస్రావం కోసం బలవంతంగా ఆసుపత్రులకు వస్తున్న స్త్రీలు.. మతం పేరుతో వైద్య సహాయం నిరాకరించే కుటుంబాలు... ఇలా, ఆసుపత్రిలోనే ఆమె సమాజ స్వరూపాన్ని, మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలను చూసింది. అర్థం చేసుకుంది. వారిలో నెలకొన్న అమాయకత్వం.. అంతులేని భయం తస్లిమా మస్తిష్కంలో ఆలోచనల విస్ఫోటనానికి కారణమయ్యాయి. అక్కడి దృశ్యాలు ఆమె కలంలో విప్లవాగ్ని రగిలించాయి. అందుకే ఆమె డాక్టర్ గౌను తీయగానే, కలాన్ని ఒక సామాజిక శస్త్రచికిత్సకు పరికరంగా మార్చుకుంది. తస్లిమా పేరు వినగానే ముం దుగా గుర్తుకొచ్చే నవల 'లజ్జ'. అది మత మూఢత్వంపై ఆమె చేసిన మెరుపుదాడి. 1993లో వెలువడిన ఈ నవల ఆమె జీవితాన్ని శాశ్వతంగా మార్చింది. ఈ పుస్తకం ఒక హిందూ కుటుంబం కథ. కానీ, లోతుగా పరిశీలిస్తే, అది మత హింసకి వ్యతిరేకంగా రాసిన అగ్నిగీతంగా దర్శనమిస్తుంది. 'మనుషుల మధ్య గోడలు మతం నిర్మిస్తుంది.. మతం తొలగిపోతే, మనుషులు మాత్రమే మిగిలిపోతారు' అంటూ, బంగ్లాదేశ్‌లోని పరిస్థితులను లోకానికి తెలియచెప్పింది. ఈ కారణంతోనే అక్కడి మత ఛాందసవాదులు 'లజ్జ' నవలపై నిప్పులు చెరిగారు. ఆ పుస్తకాన్ని నిషేధించారు. తస్లిమాపై ఫత్వాలు జారీ అయ్యాయి. ఆమెను హతమారిస్తే భారీ నజరాలు ప్రకటించారు. ఇంతలా ప్రాణాలకు ప్రమాదం పొంచివున్నా, తస్లిమా వెరవలేదు. వెనుకడుగు వేయలేదు. 'నా కలం మూగబోతే, మానవత్వం చచ్చిపోతుంది' అంటూ తన వైఖరిని తేల్చిచెప్పింది. ఫలితంగా ఆమె జీవితం ఒక డాక్టర్ వృత్తికో లేదా రచయిత్రిగా ప్రవృత్తితో పరిమితం కాకుండా, ప్రతిఘటనలకు వేదికగా మారింది. కలాన్ని వీడని ఆమె, సామాజిక రుగ్మతలపై, ప్రత్యేకించి మహిళల అణచివేతపై రణన్నినాదాన్ని పూరించింది. తన స్వీయ అనుభవాలతో రాసుకున్న ఆత్మకథల్లో ఎన్ని రక్తపు చారలో.. ఎన్ని కన్నీటి మరకలో.. ఎన్ని ఆవేశపు గర్జనలో! ఆమె అంధవిశ్వాసాలను వ్యతిరేకించింది. లింగ వివక్షను ఖండించింది. ఆమె రాసిన మరో పుస్తకం 'ద్విఖండిత' విడుదలైన మరుక్షణం నుంచే, పుస్తక ప్రదర్శన కేంద్రాల వద్ద ఆందోళలు మొదలయ్యాయి. 'నేను ఇస్లాం వ్యతిరేకిని కాను.. మతం పేరుతో జరుగుతున్న మనుషుల హత్యలకు వ్యతిరేకిని' అని తస్లిమా స్పష్టం చేసినా, అంధవిశ్వాసాల ఊబిలో కూరుకుపోయిన వారి చెవికి చేరలేదు. పురుషాధిక్యతను ప్రదర్శించేవారి తీరు మారలేదు. ప్రాణాలు తీయాలన్న ఫత్వా విడుదలైన తర్వాత, గత్యంతరం లేని పరిస్థితుల్లో దేశాన్ని విడిచిపెట్టాల్సి వచ్చిన తస్లిమా, బహిష్కరణలో గడిపిన రోజులను గుర్తుచేసుకుంటూ, హృదయావేదనతో రాసిన పుస్తకం 'నిర్వాసన'. ఈ పుస్తకం చదివితే, స్వేచ్ఛ కోసం పోరాడే ప్రతి హృదయం కన్నీరు పెట్టుకుంటుందని ప్రముఖ సాహితీ విమర్శకుడు సునీల్ గంగోపాధ్యాయ వ్యాఖ్యానించారు. స్త్రీ స్వేచ్ఛ అనేది తస్లిమాకు కేవలం సాహిత్య అంశం కాదు.. అది ఆమె జీవన ధర్మం. మహిళల శరీరం, మనసులపై మతం, కుటుంబం, సమాజం వేసిన అధికార తాళాలను ఆమె విరిచేసింది. కలంతో ప్రకంపనలు సృష్టించింది. సామాజిక అకృత్యాలకు వ్యతిరేకంగా సునామీ సృష్టించింది. పురుషాధిక్యానికి ఆమె సవాళ్లు విసిరింది. సాహిత్యం మాధ్యమంగా తిరుగుబాటు బావుటా ఎగురవేసింది. ఆమె వాక్యాలు స్త్రీ స్వేచ్ఛను కోరే శంఖనాదాలుగా వినిపిస్తాయి. 'స్త్రీ శరీరం దేవాలయం కాదు.. అది ఆమెకు మాత్రమే చెందిన విశ్వం' అనే సిద్ధాంతాన్ని తస్లిమా నమ్మింది. అణచివేతకు గురవుతున్న ప్రతి మహిళకూ ఇదే సూత్రాన్ని ఉద్బోధించింది. ఒక మహిళ ఈ రకంగా తిరుగుబాటు చేయడం మత పెద్దలకు నచ్చలేదు. పాలకులకు మింగుడుపడలేదు. ఫలితంగా, 1994లో బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆమెపై కేసులు నమోదు చేసింది. ఆమెను స్వదేశం విడిచి వెళ్ళమని నోటీసులు జారీ అయ్యాయి. ఫలితంగా ఆమె బంగ్లాదేశ్‌ను విడిచిపెట్టింది. భారత్‌కు వచ్చి కోల్‌కతా, ఢిల్లీ, హైదరాబాద్ నగరాల్లో కొద్దికాలం ఉంది. స్వీడన్, అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాలకు వెళ్లింది. మళ్లీ భారత్ వచ్చింది. ఇక్కడ నివసించేందుకు ఆమె అనుమతి పొందింది. తస్లిమా ఎక్కడ ఉన్నా.. ఆమె నోరు నొక్కేయడానికి ప్రయత్నాలు జరిగాయి. ఇప్పటికీ జరుగుతునే ఉన్నాయి. కానీ, ఆమె కలం ఆగలేదు. 'నాకు నేల లేకపోవచ్చు.. కానీ నాకు స్వరం ఉంది' అంటూ, అంతులేని ఆత్మవిశ్వాసంతో ఎలుగెత్తి చాటుతున్నది. 'తస్లిమా పదాలు సాహిత్యం మాత్రమే కాదు.. అవి మానవ హక్కుల తుపాకీ గుళ్లు' అంటాడు ప్రముఖ విమర్శకుడు, ఆర్థిక శాస్త్ర నిపుణుడు, నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్. ఆయన మాటలు అక్షర సత్యాలు. 'మనిషి స్వేచ్ఛకు మతం అడ్డుగా వస్తే, ఆ మతాన్ని ప్రశ్నించడం పాపం కాదు.. ధర్మం' అని నినదిస్తున్న తస్లిమాను మత వాదులు వ్యతిరేకిస్తే, సమానత్వం కోసం పోరాడుతున్న యోధురాలిగా కొందరు అభివర్ణిస్తున్నారు. ఆమె భాష విప్లవాత్మకంగా ఉందని, సమాజాన్ని మరింత ఉద్రిక్తతలకు గురి చేయడమే ఉద్దేశంగా కనిపిస్తున్నదని మరికొందరి అభిప్రాయం. ఎవరు ఏమనుకున్నా తస్లిమా తన పోరాటాన్ని కొనసాగిస్తునే ఉంది. 'మౌనమే అజ్ఞానానికి మూలం' అంటూ, అణచివేతలకు వ్యతిరేకంగా గళం వినిపిస్తునే ఉంది. ఆమె ప్రతి అక్షరం సుడిగాలిలా శరవేగంగా






కదులుతునే ఉంది. ప్రతి పదం, మతం పేరుతో దోపిడీ చేస్తున్న వారి పాలిట ఆయుధంగా మారుతున్నది. ఆమె రాసే ప్రతి పుస్తకం ఓ అగ్నికణం. 'ఆమె వాక్యాలు నదుల్లా ప్రవహించవు.. అగ్నిపర్వతాల్లా విస్ఫోటనం చెందుతాయి. ఆమె సాహిత్య విప్లవకారిణి' అంటాడు సాహిత్యకారుడు హుమాయున్ అహ్మద్. ఇది ముమ్మాటికీ నిజం. ఆమే ఒక మానవ హక్కుల ఉద్యమం, స్త్రీ స్వేచ్ఛా శంఖానాదం. మతదురాచారాలపై పేలిన అగ్నిపర్వతం. 'పుస్తకాల కంటే స్వేచ్ఛ పవిత్రం' అంటున్న తస్లిమా, 'మతాలకంటే మానవత్వం శాశ్వతం' అనే వాదనను బలంగా వినిపిస్తున్నది. మన సమాజంలో, మతపు గోడలు, కులపు బంధనాలు, స్త్రీ శరీరంపై పితృస్వామ్యపు తాళాలు అనే మూడు ప్రధాన రుగ్మతలు శతాబ్దాలుగా మానవత్వాన్ని శ్వాస తీసుకోనివ్వని సంకెళ్లు. వాటిని సమూలంగా తుడిచివేయడానికి కలం పట్టిన ఉద్యమకారిణి తస్లిమా. లోతుగా పాతుకుపోయిన మూఢ నమ్మకాలపై ఆమె రచనలు పిడుగుల్లా విరుచుకుపడతాయి. చీకట్లను ముంచే ప్రళయకాల ఝంఝామారుతంలా పెకళించివేస్తాయి. ప్రజా గర్జన ఆమె. ప్రతిఘటనకు ప్రతీక ఆమె. స్వేచ్ఛకు సంకేతం ఆమె. అరాచక విశ్వాసాల పంజరంలో తాళం వేసి కూర్చోని పిట్ట కాదు తస్లిమా... స్వేచ్ఛపై పరితపిస్తూ, వినువీధుల్లో విహరించే విహంగం. మతపరమైన హింసను నిర్మొహమాటంగా ఖండించే చండిక. అన్యాయాలపై కత్తిపట్టే వీరవనిత. అందుకే, 'నన్ను భయపెట్టలేరు. భయమే నా శత్రువు కాదు. అజ్ఞానమే, అసహనమే, మూఢత్వమే నా అసలు శత్రువులు' అని గొంతెత్తి చాటుతున్నది. కలాన్ని ఆయుధంలా మార్చి సవాళ్లు విసురుతున్నది. తస్లిమా సాహిత్యం కేవలం మతపరమైన అంధత్వంపైనే కాదు, స్త్రీలపై జరిగే అణచివేతపైన కూడా నిలదీస్తుంది. స్త్రీ శరీరంని సాంప్రదాయం పేరుతో బంధించడాన్ని తస్లిమా తిరస్కరించింది. స్త్రీ హక్కుల కోసం పోరాడటం కేవలం వ్యక్తిగత విషయం కాదు, మానవ హక్కుల యుద్ధమని ప్రకటించింది. స్త్రీ శరీరం మీద ఎవరికీ హక్కు భుక్తం కాదని, స్త్రీ స్వేచ్ఛ అనేది ఆమెలోని దైవత్వమని తన ప్రతి రచనలోనూ ప్రకటిస్తునే ఉంది. ఆమె రచనలు 40కి పైగా భాషల్లోకి అనువాదమయ్యాయంటే, వాటి స్థాయి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా స్త్రీ విముక్తి ఉద్యమాలలో, మతస్వేచ్ఛ పోరాటాలలో ఆమె పేరు ఒక ప్రతీకగా మారింది. అణచివేతలలో జీవించే వారికి ధైర్యమిచ్చే వెలుగైంది. ఆమె కలం ఒక అగ్ని పుంజం. ఆమె స్వరం ఒక జ్వాలా తోరణం. మహిళల స్వేచ్ఛ కోసం.. తరతరాల బానిసత్వం నుంచి వారి విముక్తి కోసం.. పురుషాధిక్యత నుంచి వారిని కాపాడడం కోసం తస్లిమా చేస్తున్న కృషి ప్రశంసనీయం. మతానికి వ్యతిరేకిని కానని, అయితే, మతం పేరుతో జరిగే దోపిడీని, అణచివేతను, అక్రమాలను క్షమించలేనని స్పష్టం చేస్తున్న తస్లిమా కలం నుంచి మరెన్నో కాలాతీత రచనలు వెలువడతాయని ఆశిద్దాం.

> 'నేను ముందుకు వెళ్ళబోతున్నాను
> నా వెనుక నా కుటుంబం మొత్తం
> పిలుస్తుంది
> నా బిడ్డ నా చీర కొంగు లాగుతోంది
> నా భర్త తలుపుకి అడ్డంగా నిలబడి
> వున్నాడు
> అయినా నేను వెళ్తాను
> ఎదురుగా నది తప్ప మరేం లేదు'
> (బార్డర్స్/ 'సరిహద్దులు' కవిత
> నుంచి)

> 'చాట కింద ఐదు వేళ్ళతో తడుతూ
> రెండు వేళ్ళతో బియ్యం నుండి
> రాళ్ళు తీస్తూ
> వాళ్ళు తమ సగం జీవితాలు
> గడిపేస్తారు
> వాళ్ళ జీవితాంతం
> ఆ రాళ్ళు వాళ్ళ హృదయాల్లో
> చేరుకుంటుంటాయి.
> ఎవరూ కూడా
> రెండు వేళ్ళతో కూడా
> ఆ రాళ్ళను తాకరు'
> (అనదర్ లైఫ్/ 'మరో జీవితం'
> కవిత నుంచి)

— సత్యశ్రీ

## సమాజానికి దిక్సూచి రాజకీయ సాహిత్యం

క్రమంగా విస్తరిస్తున్న రాజకీయ సాహిత్యం సమాజానికి దిక్సూచిలా మారుతున్నది. వివిధ రాజకీయ సంఘటనలు, భావాలు, సంఘురాలపై సాహిత్య రూపంలో వ్యక్తమయ్యే రచనల ఒక శ్రేణిని రాజకీయ సాహిత్యంగా పేర్కోవచ్చు. ఇది ప్రజలను రాజకీయ చైతన్యం కలిగించడంతోపాటు సమాజంలో మార్పులకు దారితీస్తుంది. రాజనీతిలో జరిగే సంఘటనలు, ఉదాహరణకు పోరాటాలు, రాజకీయ పదవులు, ప్రభుత్వ విధానాలు సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. వీటిని రచయితలు వివిధ రచనల్లో విమర్శనా, స్ఫూర్తిదాయక రూపాల్లో ప్రదర్శిస్తారు. రాజకీయ భావాలు, ఆశలను, నిరసనలు సాహిత్య రూపంలో వ్యక్తం చేస్తారు. కవితలు, కథలు, నాటకాలు వాడి రాజకీయ వర్గాల దృష్టిని ప్రజలముందుకు తెస్తారు. సాహిత్యం ద్వారా ప్రజాస్వామ్య చైతన్యం మరో ప్రధాన లక్షణం. రాజకీయ సాహిత్యం ప్రజలకు రాజనీతిని అర్థం చేసుకునేందుకు, వాటిపై చింతన చేయడానికి, సమాజ సేవార్థంగా వ్యవహరించకు సహకరిస్తుంది. ఇది ప్రజలలో రాజకీయ అవగాహన పెంచుతుంది. రాజకీయ సాహిత్యం సామాజిక వ్యవస్థలో పేదరికం, అసమానతకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రేరణ ఇస్తుంది, హక్కుల పట్ల ప్రజలకూ, పాలకులకు కూడా జాగ్రత్త తీసుకొస్తుంది. రాజకీయ సాహిత్యానికి, సాహిత్య రాజకీయానికి మధ్య భేదం గుర్తించి, ప్రసిద్ధి కోసం లేదా హాట్ పుట్టే వ్యాజ్యం కోసం చేసే ప్రవర్తనలను విమర్శనే ఈ సాహిత్యానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. వివిధ సమయాలలో రాజకీయ సాహిత్యం చరిత్రలో జరిగిన సంఘర్షణలు, విధానాల్ని, సామాజిక ఆలోచనలను ప్రతిబింబిస్తుంది, కేవలం ఆకర్షణ, వినోదం కాదని, అది ప్రజల హక్కుల కోసం ఒక బలమైన యుద్ధంగా నిలబడుతుంది. ఆధునిక రాజకీయ సాహిత్యం: సమకాలీన రాజకీయ పరిణామాలపై వ్యాసాలు, కథలు, కవిత్వం ప్రజల దృష్టిని మార్చడానికి, రాజకీయ మార్పును సూచిస్తుంది. సమాజంలో నిరసనలు, ఉద్యమాల కంటే ఈ సాహిత్యం సాధారణ ప్రజలకి చేరే వేదికగా నిలుస్తుంది. మొత్తం మీద, రాజకీయ సాహిత్యం రాజకీయ సంఘటనలను, భావాలను, సంఘురాలను సాహిత్య రూపంలో ప్రబలంగా ప్రతిబింబించి సమాజంలో ప్రజాస్వామ్య, న్యాయం, సమానత్వం వంటి విలువలకు మార్పులు తీసుకువస్తుంది. దీని ద్వారా సాహిత్యం ఒక సామాజిక, రాజకీయ మార్పు సాధనంగా పని చేస్తుంది.

ఈ వారం కవితలు

## పిల్లలను ప్రేమించలేని..!

ఈ ప్రపంచం మనది కాదురా అయ్యా....!
సమాజ నిర్మాతల్ని బిచ్చగాళ్లను చేసిన
ప్రపంచం ఇది గదరా అయ్యా...!

కుల వృత్తులను కుళ్ళపొడిచి...
ఏ ఆసరాలు లేకుండా చేసిన
ఆధిపత్య అహంకార వ్యవస్థపై
కోపం కట్టలు తెగుతుంది...

దొంగ లంజాకొడుకు లెసలే మసలే ధూర్త
రాజ్యంలో అన్నోడు మహాకవీ అయ్యిండు...
ఆధిపత్య ఆంబోతుల అగ్రకుల దురహంకారం..
ఇంకెన్నాళ్లు అంటే నన్ను కులం వెంటాడింది
ఆగ్రహ ప్రకటనకూ అగ్రవర్ణమే కావాలా?

మాకు పాలించే లక్షణాలు లేవా?..
కావ్యాలు రాసే సత్తువ లేదా?.

వాల్మీకి వ్యాసుడు ఎవరు రా?..
ద్రౌపది ఒలువలుస్తుంటే మాట్లాడిన విదురుడు
ఎవరురా?..
బడుగులను గేలి చేసే సామెతలు చేసి...
బతుకులకు గోసాకు రంగులు పులిమి..
కాలమెంత దుర్మార్గంగా దూసుకుపోతూ ఉంటే
వీపులు కాయలు కాస్తుంటే..

రక్తం శరీర గట్టు తెగి ప్రవహిస్తుంది
గాయం నిప్పులా జ్వలిస్తుంది

నడిగడ్డ ఆంజనేయ..
కుళ్ళ పొడిచిన నీ దేహం
సాక్షిగా.. నువ్వే చెప్పు..
నీ గాయాల సాక్షిగా గొంతు
విప్పు..



బడుగు బిడ్డల గురుకులాన్ని..
ఆత్మహత్యల కేంద్రాన్ని చేసింద్రు..

బిడ్డల సావుల్ని చూసి..
చదువుల తల్లి ఎక్కెక్కి ఏడుస్తుంటే
ఐపీఎస్ చదువులు ఏం చేయాలి...
ఐఏఎస్‌లు ఏం చేయాలి..
కవుల కళాలు ఏం చేయాలి..
సృజన లోకం సోక్కుబడ్డదా..

కన్నీటి కథల్ని రాయలేని
మూగజీవాల గోసనూ చెప్పలేని
కావ్యాలేం కావ్యాలు.

ఇవి చెప్పలేని రవీంద్రభారతులు...
మృత సృజన సమ్మేళనాలే...

బడుగుల బిడ్డలు ఉరితాళ్ళకు వేలాడుతుంటే..
సృజనకారులు శాలువాలు కప్పుకుంటారా?..

కలుషిత ఆహారం... కల్పిత నీళ్లను ఇచ్చే
వాళ్లను.. నిలదీయలేని కలాలు కలాలేనా..

భావితరాల కలలను చెరిపేస్తుంటే పాలకుల్ని
నిగ్గదీయలేని రచనలు ఎందుకు...
జ్ఞానం గడ్డ కట్టిన సమాజానికి మనుగడ
లేదు...


చదువుల బిడ్డలు శవాలైతుంటే
పాలకుడు ఎవరైనా? ఎంతటి వారైనా
కవులు వెంటాడే కరవాలాలు కావాలి...
మా బిడ్డల్ని చంపే అధికారం నీకు ఎవరు
ఇచ్చారని అడిగే ప్రశ్నల కొడవళ్లు కావాలి

పువ్వులను, పిల్లలను పిల్లల నవ్వులను
ప్రేమించలేని ఈ రాజ్యాన్ని, రాజ్యాధికారాన్ని
ఉరికంబం ఎక్కించమని అడగండి.

— జూలూరు గౌరీ శంకర్

## ఎలా తప్పిపోతుంది..!!

నేలలో తెగి
మిగిలిపోయిన వేళ్ళు
ఏ ఒరిగిన అమరవీరుల్ని
గుర్తు చేసుకుంటున్నాయో !
ఎన్నెన్ని అంకురాలకు
ఆ నెత్తుటి వారసత్వాన్ని
జీవధాతువుగా
అందిస్తున్నాయో !
ప్రసవవేదనా పిడికిళ్ళు
మరో ఎర్రని పిడికిళ్ళను
పుట్టుకనిచ్చాయనే కదా
పేగు బంధాన్ని కొరివితో
తెగ్గోస్తున్నారు !
ముక్కలుముక్కలుగా
నరికి గాయాల్ని
విడగొడుతున్న
విద్రోహంతో పోరాటానికి
ఆ గాయాలన్నీ
ఒకే గుండెగా స్పందించక
తప్పదు !
ఎన్ని తెగిపోతున్న రక్తనాళాల్ని
అతికించేందుకు
ఎంత కన్నీటీ లేపనం కావాలో !
చుచ్చుబడిపోతున్న
ఎన్నీ జీవనాడుల్నో
ఎన్నెన్ని నెత్తురోడే కలాలతో





బతికించుకోవాలో !
వాతలు దేరిన కళ్ళు నోళ్ళు
తెరుస్తున్నాయందుకే !
నా చూపులు సూర్య ప్రవాహాల్ని
సారిస్తున్నాయి !
ఆకలికి, అన్నానికి మధ్య
ఉక్కు రెక్కల బంగారు గెద్దలు
పహారా కాస్తుంటే
భూగోళమంత చెమటచుక్క
నిప్పుకొండై పేలక తప్పదు !
మట్టి పొరల్ని చీల్చుకొచ్చే
పచ్చని మొలక
విత్తుకిచ్చిన మాట
ఎలా తప్పిపోతుంది ...?

— శోభా రమేష్
కాకతీయ విశ్వవిద్యాలయం
8978656327

చదవాల్సిన పుస్తకం

## సురవరం సుధాకర రెడ్డి వ్యాసాలు.. లేఖలు



భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శ్రేణులకు మార్గదర్శకుడిగా, ప్రజా ఉద్యమాల నిర్మాణ వ్యూహకర్తగా, పార్లమెంటేరియన్‌గా అందరికీ తెలిసిన కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి ఓ గొప్ప విశ్లేషకుడు, రచయిత కూడా. ఎన్నో పత్రిల్లో ఆయన వ్యాసాలు, బహిరంగ లేఖలు ప్రచురితమయ్యాయి. వాటిలో కొన్నింటిని సేకరించి, ప్రచురించిన పుస్తకమే 'సురవరం సుధాకర రెడ్డి వ్యాసాలు.. లేఖలు'. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ ప్రచురించిన ఈ పుస్తకంలో పలు అంశాలపై సురవరం వ్యక్తం చేసిన అభిప్రాయాలతోపాటు, పార్టీ విధానాలు కూడా విస్పష్టంగా ఉన్నాయి. పాఠకులను ఆలోచింప చేస్తాయి. ప్రధానికి వంట గ్యాస్ ధరల పెంపు, భారత తపాలా కార్యాలయాల ద్వారా బంగారు నాణాల అమ్మకం, కన్హయ్య కుమార్ అరెస్టు, బస్తర్ సమస్యల, నోట్ల రద్దు, సేలం ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకం, ఎస్‌సిల వర్గీకరణ వంటి అంశాలపై రాసిన లేఖలు ఈ పుస్తకంలో ఉన్నాయి. సమకాలీన సమస్యలపై స్పందించే ఆయన నైజాన్ని, లోతైన అధ్యయనాన్ని, ప్రజలతో ఉన్న సంబంధాన్ని వ్యక్తపరుస్తాయి. నిత్యం ప్రజల్లో ఉండే మనిషి కాబట్టి, ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యా ఆయనకు తెలుసు. వాటిపై అనర్గళ ఉపన్యాసాలతో ఉద్యమ స్ఫూర్తిని రగిలించడంతోపాటు, వ్యాసాలు, లేఖల రూపంలో లక్షలాది మందిని చైతన్యవంతులను చేశారు. ఈ విషయం ఆయన వ్యాసాల సంకలనాన్ని చదివితే స్పష్టమవుతుంది. పలువురు కమ్యూనిస్టు నాయకులను ఆయన పాఠకులకు పరిచయం చేశారు. ఆహార భద్రత నుంచి బాల నేరస్థుల గృహాల్లో లైంగిక వేధింపుల వరకు, కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద వ్యవసాయ బిల్లుల నుంచి కుట్రపూరిత హత్యల వరకు ఎన్నో అంశాలను ప్రస్తావిస్తూ, లోతైన విశ్లేషణలతో సమగ్ర స్వరూపాన్ని ఆవిష్కృతం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్'లో అసత్యాలు, అర్ధసత్యాలు మాత్రమే ఉన్నాయని పేర్కొంటూ, 'నోటి మాటేనా' అని ఒక వ్యాసంలో నిలదీశారు. మనుస్మృతి భారత రాజ్యాంగానికి ఏ విధంగా వ్యతిరేకంగా ఉందో మరో వ్యాసంలో వివరించారు. మైనారిటీలపై పెరుగుతున్న అసహనాన్ని మరో చోట ప్రస్తావించారు. వ్యవసాయ సంక్షోభం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిన వైనాన్ని వివరించారు. పైపై పూతలాంటి మార్పుల వల్ల ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ అసాధ్యమని తేల్చిచెప్పారు. వియత్నాం, చైనా వంటి దేశాల్లో తన పర్యటన అనుభవాలను పంచుకున్నారు. అక్కడ కమ్యూనిస్టు పార్టీ తెచ్చిన అభివృద్ధిని కళ్లకు కట్టారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడం తక్షణావసరమని హితవు పలికారు. నిత్యం సామాన్యుల వాణిని వినిపించారు. వామపక్ష బాణిని సమకూర్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ పుస్తకంలోని ప్రతి వ్యాసం లేదా లేఖ 'ప్రజాపక్షం'గా దర్శనమిస్తుంది. ప్రజా సమస్యలపై బాధితుల గళమై పాలక వర్గాన్ని ప్రశ్నిస్తుంది... నిలదీస్తుంది.. ప్రతిఘటన పోరాటాల నిర్మాణానికి బాటలు వేస్తున్నది. సురవరం సుధారక రెడ్డి భౌతికంగా మన మధ్యలేకపోయినా, ఆయన ఆశలు... ఆశయాలు ఈ వ్యాసాల మాధ్యమంగా పలకరిస్తునే ఉంటాయి. మార్గదర్శకం చేస్తునే ఉంటాయి.

ప్రతులకు

**నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

## స్మృతిగీతం

మృదువైన స్వభావమున్న కమ్యూనిస్టు యోధుడా!
ఆత్మీయత ప్రతిరూపం ఓ అమృత హృదయుడా!
నిండు జీవితం గడిపిన
ఎర్రసేన నాయకుడా!
ఎర్రెర్రని వందనాలు
అందుకో లాల్ సలాం ! ॥మృదు॥

చెదిరిపోని చిరునవ్వు మీ మోమున కాభరణం
ప్రేమపూర్వ పలకరింత మిత్రత్వపు పులకరింత
పాతతరం కమ్యూనిస్టు వారసత్వ సారథి
నేటితరం నాయకులకు నికార్సయిన వారధి ॥మృదు॥

విద్యార్థుల ఉద్యమాల మీ సమగ్ర నేతృత్వం
విజయాలను సాధించిన అసామాన్య సామర్థ్యం
ఎన్నెన్నో సమరాలను నడిపిన మీ అనుభవం
తెలుగునాట రాజసంగ ఎగిరిన జయకేతనం ॥మృదు॥

నిరంతర అధ్యయనం నిర్విరామ సాధనం
సిద్ధాంతం ఆచరణల తిరుగులేని సమన్వయం
లక్షలాది ప్రజలను ఉర్రూతలూపిన వక్తృత్వం
లక్ష్యం సాధించే దిశగా నిబద్ధకార్యకర్తృత్వం ॥మృదు॥

జాతీయస్థాయిలోన వెలిగిన తెలుగుతేజం
వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమ ప్రవాహం
పార్లమెంట్లో మార్మోగిన ప్రజాగ్రహగళం
జనచేతన విరబూసిన ఉద్యమాలదళం

మీ ఆశయ సాధనకై
శ్రమిస్తాము మేము !
మీ ప్రేరణ కాగడాగ
గ్రహిస్తాము మేము !
ఎర్రెర్రని వందనాలు
అందుకో సురవరం !
మీ ఉద్యమ ప్రస్థానం
మాకు స్ఫూర్తిదాయకం !



ఎస్‌వి సత్యనారాయణ
పూర్వ ఉపకులపతి, పొ.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం

## సామ్యవాద భావజాల స్వరం- సురవరం

ప్రశాంత వదనం ..
అజాత శత్రువుగా పేరుగాంచిన మంచితనం ..
అతనితో మాట్లాడితే... అదొక చారిత్రక అనుభవం
అతని ఉపన్యాసం వింటే ఎన్నో గ్రంథాలు చదివినంత ఆనందం
అతని రాజకీయ శిక్షణ తరగతి
స్వాతంత్ర్య భారత సంగ్రామం చూస్తున్న అనుభూతి
అతడు లోక్‌సభలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే తట్టుకోవడం ఎవరితరం ?
అతడే సామ్యవాద భావజాల స్వరం
యువతరానికి నవతరానికి వరం సురవరం
తరతరాలకు ఆదర్శం అతని సంకల్పం
రెడ్ సెల్యూట్ రెస్పెక్టెడ్ కామ్రేడ్ సుధాకర రెడ్డి
సెలవంటూ ఈ లోకం వదిలి మీరు వెళ్ళినందుకు అభిమానులు శోకంతో
'రెస్ట్ ఇన్ పీస్' అంటున్నారు గాని
అజరామరం అనితర సాధ్యం.

— డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్
9849488498

## బుద్ధవనం సందర్శించిన అడిషనల్ కలెక్టర్

**ప్రజాపక్షం/నందికొండ**: నాగార్జునసాగర్ లోని బుద్ధవనాన్ని ఆదివారం నల్లగొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ నారాయణ అమిత్ కుటుంబ సమేతంగా సందర్శించారు. అతను తల్లిదండ్రులతో కలిసి బుద్ధ వనం సందర్శించగా బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు మహా స్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగింపజేసి బుద్ధవనం కండువాల తో సత్కరించారు. అనంతరం వీరు నాగార్జునసాగర్ డ్యామ్ ను,ఎత్తిపోతల జలపాతాన్ని సందర్శించారు. వీరితోపాటు స్థానిక రెవెన్యూ



ప్రోటోకాల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, టూరిజం గైడ్ సత్యనారాయణ ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం

**ప్రజాపక్షం/ నల్లగొండ** : ( కట్టంగూర్) ప్రభుత్వంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఆదేశించారు. ఆదివారం కట్టంగూర్ మండలం ఐటిపాముల గ్రామంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో రూ. 120.00 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న భోజనశాల, వంటశాల భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వంటగదిలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ఈ పాఠశాల ప్రారంభం అయిందని,గౌడ్, ప్రహరి గోడ పెండి నిర్మాణం పూర్తి చేస్తాం ని ఆదేశిద్దాం ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడం జరిగిందని కష్టంగా కాకుండా , ఇష్టంగా చదివితే విజయం సాధించవచ్చని సూచించారు.



## సూర్యాపేట జిల్లాకు 1000 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది

### కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లాలో నిన్నటి వరకు 1600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండేదని, ఆదివారం జిల్లాకు మరో 1000 మెట్రిక్ టన్నుల యూరియా క్రిబ్‌కో వాగన్ ద్వారా వచ్చిందని, దీంతో మొత్తం జిల్లాలో 2600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చిన యూరియాను పిఏసిఎస్‌లు, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేయడం జరుగుతుందని, దీనికితోడు జిల్లాలో 5600 లీటర్ల నానో యూరియాను అన్ని సోసైటీలు ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడుకోవచ్చని, నానోయూరియా వాడటం వల్ల భూసారం తగ్గకుండా నత్రజనిని పైరుకు అందిస్తుందని వెల్లడించారు. రానున్న రోజుల్లో ఇఫ్కో, ఆర్సీఎఫ్ వ్యాగన్ల ద్వారా యూరియా రానుందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు పడుతున్నందున వర్షపు నీరులో నైట్రోజన్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల రైతులు ఎకరానికి కొంత మోతాదులో యూరియా లభిస్తుందని, రానున్న పది రోజుల్లో యూరియా వినియోగం తగ్గించుకోవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు ఈ సీజన్‌లో జిల్లాలో రైతులకు 30వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయడం జరిగిందని, రానున్న రోజులలో యూరియా అందుబాటులో ఉంచడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## రామలింగం మృతి సిపిఐకి తీరనిలోటు



**ప్రజాపక్షం/చివ్వెంల:** ఖంభంపాటి రామలింగం మృతి చెందడం సిపిఐ పార్టీకి తీరనిలోటు అని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు , సిపిఐ మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము అన్నారు. ఆదివారం చివ్వెంల మండలం ఖాసీంపేట గ్రామంలో మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుండి సిపిఐ పార్టీలో ఉంటూ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ మండల నాయకులుగా, పార్టీ గ్రామ కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని అన్నారు. సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్ మాట్లాడుతూ రామలింగం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఈ ప్రాంతంలో ఉద్యమాలు చేసిన ఘనత వారి కుటుంబానికి ఉన్నదని అన్నారు. ఆయనకి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నిమ్మల ప్రభాకర్, రేగటి లింగయ్య, ఎండి పాషా, మహిళ నాయకురాలు దేశగాని హేమలత, ఐతరాజు లింగయ్య పాల్గొన్నారు.

## క్రీడల్లోనూ ప్రావీణ్యం సాధించాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : విద్యార్థులు చదువుకే పరిమితం అవ్వకుండా యోగ, సంగీతం, క్రీడంశాల్లో ప్రావీణ్యం సాధించాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుబ్బారావు సూచించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ముందు వరుసలో ఉండాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖి గ్రామంలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఆదివారం విజ్ఞాన్స్ యూనివర్సిటీ శ్రీ వశిష్ట జూనియర్ కళాశాలల సంయుక్త భాగస్వామ్యంతో నిర్వహించిన క్రీడా సమ్మేళనం 2025 ఘనంగా ముగిసింది. విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్ వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా విద్యార్థులు తమ అత్యుత్తమ ప్రదర్శనలతోఉర్రూతలూగించారు. ఒకరితో ఒకరు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడి విజయాలు సాధించారు. ఈ కార్యక్రమం సందర్భంగా విజ్ఞాన్స్ వర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ఆటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం వలన జిజ్ఞాస, సమర్ధ సమయ పాలన, బుద్ధి స్థిరత్వం, వేగంగా సంగ్రహించుకోగలగడం ఇలా ఎన్నో అంశాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ డా ఎం.సుబ్బారావు, శ్రీ వశిష్ట జూనియర్ కళాశాలల జీఎం వంశీ చంద్ర, అసోసియేట్ డీన్ రాఘవేంద్ర, ప్రిన్సిపల్స్ సతీశ్, రంజిత్లతో పాటు ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుర్తింపు కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం /హాలియా:** హాలియా మున్సిపాలిటీ లోని నూతన గీత కార్మిక సొసైటీ సభ్యులకు గుర్తింపు కార్డులను ఆ సంఘం అధ్యక్షుడు కొమ్మనబోయిన రఘుగౌడ్ పంపిణీ చేశారు. ఆదివారం హాలియాలో ఏర్పాటుచేసిన సమావేశంలో నూతనంగా ఏర్పడిన గీతా కార్మిక సొసైటీ సభ్యులకు ఈ కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుముల గ్రామంలో ఉన్న గీతా కార్మిక సొసైటీ భూముల్లో ఖర్జూర చెట్లు ఏర్పాటు చేసి దాని ద్వారా వచ్చే ఖర్జూర కల్లును విక్రయిస్తామని తెలిపారు. గీతా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. వీటిని గీత కార్మికులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమ్మన బోయిన చంద్రశేఖర్ గౌడ్, పానుగుండ్ల సైదులు గౌడ్, బల్మూరు శ్రీశైలం గౌడ్, వెంకన్న గౌడ్ ,చింతపల్లి వెంకటయ్య గౌడ్, లింగాల రాంబాబు గౌడ్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## పుల్లెంలలో కంఠమహేశ్వర స్వామి బోనాలు



**ప్రజాపక్షం/చండూరు:** మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో ఆదివారం రోజున గౌడ కులస్తులు కంఠమహేశ్వర స్వామి బోనాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఆడపడుచులు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పులతో ఆడుతూ పాడుతూ తరలివెళ్లి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు.

# సాయంత్ర సంధ్య వేళ.. కృష్ణమ్మ పరవళ్లు..

### 26 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల...

### సాగర్‌లో పర్యాటకుల సందడి





**ప్రజాపక్షం/నందికొండ:** వారం రోజులుగా శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఇంకా 416324 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతూ ఉండటంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర పైకి లేపి 363714 క్యూసెక్కుల నీటిని స్పిల్ వే ద్వారా దిగువకు విడుదలచేస్తున్నారు. అయితే కుడి,ఎడమ కాలువలు, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, స్పీల్ వే తో కలిపి మొత్తం అవుట్ ఫ్లో 416324 క్యూసెక్కులు. రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు గాను ఆదివారం సాయంత్రానికి 585 అడుగులుగా ఉండి పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 312.0450 టీఎంసీలకు 297.4350 టిఎంసీలుగా ఉంది.

**పర్యాటకుల సందడి:** ప్రాజెక్ట్ 26 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతూ ఉండటంతో అందులో ఆదివారం సెలవు దినం కావడంతో సాగర్ లో పర్యాటకులతో పూర్తిగా సందడి వాతారణం నెలకొంది. సాయంత్రం సూర్యాస్తమ సమయంలో సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల ద్వారా పాలపొంగులా జాలువారుతున్న కృష్ణమ్మ పరవళ్ళు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది.దీనితో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు పర్యాటకులతో అత్యంత రద్దీగా మారటం గమనార్హం. వాహనాల రద్దీ భారీగా పెరగడంతో స్థానికంగా ఉ న్న లాంచీ స్టేషన్, ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, కొత్త , పాత వంతెనల వద్ద పర్యటకులతో క్రిక్కిరిసిపోవడంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. పర్యాటకుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ టూరిజం శాఖ నాగార్జున కొండకు లాంచీలను మూడు ట్రిప్పులు నడిపారు. ఇంకా పర్యాటకుల రద్దీ తగ్గకపోవడంతో పర్యాటకుల అభ్యర్థన మేరకు రిజర్వాయర్ లో రెండు జాలి ట్రిప్పులను నడిపారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడి మ్యూజియంలోని విశేషాలు, బుద్ధుని అవశేషాలు, మాన్యుమెంట్స్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడినుంచి సాయంత్రం వేళలో ఎత్తిపోతల, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. నాగార్జునకొండకు లాంచి ప్రయాణం తమకు ఎంతో ఆనందాన్ని ఆహ్లాదాన్ని కలిగించిందని ప్రయాణికులు తమ అనుభూతిని వ్యక్తపరిచారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/ రామన్నపేట:** సీఎం సహాయ నిది పేదలకు వరమని కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఆవుల నర్సింహాయాదవ్ అన్నారు. ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారు నాగటి యాదయ్యకు మంజూరైన రూ.48వేల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన పంపిణి చేసి మాట్లాడారు. ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు రిలీఫ్ పండ్ ఆసరాగా నిలుస్తుందనానరు. బాధితులు అవసరమైన సమయంలో సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆవుల నర్సింహా, కందిమళ్ల గోపాల్‌రెడ్డి, ఆవుల సత్యానారాయణయాదవ్, నోముల ప్రవీణ్, ఆవుల క్రాంతికుమార్‌యాదవ్, నోముల యాదగిరి, ఆవుల పర్వతాలు, నోముల సామ్మి, నోముల విష్ణు, సుర్వి సతీష్, చిప్పలపల్లి రామచంద్రం, ఆవుల యాదయ్య, నోముల పర్వతాలు, సుర్వి రాకేష్ పాల్గొన్నారు.

# ప్రతీ పేదవాడికీ ప్రభుత్వ పథకాలు

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిఎస్ఆర్ ఫండ్స్‌తో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్యలు ప్రారంభించారు. అనంతరం ఏర్పాచేసిన సమావేశంలో వారు మాట్లాడు తూ ఆసుపత్రికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంపి నిధుల నుండి ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. గుండాల మండల అభివృద్ధికి తన వంతుగా కృషి చేయడం జరుగుతుందని వారు తెలిపారు. రాష్ట్రంలో ప్రజా పాలనలో ప్రతి పేదకు ప్రభుత్వ పథకాలు అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఇప్పటికే నూతన రేషన్ కార్డులు అందించడం, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్ల అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరి గౌడ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన గుండాల మండల కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని మండలంలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి 24 గంటల వైద్య సదుపాయం కల్పించాలని ఎంపి, ఎంఎల్‌ఏను ఆయన కోరారు. మాజీ ఎంపిపి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నవాబు పేట రిజర్వాయర్ ద్వారా మండలానికి సాగునీరు అందించాలని కోరగా ఎంపి, ఎంఎల్‌ఏలు మాట్లాడుతూ నవాబు పేట రిజర్వాయర్ ద్వారా మండలానికి నీరు అందించిన అసంపూర్తిగా ఉన్న కాల్వలను పూర్తి చేస్తామని, ధర్మాసాగర్ నుండి నవాబుపేట రిజర్వాయర్‌ను నింపి నీరు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరిగౌడ్, మాజీ ఎంపిపి కృష్ణారెడ్డి, డిఎంహెచ్‌వో మనోహర్, వైద్యాధికారి హైమావతి, మాజీ అధ్యక్షులు వెంకన్న, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### మోత్కూర్ మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని వినతి

మోత్కూర్ మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బిసి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆదివారం గుండాల మండల పర్యటనకు వచ్చిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్యలకు బిసి రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ వినతిపై ఎంపి, ఎంఎల్‌ఏలు సానుకూలంగా స్పందించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో బిసి రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు నర్సయ్య, శ్రీనివాస్‌యాదవ్, ఉదమ్ తదితరులు ఉన్నారు.



## గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు అరెస్ట్

### కిలో290 గ్రాముల గంజాయి : 7 సెల్ ఫోన్‌లు..ఒక స్కూటీ..ఒక మోటార్ సైకిల్, ఆటో స్వాధీనం

### సిఐ వెంకటేష్ వివరాలు వెల్లడి

**ప్రజాపక్షం/ నల్లగొండ (నకిరేకల్ ):** అక్రమ గంజాయి రవాణా చేస్తూ, విక్రయిస్తూ, సేవిస్తున్న ఆరుగురు నిందితులను నకిరేకల్ పోలీసులు అరెస్టు చేసి వారి నుండి ఒక జేసీల్ ను పట్టుబడి జరిగిందని సిఐ వెంకటేష్ వెల్లడించారు. ఆదివారం నకిరేకల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిర్మూలనలో బాగంగా ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తూ ఈ నెల 23న మధ్యాహ్నం 12.50 గంటల సమయంలో నకిరేకల్ పట్టణ శివారు లోని తాటికల్ రోడ్ లో గల కుమ్మరి బావి దగ్గర్లోని చెట్ల పొదల వద్ద అక్రమంగా గంజాయి అమ్ముచున్నారని నమ్మదగిన సమాచారం రాగా ఎస్ఐ తన సిబ్బంది తో యుక్తంగా అక్కడికి వెళ్ళి అక్రమ గంజాయి విక్రయిస్తున్న, కొనుక్కొని సేవిస్తున్న ఆరుగురు నిందితులను ఒక జేసీల్ ను పట్టుకొని వారి వద్ద నుండి 01 కిలో290 గ్రాముల గంజాయి, 7 సెల్ ఫోన్ లు, ఒక స్కూటి, ఒక మోటార్ సైకిల్ ఒక ఆటొను నిందితుల నుండి స్వాధీనపరచుకొవడం జరిగిందని తెలిపారు. నిందితుల వివరాలు నల్లగొండ పట్టణానికి చెందిన సమీర్,బోరిగం సంపత్ కుమార్, నకిరేకల్ పట్టణంలోని తాటికల్ రోడ్ లో నివాసం ఉంటున్న యన్నమల్ల సాయిరాం.ముక్కాముల అఖిల్, పాలెం గ్రామానికి చెందిన.పల్లెబోయిన శివ, శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికిచెందిన బండారి వినయ్ ,చివ్వెంల మండలం కోమటికుంట గ్రామానికి చెందిన .కుంచం నవీన్ తో పాటు ఒక బాల నేరస్థుడు కూడా ఉన్నారని తెలిపారు. వీరు సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో గంజాయి అమ్ముతున్నారని తెలిపారు. ఇట్టి కేసును పట్టుబడి చేసిన ఎస్ఐ బి లచ్చిరెడ్డి,ఎస్ఐ. జి క్రిష్ణా చారి ని సిబ్బంది ని జిల్లా ఎస్‌పి అభినందించారు.

## 28లోగా అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** 2025/27 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్‌లోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో ఆయా కోర్సులలో ఖాళీ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో పదవ తరగతి పాసై ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 28లోగా ఆయా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాలద్వారా యువతకు నైపుణ్యంతో కూడిన శిక్షణను అందించి వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 4.0 ఇండ్రస్టి మిషనరీపై రియల్ టైం ప్రాక్టికల్ ట్రైనింగ్‌ను అభ్యర్థులకు ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇంతకు ముందు ఎప్పుడు లేని విధంగా అత్యాధునిక మిషనరీతో ఈ అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాలను నిర్వహించడం జరుగుతున్నదని, ఈ ఎటిసిలో ప్రవేశం పొందిన అభ్యర్థులు అత్యాధునిక మిషన్లపై పని చేస్తూనే పని నేర్చుకోవచ్చని, అనంతరం ఉద్యోగాలు, సొంత వ్యాపారం చేసుకోవడానికి ఈ కోర్సులను రూపొందించడం జరిగిందని తెలిపారు. గతంలో నిర్వహించిన ఐటిఐ లు ఇప్పుడు టెక్నాలజీ హబ్‌లుగా మారాయని, మౌలిక వసతులతో ప్రపంచ స్థాయి ల్యాబ్‌లు, టాటా టెక్నాలజీ సహకారంతో, అలాగే ఇండస్ట్రీల భాగస్వామ్యంతో వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్‌లో ఉన్న ఎటిసిలో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సులో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఇండ్రస్టియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌లో 40 సీట్లు, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నిషియన్ కోర్సులో 20సీట్లు, వర్చువల్ అనాలసిస్, డిజైనర్స్ కోర్సులో 24 సీట్లు, మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులో 24 సీట్లు ఖాళీగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. పైన పేర్కొన్న పోస్టులలో ప్రవేశం పొందేందుకు పదవ తరగతి ఉత్తీర్ణులై అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ కోర్సులక దరఖాస్తు చేసే అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఎస్ఎస్‌సి మార్కుల జాబితా, ట్రాన్స్‌పర్ సర్టిఫికెట్ (టిసి), ఆధార్, కులం ధృవీకరణ పత్రం, బైనఫైడ్, మొబైల్ నెంబర్‌తో పాటు ఈ మెయిల్ అడ్రస్‌ను తప్పని సరిగా జతచేయాలని వెల్లడించారు.

## టిబి వ్యాధిపై అవగాహన ఉండాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని శ్రీ ఆర్కే హాస్పిటల్ చావా ఫౌండేషన్ అధినేత డాక్టర్ రాజకుమార్ అన్నారు. భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్ కె హాస్పిటల్ చావా ఫౌండేషన్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు టీబీ నిర్మూలన కార్యక్రమాన్ని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయి శోభ ఆధ్వర్యంలో నిర్వహించచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ నిర్మూలన కోసం గవర్నమెంట్ అందజేస్తున్న మందులను క్రమం తప్పకుండా కోర్సు పూర్తి అయ్యేవరకు ఉపయోగించాలని కోరారు. మందులు ఆపకూడదని దాని వలన మళ్లీ వ్యాధి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం డాక్టర్ చావా రాజ్ కుమార్, డాక్టర్ చావా అశ్లేష న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిబి నిర్మూలన కార్యక్రమం జిల్లా కార్యవర్గం డాక్టర్లు డాక్టర్ యామిని, డాక్టర్ నిరోషా, శ్రీ ఆర్‌కె హాస్పిటల్ ఇంచార్జీ కొండల్ రెడ్డి, హాస్పిటల్ సిబ్బంది, జిల్లా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


## ఎంపి,ఎమ్మెల్యేలకు సన్మానం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** గుండాల మండల పర్యటన సందర్భంగా వెళ్తున్న ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డినీ ఆత్మకూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్థానిక కాంగ్రెస్ నాయకులతో పలు అభివృద్ధి పనులపై ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు, ప్రధాన కార్యదర్శి కందడి అనంత రెడ్డి, పిఏసిఎస్‌చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



## అమృత్ 2.0 పైప్ లైన్ల పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీలో మంచి నీటి సమస్య పరిష్కారం కోసం డిసెంబర్ 2024 ననాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అమృత్ 2.0 కార్యక్రమపనులకు శంకుస్థాపన చేశారు.44 కోట్ల రూపాయల వ్యయం తో ఈ ప్రాజెక్టును నందికొండ మున్సిపల్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న స్థలంలో నిర్మాణం పూర్తిచేసుకుంది.దీనితో అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న పనులు మున్సిపాలిటీలో నీటి సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే దిశగా అడుగులు వేస్తున్నాయి ఇంటింటికి నల్లాను ఇచ్చి తాగు నీటిని అందించాలని గత ప్రభుత్వం పథకాన్ని రూపుదిద్దింది. అధికారుల అలసత్వంతో సరైన విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయకపోవటం వల్ల అక్కడక్కడా సమస్యలు తలెత్తాయి ఆ తర్వాత ప్రభుత్వం మారీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోమునిసి పాలిటీ పరిధిలోఅమృత్2.0 పనులు మంచినీటి నిల్వ ట్యాంకుల నిర్మాణాలు వేగవంతంగా కొనసాగి పూర్తయ్యాయి. మున్సిపాలిటీలో హిల్ కాలనీ పైలాన్ కాలనీలు ఉండగా మొదట హిల్ కాలనీలో పైపులైన్ల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాదిలోనే మున్సిపాలిటీ ప్రజలకు అమృత్ ధారలు అందించేందుకు స్థానిక ఇరిగేషన్అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఆదివారం పైపులైన్ల ప్రారంభ ప్రక్రియను స్థానిక ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి నివాస గృహం వీధిలో ప్రారంభమైంది. మున్సిపాలిటీలో ఉ న్న ప్రతి ఇంటికి నీటి సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా 24 గంటలు నీళ్లు వచ్చే విధంగా చూడటమే అమృత్ 2.0 యొక్క ముఖ్య ఉద్దేశం కావడంతోస్థానిక ప్రజలకు ఇక నీటి కష్టాలు తీరనున్నాయి.



## ఘనంగా భోనాల మహోత్సవాలు



**ప్రజాపక్షం/జడ్చర్ల:** 44వ జాతీయ రహదారి పక్కన దాబ్ బంగ్లా సమీపంలో ఉన్న శ్రీ బంగారు మైసమ్మకు ఆదివారం మహిళలు ఘనంగా బోనాలను నిర్వహించారు. బోనాల మహోత్సవంలో మహిళలు బోనాలను మొక్కులను తీర్చుకున్నారు. బోనాల మహోత్సవంలో మహిళలు, భక్తులు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్లు, చైతన్య చౌహాన్, బుక్క మహేష్, ప్రశాంత్ రెడ్డి, కుమ్మరి రాజు, జ్యోతి రెడ్డి, శశికిరణ్, చైతన్య గౌడ్, రమేష్ నాయకులు బుక్క వెంకటేశం, నర్సింలు, రమేష్, చంద్రమౌళి, కృష్ణారెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళులు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిపిఐపార్టీ మాజీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని ఎన్‌టిఆర్ చౌరస్తాలో సిపిఐపార్టీ నాగర్ కర్నూల్ జిల్లా మహిళా సమైక్య అధ్యక్షులు ఇందిరమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పేదప్రజల అభ్యున్నతికోసం పనిచేశారన్నారు. రెండుసార్లు ఎంపిగా గెలిచి పార్లమెంటులో ఉపాధిహామీ పథకానికి రూపకల్పనచేశారన్నారు. రాజకీయంగా అందరి మన్ననలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, అలివేల, కృష్ణయ్య, దామోదర్, వెంకటమ్మ, రాజు, కుర్మయ్య పాల్గొన్నారు.



## అలుపెరగని పోరాటయోధుడు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డికి రాష్ట్ర కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో భౌతికకాయానికి సిపిఐ జిల్లా నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి యువజన కార్మిక కర్షక వర్గాల సమస్యల సాధన కోసం అలుపెరగని పోరాటాలు చేసిన మహోన్నతమైన వామపక్ష నిర్మాణాన్ని దేశ వ్యాప్తంగా విస్తృత పరచడంలో అగ్రగణ్యుడు అని తెలిపారు. ఓటు హక్కు వయసు తగ్గించాలని ఉధృత ఉద్యమాన్ని నడిపిన ఘనత ఆయనదేనని, యూపిఏ 1 ప్రభుత్వంలో ఉపాధి హామీ చట్టాన్ని మరియు సమాచార హక్కు చట్టాన్ని అమలుపరిచేందుకై కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు ఎం.నరేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, పి.సురేష్, కె.పద్మావతి, మాజీ కార్యవర్గ సభ్యులు జి.నరేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాంద్ భాషా, భార్గవి, శ్రీనివాసులు, మహేశ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు లక్ష్మణ్, పట్టణ సహాయ కార్యదర్శి ద్యాం అంజి, ఇందిరక్క, ఈ.పద్మ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** భారత ఉపరాష్ట్రపతి అభ్యర్థి, భారత దేశం గర్వించదగ్గ న్యాయ కోవిదుడు, తెలంగాణ ముద్దుబిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఉపరాష్ట్రపతిగా గెలిపించు కోవలసిన చారిత్రక అవసరం ఏర్పాడిందని తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ అన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికపై ఆయన మహబూబ్ నగర్‌లో మాట్లాడుతూ రెండు విరుద్ధ రాజకీయ సైద్ధాంతిక శిబిరాలకు మధ్య జరుగుతున్న ప్రతిష్ఠాత్మక పోరాటమని ఈ సందర్భంగా ఆయన ఉపరాష్ట్రపలి ఎన్నికను అభివరిణంచారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సభ సభ్యులు ఏకతాటిగా ఆలోచన చేసి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించుకోవాలని ఈ సందర్భంగా హనీఫ్ అహ్మద్ పిలుపునిచ్చారు. విపక్ష పార్టీల సభ్యులు అధికారపక్ష పార్టీల సభ్యులు దేశ భవిష్యత్తును, దేశ ప్రజాస్వామిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

## కరాటే విద్యార్థులకు సిఐ బెల్టులు సర్టిఫికెట్లు అందజేత



**ప్రజాపక్షం/జడ్చర్ల :** కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోకాన్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ భవన్‌లో విద్యార్థిని విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించడం జరిగింది. ఈ యొక్క ఎగ్జామినేషన్‌కి కెఎఫ్ఎస్ ఇండియా ప్రెసిడెంట్ జీకే గణేష్ మాస్టర్ కెఎఫ్ఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాజుద్దీన్ మాస్టర్ ఎగ్జామినర్లుగా వ్యవహరించడం జరిగింది. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బెల్ట్ మరియు సర్టిఫికెట్స్ అందజేయడానికి స్థానిక సిఐ కమలాకర్ విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ప్రతి విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ప్రతి విద్యార్థిని విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ కచ్చితంగా నేర్చుకోవాలని అమ్మాయిలకు సెల్ఫ్ డిఫెన్స్ కొరకు సెల్ఫ్ కాన్ఫిడెన్స్ కొరకు ఫిట్నెస్ తో పాటు మెంటల్లీ షార్ప్‌గా ఉంటారని ప్రతి విద్యార్థిని విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని కోరారు. అర్హత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు బెల్ట్ మరియు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.కిట్టు, ఉపాధ్యక్షులు ఖాజామైనుద్దీన్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి అబ్దుల్లా వి.వెంకటేష్, షఫీ మునీర్ కే.సత్యం, సురేష్, ఎండి సోహెల్, శ్రీనాథ్, పాల్గొన్నారని స్థానిక సీనియర్ మాస్టర్ తాజుద్దీన్ తెలిపారు.

## నర్వలో కాంగ్రెస్‌కు భారీ షాక్



**ప్రజాపక్షం/ నర్వ :** మండలంలో కాంగ్రెస్‌కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కొంత కాలంగా పార్టీపై అలక చెందిన కొంత మంది నాయకులు ఆదివారం ఎట్టకేలకు కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారిలో నర్వ మాజీ సర్పంచ సంధ్య ఆంజనేయులు, ఉందేకోడ్ జంగంరెడ్డి పల్లి మాజీ ఎంపీటీసీ పనుల నీరాజ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉందేకోడ్ సి. లక్ష్మణ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నర్వ మండల వైస్ ప్రెసిడెంట్ పాతర్చేడ్ మహేష్ గౌడ్, రాజుపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు యు.అంజల్ రెడ్డి, ఎస్.బొజ్జన్న, జి.గుర్లపల్లి వెంకటన్నలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పార్టీకి అనేక సేవలు అందించామని కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత కష్టపడ్డ వారికి సరైన గుర్తింపు పార్టీలో ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఉన్న అంతర్గత సమస్యలపై, పార్టీలో సరైన గౌరవం దక్కడం లేదని పలుమార్లు రాష్ట్రమంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి కానీ జిల్లా అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి న్యాయం జరగలేదని పార్టీ సభ్యత్వానికి ఆదివారం రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామా లేఖను ఆమోదించాలని జిల్లా అధ్యక్షులు అందుబాటులో లేనియెడల వాట్సాప్ మేల్ ద్వారా లేఖను పంపడం జరిగిందని తెలిపారు. త్వరలో బీజేపీలో చేరేందుకు సాంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రాథమిక సమాచారం తెలుస్తుంది. విరితో పాటు ఇంకొంతమంది పార్టీకి రాజీనామా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థలు దగ్గర పడుతున్న వేళా మండలంలో కాంగ్రెస్‌కి గట్టి ఎదురుదెబ్బ తగిలేటట్టుందిని గుసగుసలు వినిపిస్తున్నాయి.

# మక్తల్ జాతరకల్లా కోనేరును అత్యద్భుతంగా తీర్చిదిద్దుతాం

### పడమటి అంజన్న కోనేరు సుందరీకరణ పనులను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/ మక్తల్ :** రాబోయే డిసెంబర్ నెలలో జరగబోయే మక్తల్ పట్టణ పడమటి అంజనేయస్వామి జాతర బ్రహ్మోత్సవాలు. కోనేరును ఎవరు ఊహించని రీతిలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, భక్తులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలంగాణ రాష్ట్ర పాడి పశుసంవర్ధక డైరీ క్రీడా, మత్స్య శాఖమంత్రి డాక్టర్॥ వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం రోజు పడమటి అంజనేయస్వామి ఆలయ కోనేరు సుందరీకరణ పనులను ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్॥ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ. పడమటి అంజనేయస్వామి కోనేరును గతంలో ఎవరూ పట్టించుకోలేదని, పూర్తిగా అపరిశుభ్రంగా మారిదని, అయితే కోనేరును పూర్తిగా సుందరీకరణ చేసి, తిరుమల, యాదగిరి గుట్ట తరహాలో అత్యద్భుతంగా తీర్చిదిద్ది. రాబోయే జాతర ఉత్సవాలకు భక్తులు కోనేటిలోనే స్థానమాచరించి స్వామివారిని దర్శించుకునే లాగా చర్యలు చేపడతామని తెలిపారు. పూర్తిగా ఎమ్మెల్యే సొంత నిధులతో సుందరికరణ పనులు చేపడుతున్నామని, ప్రముఖ ఆర్కిటెక్చర్ కల్పన కోనేరు సుందరీ కరణ పనులను పర్యవేక్షిస్తున్నారన్నారు. పడమటి ఆంజనేయస్వామి భక్తులు, పట్టణవాసులు సైతం కోనేరు సుందరీకరణ పనులలో భాగం కావచ్చని, ప్రతి ఒక్కరూ తలా చేయి వేసి కోనేరును మరింత సుందరంగా తయారు చేసుకునేందుకు భాగస్వామ్యం కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆర్కిటెక్చర్ కల్పన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 100 కు పైగా కోనేరులను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు తాము భాగస్వామ్యం అవుతున్నామని, అందులో భాగంగా నియోజకవర్గంలోని పలు కోనేరుల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ప్రాణేశాచారి, ఈవో శ్యాం సుందరాచారి, మున్సిపల్ ఏఈ నాగ శివ, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. రవికుమార్, కట్టా సురేష్ గుప్తా, గొల్లపల్లి నారాయణ, కావలి తాయప్ప, కావలి ఆంజనేయులు చంద్రశేఖర్ గౌడ్, హేమ సుందర్, గాయత్రి అనిల్ వల్లం పల్లి లక్ష్మణ్, ఆడేం శ్రీనివాసులు, పూజ శివ, కల్లూరి గోవర్ధన్, బోయ వెంకటేష్, మందుల నరేందర్, గుడేబల్లూరు నాగరాజ్, కావలి రాజేందర్, మామిళ్ళ ఆంజనేయులు, జి.రవికుమార్, కృష్ణ, మహమ్మద్ శలం, నూరుద్దీన్, ఫయాజ్, ఆలయ సిబ్బంది శ్రీనివాస్, ఇతర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నల్లమలలో మంత్రి సీతక్క పర్యటన

**ప్రజాపక్షం/అచ్చంపేట :** రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖమంత్రి సీతక్క నల్లమలలో ఆదివారం విస్తృత పర్యటనచేశారు. ఈ సందర్భంగా ఆమె పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. మొదట హాజీపూర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే వంశీకృష్ణ, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. అనంతరం కల్మునోని పల్లి, మాధవానిపల్లి, మొలకమామిడి, జంగంరెడ్డిపల్లి గ్రామాలలో నూతన గ్రామ పంచాయతీ భవనాలకు, అంగన్‌వాడిభవనాలకు శంకుస్థాపనచేసి భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీకి రూ.20లక్షల నిధులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా తమప్రభుత్వం చేపట్టిన ఆరుపథకాలను నిష్పక్షతపాతంగా పార్టీలకు అతీతంగా చేస్తున్నామని ఆమె తెలిపారు. ఇటీవల చెంచులకు సౌరవిద్యుత్ పథకాన్ని పరిశీలించి ఆనందం వ్యక్తంచేశారు. త్వరలో చెంచుమహిళలకు స్వయం ఉపాధికింద ఆర్‌టిసి బస్సులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఎల్‌పిఓ, ఎంపిడిఓ లింగయ్య, జిల్లా గ్రంథాలయచైర్మన్ రాజేందర్, మున్సిపల్‌చైర్మన్ గార్లపాటిశ్రీనివాసులు, మార్కెట్ వైస్‌చైర్మన్ వెంకటయ్య, మండలనాయకులు హరినారాయణగౌడ్, రహీం, శ్రీనివాసులు, మల్లేష్ పాల్గొన్నారు.

# అద్భుతాలు సృష్టిస్తారు

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎన్‌టిఆర్‌టి వర్క్ షాప్‌లా ఉంది

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూత ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని 28 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి, పైలెట్ ప్రాజెక్ట్‌గా శతశాతం అనే వినూత్న కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రెండు రోజుల పాటు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థులకు శిక్షణ తరగతులను (ప్రేరణ తరగతులు) నిర్వహిస్తున్నారు. మెరిట్ ఆధారంగా ఎంపిక చేసిన 263 మంది పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత ప్రేరణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎన్‌టిఆర్‌టి వర్క్ షాప్ లా ఉందన్నారు. వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు రవీందర్ ఎమ్మెల్యే గత 18 నెలలుగా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా పయనీర్ కార్యక్రమం ద్వారా ఎప్సెట్, నీట్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగిందని అన్నారు. వీరి కృషి తో మహబూబ్ నగర్ నగరానికి మూడు కొత్త ఇంజనీరింగ్ కళాశాలలు వచ్చాయని అందులో ఐఐఐటి కళావాల అని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే చేపట్టిన ఈ శతశాతం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, అనిల్, రాజ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ మోడల్ గృహం ప్రారంభం**

హన్వాడ మండలం తాహసీల్దార్ ప్రాంగణంలో గృహ నిర్మాణ శాఖ 5 లక్షల వ్యయంతో గృహ నిర్మాణం చేసిన ఇందిరమ్మ మోడల్ గృహ నిర్మాణం ఏ.ఈ కార్యాలయంను మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు స్వంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ గృహాలను నిర్మాణం చేసేందుకు లబ్దిదారులకు 5 లక్షల వ్యయంతో ఆకర్షణీయంగా మోడల్ హౌజ్ ను నిర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మోడల్ హౌజ్ నిర్మాణం చేసిన గృహ నిర్మాణ పిడి సిబ్బందిని ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత, మధుసూదన్ రెడ్డి, ఎంపిడిఓ యశోద, తాహసీల్దార్ కిష్ట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కెజిబివిల్లో నాణ్యమైన విద్యనందించాలి: డిఇఓ

**ప్రజాపక్షం/వెల్దండ :** విద్యార్థులు ప్రణాళికతోచదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డిఇఓ రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా పాఠశాలలో స్టోర్‌రూమ్, వంటగదిని పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్న బోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోజనం నూతనమెనూ ప్రకారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కేజీబివి విద్యార్థినిలతో కలిసి మధ్యాహ్న బోజనంచేశారు. వెల్దండ మోడల్‌స్కూల్ ఇంటర్మీడియట్ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి బోదన, బోజనసదుపాయం ఇతర మౌలిక వసతులు ఎలా ఉన్నాయి? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బాలికలు విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నతస్థితికిరావాలని ఆకాంక్షించారు. ఆయనవెంట టెస్ట్‌బుక్‌మేనేజర్ నర్సింహ్ములు ఉన్నారు.

# సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రికి వినతి



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్ల మండల సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యల పరిష్కారానికి మంత్రి జూపల్లికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల ప్రజల తరపున వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, ప్రభుత్వ బాయ్స్ హై స్కూల్‌లో ఇంగ్లీష్ టీచర్‌ను వెంటనే నియమించాలని, ఎస్సీ గురుకుల హాస్టల్‌ను కొత్త కోట నుండి వీపనగండ్లకు మార్చాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బందిని పెంచి ఆపరేషన్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా వీపనగండ్ల నుండి కేతేపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మించాలని, గోవర్ధనగిరి సమీపంలోని బ్రిడ్జి పనులు పూర్తి చేసి ప్రారంభించాలని, వీపనగండ్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న రెండు ఎకరాల పెంట దిబ్బలను తొలగించి క్రీడా స్థలం ఏర్పాటు చేయాలని, స్మశానానికి కాంపౌండ్ వాల్ నిరించాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి జూపల్లి ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల, జిల్లా కమిటీ సభ్యుడు ఆది, మండల నాయకులు వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, వెంకటేశ్వర్ గౌడ్, రామకృష్ణ, శ్రీను తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మరాజ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** కాంగ్రెస్‌ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ సొంత ఇంటికల నెరవేరుతుందని తిమ్మాజిపేట మండల ఇంచార్జీ చిలుక వివేక్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సహకారంతో తిమ్మాజిపేటలోని అన్ని గ్రామాలు సస్యశ్యామలంకావడానికి ఆరుగ్యారంటీలతోపాటు ఇచ్చిన హామీలకంటే అనేక అభివృద్ధిసంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని అన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన 20నెలలకే తిమ్మాజిపేట మండలంలోని వివిధ గ్రామాలలో సిసిరోడ్లు, కాంపౌండ్‌వాల్స్, ఫించన్లు, రైతుబంధు, రైతుభరోసా లాంటి అనేక పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికి అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో అవినాష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా గందే రవి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం దేవాలయట్రస్టుచైర్మన్ జూలూరు రమేష్‌బాబు అధ్యక్షతన దసరా శరన్నవరాత్రి ఉత్సవకమిటి సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో అధికసంఖ్యలో పట్టణ ఆర్యవైశ్యసభ్యులు పాల్గొన్నారు. 202526 నవరాత్రి ఉత్సవ కమిటి అధ్యక్షునిగా గందేరవి నవరాత్రి ఉత్సవ కమిటి కల్మిచర్ల గోపాల్‌ను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ఈసందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలతోపాటు వినాయకచవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గంధంప్రసాద్, పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వాసశేఖర్, మార్కెట్‌కమిటి డైరెక్టర్ శివాలయం శ్రీనివాస్, వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కల్వమనోహర్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బిచాని బాలకృష్ణతోపాటు ఆర్యవైశ్య మహాసభ నాయకులు పాల్గొన్నారు.



## నేరేడుకం గ్రామంలో పారిశుద్ధ్యం లోపించింది : మాజీ ఎంపిటిసి

**ప్రజాపక్షం/మాగనూర్ :** మాగనూరు మండలంలోని నేరేడుకం గ్రామంలో పారిశుద్ధ్యం లోపించిందని నేరేడుదాం మాజీ ఎంపీటీసీ ఎల్లా రెడ్డి ఆరోపించారు. సర్పంచుల పదవి కాలం ముగిసి 18 నెలలు కావస్తున్న సర్పంచుల ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శులు అప్పులపాలయ్యారని అన్నారు. ట్రాక్టర్ డిజిల్ కు డబ్బు లేక చెత్త సేకరణ గ్రామాలలో బంద్ నిలిచిపోయిందన్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కార్యదర్శులను అడుగుతే మేము అప్పులపాలు అయ్యామని మేము పనులు చేపట్టలేమని చెప్పినట్లు తెలిపారు. ప్రజల ఇబ్బందుల పై అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని అధికారులను కోరారు.

## ఉప్పల వెంకటేష్‌ను కలిసిన తాండ్ర గ్రామస్తులు



**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** కల్వకుర్తి నియోజకవర్గం కల్వకుర్తి తాండ్ర గ్రామానికి చెందిన బిఆర్ఎస్‌పార్టీ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకులు, తెలంగాణ మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్, ఉప్పల చారిటబుల్‌ట్రస్టుచైర్మన్ ఉప్పలవెంకటేష్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసినవారిలో మాజీసర్పంచ్ సుశీల ఈశ్వరయ్య, మాజీ ఉపసర్పంచ్ మైబుయాదవ్, గ్రామబిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్, తెలంగాణజాగృతి జిల్లా అధ్యక్షుడు, బిఆర్ఎస్‌పార్టీ నాయకులు యాకుబ్‌పాష పాల్గొన్నారు.

**మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం**

మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన కోళ్లపెంటయ్య ఆదివారం మరణించారు. విషయం తెలుసుకున్న ఉప్పలచారిటబుల్‌ట్రస్టుచైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్ ఉప్పలవెంకటేష్ మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్‌పార్టీ నాయకులు గ్రామమాజీ సర్పంచ్ కల్పనకృష్ణయ్య, మాజీ ఉపసర్పంచ్ ఎండి ఖాజ, గ్రామబిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు కృష్ణయ్య, నాయకులు పర్వతాలు, లాలయ్యగౌడ్, శివ, రామస్వామి, సాదిక్, తిరుపతయ్య, సాయిలు, ఆంజనేయులు, శ్రీశైలం పాల్గొన్నారు.

## చోరీల కేసులో నిందితుడి అరెస్టు




**ప్రజాపక్షం/బిజినేపల్లి :** గత ఏడాదిగా రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్టుచేసి రిమాండుకు తరలించారు. నాగర్‌కర్నూల్ సీఐ అశోక్‌రెడ్డి చోరీఘటనలకు సంబంధించి వివరాలు వెల్లడించారు. పాలెం గ్రామానికి చెందిన బత్తుల మల్లేష్ పెయింటర్‌గా పనిచేస్తూ చోరీలకు పాల్పడుతున్నట్లు తమ విచారణలో వెల్లడైనట్లు వివరించారు. జూలైనెల చివరలోగ్రామంలోని భారతి ఇంట్లో చోరీకిపాల్పడి పక్కనే ఉన్న వెంకటయ్య ఇంట్లో సెల్‌ఫోన్ దొంగిలించినట్లు వివరించారు. వెంకటయ్య ఫిర్యాదుమేరకు ప్రత్యేకబృందంతో విచారణచేపట్టగా నిందితుడి దొరికినట్లు తెలిపారు. ఐదు దొంగతనాల్లో చోరికిపాల్పడిన ఏడుతులాల బంగారం, 70తులాల వెండి, సెల్‌ఫోన్‌ను స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది ప్రవీణ్, ఆంజనేయులు, శివకుమార్, నర్సింహ్మా, సురేందర్ పాల్గొన్నారు.

# క్రీడ

## అంతర్జాతీయ క్రికెట్‌కు పుజారా గుడ్‌బై..



భారత క్రికెటర్, 'నయా వాల్'గా పేరు గాంచిన సీనియర్ టెస్ట్ ప్లేయర్ ఛతేశ్వర్ పుజారా అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్‌ను ప్రకటించాడు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 2023లో ఆస్ట్రేలియా పర్యటనలో జట్టు నుంచి చోటు కోల్పోయిన తర్వాత పుజారా గత కొన్నాళ్లుగా ఫామ్ లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. దీంతో అతను తిరిగి జట్టులోకి రావడం కష్టంగా మారింది. దేశవాళీ క్రికెట్‌లో పెద్ద ప్రదర్శనలు చేసినప్పటికీ, సెలెక్టర్ల నుంచి పిలుపు రాలేదు. దీంతో ఇకపై తనకు జట్టులో చోటు దక్కడం కష్టమని భావించిన అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక పుజారా నిర్ణయాన్ని పలువురు క్రికెటర్లు స్వాగతిస్తున్నారు. కెరీర్ పరంగా చూసుకుంటే.. పుజారా 103 టెస్ట్ మ్యాచ్‌లు ఆడారు.. 43.60 సగటుతో మొత్తం 7,195 పరుగులు చేశారు. ఇందులో 19 సెంచరీలు మరియు 35 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 2018–19లో ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో పుజారా అద్భుతమైన ప్రదర్శన కనబరిచి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెలుచుకున్నారు. ఆ సిరీస్‌లో మొత్తం 521 పరుగులు చేసి, భారతదేశం తొలిసారిగా ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్‌ను గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించారు. అయితే టెస్ట్‌లలో రాణించిన పుజారా వన్డేలలో రాణించలేకపోయాడు. తన క్రికెట్ కెరీర్‌లో కేవలం 5 వన్డేలు మాత్రమే ఆడారు. క్రీజులో ఎక్కువ సేపు నిలబడి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించే పుజారాని చూసి రాహుల్ ద్రవిడ్ తర్వాత, పుజారాను 'నయా వాల్' అని పిలిచేవారు.

## దాదా సరికొత్త ఇన్నింగ్స్!

### తొలిసారిగా హెడ్‌కోచ్ పాత్రలో సౌరవ్ గంగూలీ..!



భారత జట్టు మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ తొలిసారిగా సరికొత్త అవతారంలో కనిపించబోతున్నారు. తన కెరియర్‌లోనే కొత్త అధ్యాయాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు పరిపాలనపరమైన పాత్రల్లో కొనసాగిన గంగూలీ.. ఓ జట్టుగా హెడ్‌కోచ్‌గా పని చేయనున్నారు. దక్షిణాఫ్రికా టీ20 లీగ్ 2026 సీజన్ కోసం ప్రిటోరియా క్యాపిటల్స్ జట్టు గంగూలీని హెడ్ కోచ్‌గా నియమించింది. ఈ మేరకు ప్రిటోరియా క్యాపిటల్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. డిసెంబర్ 26 నుంచి ప్రారంభమయ్యే ఎస్ఏ20 నాల్గవ సీజన్ కోసం భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ప్రిటోరియా క్యాపిటల్స్ ప్రధాన కోచ్‌గా నియామకమయ్యారని పేర్కొంది. మాజీ ఇంగ్లాండ్ క్రికెటర్ జోనాథన్ ట్రాట్ స్థానంలో గంగూలీ ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రొఫెషనల్ క్రికెట్ జట్టుకు హెడ్‌కోచ్‌గా గంగూలీ పూర్తి స్థాయి పాత్ర పోషించడం ఇదే మొదటిసారి. 53 ఏళ్ల గంగూలీ గత సంవత్సరం నుంచి ప్రిటోరియా క్యాపిటల్స్ మాతృ సంస్థ అయిన జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్‌కు క్రికెట్ డైరెక్టర్‌గా పని చేసిన విషయం తెలిసిందే. భారత మాజీ కెప్టెన్ ఇండియన్ ప్రీమియర్ లీగ్, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు క్రికెట్ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా ప్రిటోరియా క్యాపిటల్స్ తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 'యువరాజు మా క్యాంప్‌కు రాజసం తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారు! సౌరవ్ గంగూలీని మా కొత్త హెడ్ కోచ్‌గా ప్రకటిస్తున్నందుకు చాలా సంతోషిస్తున్నాం' పేర్కొంది. వాస్తవానికి గంగూలీ 2008లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పారు. ఆ తర్వాత క్రికెట్ పరిపాలన రంగంలోనే ఎక్కువగా పని చేసేందుకు ఆసక్తి చూపించారు. బీసీసీఐ అధ్యక్షుడిగా, బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతల్లో కొనసాగారు. ప్రస్తుతం ఐసీసీ పురుషుల క్రికెట్ కమిటీకి ఛైర్మన్‌గానూ కొనసాగుతున్నారు. ఐపిఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా, అలాగే ఒక దశలో మెంటార్‌గా వ్యవహరించారు. గత సీజన్ వరకు జొనాథన్ ట్రాట్ ప్రిటోరియా క్యాపిటల్స్ హెడ్‌కోచ్‌గా ఉన్నారు. గత సీజన్‌లో ఆ జట్టు పది గ్రూప్ మ్యాచ్‌లలో కేవలం రెండింట్లోనే విజయం సాధించింది. నాకౌట్ దశకు చేరుకోకపోవడంతో ట్రాట్ హెడ్‌కోచ్ పదవి నుంచి తప్పుకున్నారు. ఈ క్రమంలోనే గంగూలీ హెడ్‌కోచ్‌గా తీసుకోవడం విశేషం. సెప్టెంబర్ 9న జరిగే ఆటగాళ్ల వేలం జరుగనున్నది. జట్టును అన్నిరంగాల్లో తీర్చిదిద్దేందుకు ఉత్తమమైన ఆటగాళ్లను ఎంపిక చేయాల్సిన బాధ్యత గంగూలీపైనే ఉండనున్నది. 2026 పురుషుల టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని దక్షిణాఫ్రికా టీ20 లీగ్ షెడ్యూల్‌ను ముందస్తుగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ లీగ్ డిసెంబర్ 26న మొదలై వచ్చే ఏడాది జనవరి 25 వరకు కొనసాగుతుంది. గంగూలీ నియామకం తమ అదృష్టంలో మార్పు తెస్తుందని ప్రిటోరియా క్యాపిటల్స్ ఆశిస్తోంది.

## 2027 వరల్డ్ కప్

### 54 మ్యాచ్‌లు, 12 స్టేడియాలు

### ఈసారి మరింత కొత్తగా..

2027 వన్డే వరల్డ్‌కప్ టోర్నమెంట్‌కు సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు సన్నాహాలు ప్రారంభించింది. రాబోయే ఈ టోర్నీలో సతాఫ్రికాతోపాటు జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో లీగ్ మ్యాచ్‌లు, సెమీఫైనల్, ఫైనల్ సహా 54 మ్యాచ్‌లు ఉండనున్నాయి. ఈ నేపథ్యంలో మెగా ఈవెంట్‌ను దృష్టిలో ఉంచుకుని సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు తమ దేశంలో మ్యాచ్‌లు జరిగే స్టేడియాలను ఫైనలైజ్ చేసింది.

**అత్యధికంగా సౌతాఫ్రికాలోనే..**

టోర్నీలో మొత్తం 54 మ్యాచ్‌లు ఉండగా, అందులో అత్యధికంగా 44 మ్యాచ్‌లకు సౌతాఫ్రికానే ఆతిథ్యం ఇవ్వనుంది. మిగిలిన 10 మ్యాచ్‌లు జింబాబ్వే, నమీబియాలో జరుగుతాయి. 44 మ్యాచ్‌లను నిర్వహించడానికి సౌతాఫ్రికా దేశంలో 8 స్టేడియాలను ఎంపిక చేసినట్లు సౌతాఫ్రికా స్థానిక టోర్నమెంట్ నిర్వాహక కమిటీ బోర్డు ఛైర్మన్, మాజీ కేబినెట్ మంత్రి ట్రెవర్ మాన్యుయేల్ ప్రకటన చేశారు.


ఇందులో జొహెన్నస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియం, కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ క్రికెట్ గ్రౌండ్స్, దర్బన్ కింగ్స్ మీడ్ క్రికెట్ గ్రౌండ్ ప్రిటోరియా సెంచూరియన్ పార్క్, బ్లూమ్ ఫోంటైన్ మాంగాంగ్ ఓవల్, గ్కెబెరాలోని సెయింట్ జార్జ్ పార్క్, ఈస్ట్ లండన్‌లోని బఫెలో పార్క్, పార్ల్ బోలాండ్ పార్క్ ఉన్నాయి. ఈ ఎనిమిది నగరాల్లోని స్టేడియాల్లో మొత్తం 44 మ్యాచ్‌లు జరగనున్నాయి.

# ఆరోగ్యం

**ఫోకస్**

ముఖ్యమైన విటమిన్లలో విటమిన్ 'డి' కూడా ఒకటి. విటమిన్ 'డి'కి ఒక ప్రత్యేకత ఉన్నది. ఉదయం వేళల్లో మన శరీరంపై పడే సూర్యరశ్మి వల్ల మన దేహంలో విటమిన్ 'డి' తయారు చేయబడుతుంది. అందువల్లనే విటమిన్ 'డి'ని సూర్యరశ్మి విటమిన్ లేదా సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు.

## విటమిన్ 'డి' లోపంతో ఎన్నో సమస్యలు



మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాల్లో కూడా విటమిన్ 'డి' ఉంటుంది. విటమిన్ 'డి' మినహా ఇతర విటమిన్లు మాత్రం ఆహారం రూపంలోనే శరీరానికి అందుతాయి. వివిధ శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం 50 శాతానికి పైగా వ్యక్తుల్లో విటమిన్ 'డి' లోపం ఉన్నట్లు గమనించారు. వానాకాలంలో ఎండలు అధికంగా పడకపోవడంతో పాటు పేదరికం వల్ల విటమిన్ 'డి' కలిగిన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల ఈ సమస్య పెరుగుతున్నట్లు గమనించారు. గ్రామీణ, చిన్న పట్టణాల్లో సహితం విటమిన్ 'డి' లోపం కనిపిస్తున్నట్లు తేల్చారు. ఎండలో పని చేయకపోవడం లేదా బయటకు వెళ్లకపోవడంతో పాటు శరీరాన్ని పూర్తిగా బట్టలతో కప్పివేయడం వల్ల కూడా సూర్యరశ్మి చర్మం మీద పడని కారణంగా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఎముకలు, కండరాలు, నాడీమండలం, కండరఅస్థిపంజరాలు, రోగ నిరోధకశక్తి లాంటి వ్యవస్థల ఆరోగ్యానికి విటమిన్ 'డి' దోహదపడుతుంది. వర్షాకాలంలో వానలు, ముసుర్లు, ఆకాశం మబ్బుపట్టడంతో సూర్యరశ్మి భూతలంపై పడని కారణంగా మన శరీరంలో అవసర విటమిన్ 'డి' అందని కారణంగా పలు అనారోగ్యాలు కలుగుతాయి. సాధారణ ప్రజల్లో అవగాహనలోపం వల్ల కూడా అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. విటమిన్‌డి లోపం వల్ల అలసట, కండరాల బలహీనత, ఎముకల నొప్పి, ఆందోళన, ఇన్‌ఫెక్షన్స్ పెరగడం, వెన్ను నొప్పి, వ్యాధి నిరోధకశక్తి తగ్గడం, కీళ్లు బిగుసుకుపోవడం, కాల్షియం శోషణం తగ్గడంతో ఎముకలు బలహీన పడడం, మానసిక చికాకు పెరగడం (మూడ్ స్వింగ్) లాంటి పలు అనారోగ్యాలు కలుగుతాయి. విటమిన్ 'డి' లోపం తీవ్రం అయినపుడు స్థూలకాయం, ఫైబ్రోసిస్, కిడ్నీ సమస్యలు, కాలేయ సమస్యలు కూడా కలుగుతాయి. విటమిన్ 'డి' లోపం దీర్ఘకాలం పాటు కొనసాగితే సులభంగా ఎముకలు విరిగిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. విటమిన్ 'డి' లోపం కలిగిన పిల్లల్లో సహితం రికెట్స్ (ఎముకలు మెత్తబడడం, వంకర కాళ్లు) వ్యాధి కనిపిస్తుంది. ఈ సమస్యల నివారణకు విటమిన్ 'డి' ఉన్న కలిగిన గుడ్లు, చేపలు, పాలు, పాల ఉత్పత్తులు, తృణ ధాన్యాలు, పుట్ట గొడుగులు, పాలకూర, సంత్రాలు, మాంసం, టోఫూ, అరటి పండ్లు, సోయా పాలు లాంటి పోషకాహార పదార్థాలను రోజు తీసుకోవడం తప్పనిసరి అని గమనించాలి. 40 ఏండ్లు దాటిన పౌరులు, ముఖ్యంగా మహిళలు విధిగా విటమిన్‌డి నిర్ధారణ పరీక్షలను ప్రతి ఏట ఒకసారి అయినా చేయించుకోవాలి. ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య కనీసం 15 నుంచి 30 నిమిషాలు ఎండ శరీరంపై పడే విధంగా జీవన శైలినా మార్చుకోవాలి. విటమిన్ 'డి' లోపం పట్ల అవగాహన, ఆహార పదార్థాల పోషక విలువల కనీస పరిజ్ఞానం, 50 ఏండ్లు దాటిన వయోజనులు ఏడాదికి ఒకసారి పరీక్ష చేయించుకోవడం, ఉదయం వేళ శరీరంపై ఎండ పడే విధంగా చూసుకోవడం లాంటి జాగ్రత్తలతో విటమిన్‌డి లోప సమస్యలు తొలగి పోతాయి. వానాకాలంలో ఎండ పడుతున్న వేళల్లో తప్పనిసరిగా ఎండలో గడపడాన్ని మరచిపోరాదు.


## జీవనశైలి మార్చుకోవాలి..



నేటి అత్యాధునిక ప్రపంచంలో పెరుగుతున్న సౌకర్యాలు మనిషిని సోమరిని చేస్తున్నాయి. అనేకానేక ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. సౌకర్యాలు మంచివేగానీ, అతిగా వాటిపైనే ఆధారపడి, కనీస వ్యాయామం కూడా లేకుండా రోజులు దొర్లించడం వల్ల ఎన్నో రకాల రోగాలు చుట్టుముట్టడం ఖాయం. ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలంటే, వ్యక్తిగత జీవన శైలి మార్పులు తప్పనిసరుగా చేయాలి. ఆరోగ్యకరమైన ఆహారం, నిత్యం వ్యాయామం అవసరం. పొగాకు, మద్యం వంటి దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి. ఒత్తిడి నిర్వహణ, సరియైన నిద్ర, మానసిక శాంతి కోసం తగిన చర్యలు తీసుకోవాలి. శరీర బరువు నియంత్రణపైన కూడా దృష్టి పెట్టాలి. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ప్రత్యేకించి బ్లడ్ ప్రెషర్, షుగర్, కొలెస్ట్రాల్, క్యాన్సర్ స్క్రీనింగ్స్ టెస్టులు తప్పనిసరి. వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి చికిత్స చేపట్టడం ద్వారా పరిణామాలు తగ్గించడం సాధ్యమవుతుంది. వాతావరణ సంబంధిత రక్షణ చర్యలను మరచిపోకూడదు. అధిక వేడి, కాలపరిమితిలో ప్రమాదాలను గమనించడం, తగిన మిద్దతలు తీసుకోవడం అవసరం. గాలిలో మలినాలు, ఆక్సిజన్‌లో తక్కువ స్థాయి ఉన్న సమయాల్లో జాగ్రత్తలు పాటించాలి. మాస్క్ ధరించడాన్ని అలవాటు చేసుకోవాలి. వాతావరణ మార్పులకు అనుగుణంగా పని సమయాలు, జీవనశైలి సర్దుబాటు చేసుకోవాలి. ఈ మిశ్రమ చర్యలు సమగ్ర ఆరోగ్య పరిరక్షణకు మార్గం చూపుతాయి. వ్యాధుల నివారణకు సహాయపడతాయి. ఆరోగ్య భద్రతా విధానాలని పాటించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్‌ఒ) కూడా సూచిస్తున్నది. జీవనశైలిని మార్చుకొని, ఆరోగ్యంగా జీవించాలని హితవు పలుకుతున్నది.

## ఆశాజనకంగా కొత్త ప్రయోగాలు

మల్టిపుల్ స్క్లెరోసిస్ (ఎంఎస్) చికిత్సలో కొత్త ప్రయోగాలు ఆశాజనకంగా ఉన్నాయి. బ్రూటన్స్ టైరోసిన్ కినాస్ ఇన్‌హిబిటర్స్ అందుబాటులోకి వస్తున్నాయి. టోల్బ్రుటినిబ్ (Tolebrutinib) అనే కొత్త మందు మెదడు రక్త అవరోధాన్ని దాటుకొని, సెల్లలోని ఇమ్యూన్ కణాలను లక్ష్యంగా చేస్తుంది. ఇది క్రమంగా నర్వ్ నష్టాన్ని



తగ్గించి, రోగ నిరోధక శ్రేణి మెరుగుపరుస్తుంది. ఈ మందును ఆరు నెలలు వాడితే, మెదడులో రక్తం గడ్డకట్టుకోవడం కారణంగా సంభవించే పలు రకాల అంగవైకల్యాల నుంచి బయటపడే అవకాశాలు 31శాతం పెరిగాయని నూతన అధ్యయనాలు పేర్కొంటున్నాయి. స్టెమ్ సెల్ థెరపీ (ఎస్‌సిటి)తో ఎన్నో రకాల వ్యాధులకు చికిత్స చేస్తున్నారు. రోగులకు దీర్ఘకాల ఉపశమనం, మెరుగైన జీవనాన్ని అందించడం ఇప్పుడు సాధ్యమవుతున్నది. కృత్రిమ మేధస్సు (ఎఐ) సాయంతో రోగుల డేటా విశ్లేషణ ద్వారా వ్యాధి క్రమాన్ని అంచనా వేసి, వ్యక్తిగత చికిత్స పథకాలు సృష్టించడం లో సహాయపడుతుంది. పేరుతో తగ్గింపు ప్రమాదాలతో ఫలితాల మెరుగుదల సాధించడం జరుగుతున్నది. మొత్తం మీద వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, సరికొత్త ప్రయోగాలు, ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

# రీల్

## అలాంటి చిత్రాలు అరుదుగా వస్తాయి

**కుశేందర్ రమేష్ రెడ్డి**



పొలిమేర, రజాకార్ వంటి చిత్రాలతో జాతీయ స్థాయిలో కెమెరామెన్‌గా కుశేందర్ రమేష్ రెడ్డికి గుర్తింపు వచ్చింది. ఆయన సినిమాటోగ్రఫర్‌గా పని చేసిన 'త్రిబాణధారి బార్బరిక్' చిత్రం ఆగస్ట్ 29న రాబోతోంది. ఈ క్రమంలో కుశేందర్ రమేష్ రెడ్డి ఈ మూవీకి సంబంధించిన విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

'రజాకార్' చివరి షెడ్యూల్‌లో ఉన్నపుడు దర్శకుడు మోహన్ ఈ కథ గురించి చెప్పారు. కథ కథ విన్న తరువాత నా సలహాలు, సూచనలు చెప్పాను. ఎలాంటి కలర్ గ్రేడింగ్, ప్యాట్రన్ వాడితే బాగుంటుందనే రిఫరెన్సులు కూడా ఇచ్చాను. అవన్నీ కూడా మారుతికి చాలా నచ్చాయి. దీంతో దర్శకుడు మోహన్, నిర్మాత విజయ్, నేను కలిసి ఈ ప్రాజెక్ట్‌ని మొదలు పెట్టాం.

'త్రిబాణధారి బార్బరిక్' మూవీ ఎక్కువగా రాత్రి పూట, రెయిన్ ఎఫెకట్స్‌లోనే షూటింగ్ చేశాం. వేసవి కాలంలో రెయిన్ సీజన్ ఎఫెక్ట్‌ను చూపించడం అంత సులభం కాదు. అదే మాకు పెద్ద ఛాలెంజింగ్. ఎండాకాలంలో వానాకాలాన్ని సృష్టించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. ఈ విషయంలో మాత్రం నిర్మాత విజయ్ డేరింగ్ స్టెప్ తీసుకున్నారు. కథ కోసం ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. మొదటి సినిమా అయినా కూడా కథ మీద నమ్మకంతో ఆయన భారీ బడ్జెట్‌ను పెట్టారు.

'త్రిబాణధారి బార్బరిక్' సినిమాలో ప్రతీ పాత్రకు ఓ ప్రత్యేకత ఉంటుంది. ఒక్కో పాత్రకు సపరేట్ కలర్ గ్రేడింగ్ వాడాము. ఒక్కో పాత్ర రూపాంతరం చెందుతున్న తీరుకి తగ్గట్టుగా కలర్ గ్రేడింగ్ మారుతుంది. ఇక రెయిన్ ఎఫెక్ట్ సీన్లను చూస్తే ఎంతో సహజంగా అనిపిస్తాయి. 'తుంబాడ్', '2018' చిత్రాలకు ఏ మాత్రం తగ్గకుండా ఎంతో నేచురల్‌గా కనిపిస్తుంది.

'త్రిబాణధారి బార్బరిక్' మూవీకి ప్రధాన బలం కథ. స్క్రిప్ట్ విన్నప్పుడే ఈ మూవీని చేయాలని ఫిక్స్ అయ్యాను. 'పొలిమేర', 'రజాకార్' కథలు విన్నప్పుడు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో.. ఈ మూవీ కథను విన్నప్పుడు కూడా అలాంటి ఫీలింగే కలిగింది. క్లైమాక్స్‌ని ఎవ్వరూ ఊహించలేరు.

ఈ చిత్రంలో ఉదయ భాను పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉంటుంది. చాలా ఏళ్ల తరువాత మళ్లీ ఉదయ భాను ఓ అద్భుతమైన పాత్రలో రాబోతోన్నారు. మలయాళంలో కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలు వస్తాయని చెబుతుంటాం. కానీ తెలుగులోనూ కంటెంట్ బేస్డ్ చిత్రాలు వస్తున్నాయని నిరూపించేందుకు 'త్రిబాణధారి బార్బరిక్' అనే మూవీ వస్తోంది.

ప్రస్తుతం అల్లరి నరేష్ తో '12ఏ రైల్వే కాలనీ' మూవీని చేశాను. త్వరలోనే అది రిలీజ్ కాబోతోంది. 'పొలిమేర 3'త్వరలోనే స్టార్ట్ అవుతుంది. పొలిమేర దర్శకుడు అనిల్ తో కంటిన్యూగా ప్రాజెక్ట్‌లు ఉంటాయి. ఇక రీసెంట్‌గానే 'కామాఖ్య' చిత్రీకరణ ప్రారంభించాం.

## 30న దుబాయ్‌లో 'గామా' అవార్డ్స



ప్రతిష్టాత్మమైన గామా (Gulf Academy Movie Awards) అవార్డ్స్‌కు టాలీవుడ్‌లో స్పెషల్ క్రేజ్ ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇప్పుడు 5వ ఎడిషన్ వేడుకలు ఆగస్ట్ 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్లో జరగనుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గామా సీఈవో సౌరబ్ కేసరి, వైభవ్ జ్యువెలర్స్ ఎండి రాఘవ్, జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు ఏ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్, హీరోయిన్స్ ఫరియా అబ్దుల్లా, మానస వారణాసి, దక్షా నాగర్కర్, నటుడు వైవా హర్ష పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గామా సీఈవో సౌరబ్ కేసరి మాట్లాడుతూ దుబాయ్‌లో ఉన్న తెలుగు వారితో పాటు ప్రపంచంలోని తెలుగు వారందరినీ అబ్బురపరిచేలా ఈవెంట్ నిర్వహించబోతున్నాం. మా జ్యూరీ సభ్యుల సహకారంతో అవార్డు విజేతలను ఎంపిక చేశాం' అని అన్నారు.

జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు ఏ కోదండ రామిరెడ్డి మాట్లాడుతూ.. 'ఈ అవార్డ్స్‌లో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. నేను, బి గోపాల్, కోటి సహా పలువురు ప్రముఖులు కూడా జ్యూరీ సభ్యులుగా వ్యవహరిస్తున్నాం. ఇలాంటి అవార్డ్స్ నటీనటులకు మల్టీ విటమిన్ టాబ్లెట్స్ లాంటివి. ప్రతి ఒక్కరినీ ఎంకరేజ్ చేసేలా ఉంటాయి. ఆగస్టు 30న దుబాయ్‌లో జరగనున్న ఈ గామా అవార్డ్స్ విజయవంతం అవ్వాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు బి.గోపాల్ మాట్లాడుతూ.. 'గామా అవార్డ్స్ చైర్మన్ త్రిమూర్తులు ఈ అవార్డ్ ఫంక్షన్‌ను ప్రతి ఏడాది చాలా గ్రాండ్‌గా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా అంతకుమించేలా సౌరబ్ కేసరి అన్ని ఏర్పాట్లు చేశారు. అతిరథ మహారథుల సమక్షంలో హీరోయిన్స్ అద్భుతమైన పర్ఫార్మెన్స్ లతో ఈ ఈవెంట్ జరగనుంది' అని చెప్పారు.


ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హీరోలు సిద్దు జొన్నలగడ్డ, తేజ సజ్జ, కిరణ్ అబ్బవరం, శ్రీ విష్ణు, రోషన్.. హీరోయిన్స్ మీనాక్షి చౌదరి, దక్ష నాగర్కర్ పాల్గొంటున్నారు. హీరోయిన్స్ ఊర్వశి రౌతేలా, కేతిక శర్మ, ఫరియా అబ్దుల్లా, ప్రియా హెగ్డే, శ్రీదేవి స్పెషల్ పర్ఫార్మెన్స్ లతో అలరించనున్నారు. ప్రత్యేక అతిథులుగా బ్రహ్మానందం, దర్శకులు సుకుమార్, బుచ్చిబాబు, బాబీ, సాయి రాజేష్, సంగీత దర్శకులు దేవిశ్రీ ప్రసాద్, నిర్మాతలు అశ్విని దత్, డివివి దానయ్య, చంద్రబోస్, వెన్నెల కిషోర్ తదితర ప్రముఖులు హాజరవనున్నారు.

## 27న 'సువ్వి సువ్వి' పాట ఆవిష్కరణ





పవన్ కళ్యాణ్ హీరోగా ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా సుజిత్ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం ఓజీ. ఈ చిత్రంలోని సువ్వి సువ్వి అనే పాటను ఈనెల 27వ తేదీన వ ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. ఇప్పటికీ విడుదల అయిన టైటిల్ సాంగ్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి సెప్టెంబర్ 25న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. డివివి మూవీస్ బ్యానర్ పై దానయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





## 26న ఏం జరుగుతోంది పాట విడుదల

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. ఈ సినిమాలోని 'ఏం జరుగుతోంది లిరికల్ సాంగ్‌ను 26న విడుదల చేయబోతున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యాన్ని అందించగా, చిన్మయి పాడారు. ఫీల్ గుడ్ లవ్ సాంగ్‌గా 'ఏం జరుగుతోంది' రూపొందించారు.



## వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బాలకృష్ణకు చోటు

తెలుగు తెరపై యాభై ఏళ్ళుగా హీరోగా కొనసాగుతున్న నందమూరి బాలకృష్ణ పేరును వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చేశారు. ఇప్పుడు బాలక్రిష్ణ పేరు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చేరింది. ఈ గౌరవాన్ని నిర్వాహకులు త్వరలోనే బాలక్రిష్ణకు అందజేయనున్నారు. భారతీయ సినిమాలో అత్యంత ఘనమైన ఆయన వారసత్వం ఇప్పుడు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోని గోల్డ్ ఎడిషన్‌లో నమోదు అవుతుంది. ఈ ప్రత్యేక గుర్తింపు బాలకృష్ణ అపూర్వమైన సినిమా జైత్రయాత్రకి అత్యంత గౌరవప్రదమైన ఘనతగా నిలుస్తుంది యాభై సంవత్సరాలు హీరోగా కొనసాగడం అనేది కెరీర్‌లో అద్భుతమైన మైలురాయి. టాలీవుడ్‌లో తన ఆల్ రౌండర్ ప్రతిభతో, శక్తివంతమైన స్క్రీన్ ప్రెజెన్స్ కళపట్ల నిబద్ధతతో తనదైన గుర్తింపును సాధించుకున్నారు. ఆయన ప్రయాణం ఉత్సాహం, క్రమశిక్షణ శాశ్వత కళాత్మకతకు సాక్ష్యం, ఇది అన్నితరాల సినిమా ప్రేమికులను వారికి అభిమాన పాత్రులను చేసింది. బాలకృష్ణ హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో అద్భుతమైన హ్యాట్రిక్ విజయాన్ని సాధించి చరిత్ర సృష్టించారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికారడ్స్ సిఇఓ సంతోష్ శుక్లా జారీ చేసిన అధికారిక ప్రశంసా పత్రంలో బాలకృష్ణ ఐదు దశాబ్దాల సినిమా సేవలను మిలియన్ల మందికి స్ఫూర్తిగా ప్రశంసించారు. బాలకృష్ణ గత 15 సంవత్సరాలుగా, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్‌గా, ఆయన పబ్లిక్ సర్వీస్‌ను ఒక మిషన్‌గా నిరూపించారు. భారతీయ సినిమాలో హీరోగా ఆయన అసాధారణ సేవలకు గుర్తింపుగా.. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకే గోల్డ్ ఎడిషన్‌లో బాలకృష్ణ చేరికను ఘనమైన గుర్తింపుగా ఆగస్టు 30వ తేదీన హైదరాబాదులో స్వయంగా బాలకృష్ణకి అందిస్తున్నారు.

## నేను రెడీ

### కావ్య థాపర్




నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్ వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ టాలెంటెడ్ హీరో హవీష్, సినిమా చూపిస్త మావ, నేను లోకల్, ధమాకా, మజాక వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు నక్కిన త్రినాథరావు కాంబోలో రూపొందుతున్న క్రేజీ మూవీ 'నేను రెడీ'. ఈ చిత్రాన్ని హార్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పి బ్యానర్ పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. బ్రిలియంట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న 'నేను రెడీ' మూవీ నుంచి ఇటీవల రిలీజ్ చేసిన హీరోయిన్ కావ్య థాపర్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో ఆమె క్యారెక్టర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. 'నేను రెడీ' మూవీ తన కెరీర్‌లో ది బెస్ట్‌గా నిలుస్తుందని ఆశిస్తోంది కావ్య థాపర్. ప్రస్తుతం 'నేను రెడీ' సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఇటీవల రిలీజ్ చేసిన 'నేను రెడీ' టైటిల్ గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన వచ్చింది.

## 'మకుటం' టీజర్ విడుదల



తమిళ హీరో విశాల్ ప్రస్తుతం 35వ సినిమా చేస్తున్నారు. సూపర్ గుడ్ ఫిలమ్స్ బ్యానర్ మీద ఆర్ బి చౌదరి 99వ చిత్రానికి రవి అరసు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన టైటిల్ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఇంత వరకు విశాల్ 35 అంటూ ఈ ప్రాజెక్ట్‌కు వర్కింగ్ టైటిల్ పెట్టారు. ఈ ప్రాజెక్ట్ టైటిల్‌ను రివీల్ చేస్తూ టీజర్‌ను విడుదల చేశారు. విశాల్, అంజలి, దుషార విజయన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి 'మకుటం' అనే టైటిల్‌ను పెట్టారు. ఇది సముద్రం నేపథ్యంలో నడిచే ఓ మాఫియా కథ అని అర్థం అవుతోంది. సముద్రం లోపలి జీవరాశుల్ని చూపిస్తూ.. చివరగా విశాల్‌ను బ్యాక్ సైడ్ నుంచి చూపించారు. 'మకుటం' చిత్రంలో విశాల్‌ను సరికొత్తగా చూపించబోతోన్నారని అర్థం అవుతోంది.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పార్టీలకు అతీతంగా సురవరంకు నివాళి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** ప్రజల గొంతుక కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం వామపక్ష ఉద్యమానికి, దేశప్రజలకు తీరని నష్టం అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అన్నారు. ఈ సందర్భంగా జాపాల గ్రామం బస్టాండ్ వద్ద పార్టీలకు అతీతంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అలుముద్దీన్ శ్రీశైలం, అనంతరెడ్డి, బాలయ్య, సిపిఎం నాయకులు పాపిరెడ్డి, జగన్, టిఆర్ఎస్ నాయకులు మంథనివీరేశం, రాహూప్,లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి



మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్

**ప్రజాపక్షం/కొత్తూరు:** గ్రామ పంచాయతీల అభివృద్ధితోనే రాష్ట్రం సుభిక్షంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం నందిగామ మండల పరిధిలోని చేగూరు గ్రామంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఏర్పాటు చేసిన సిసి రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శివశంకర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వివరించారు. స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ కోట్ల నిధులను నియోజకవర్గానికి తీసుకువస్తున్నారని గుర్తు చేశారు. హెచ్ఎండిఏ నిధుల నుండి రూ.55లక్షల సిసి రోడ్డు నిర్మాణానికి కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఒక్క సిసి రోడ్డు మాత్రమే కాకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, బిటి రోడ్లు, మంచినీటి సమస్య వంటి అనేక పనులు ఎంతో ఉత్సాహంగా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహా యాదవ్, గ్రామ కమిటి అధ్యక్షుడు గునుగుర్తి రాజశేఖర్, మాజీ ఎంపిటిసి కుమారస్వామి గౌడ్, కాంగ్రెస్ నేతలు మంకాల శ్రీశైలం, ఆవుల శివశంకర్, మాజీ వార్డు సభ్యులు భాస్కర్ గౌడ్, శ్రీశైలం, రవిజేత, గిరి గౌడ్, ఉపాధ్యాయుడు మహేష్‌తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులను పూజిద్దాం



వివేకానంద డిగ్రీ కళాశాల సెక్రటరీ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేద్దామని వివేకానంద డిగ్రీ కళాశాల సెక్రటరీ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం షాద్‌నగర్‌లో సత్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్, వివేకానంద డిగ్రీ కళాశాల సెక్రటరీ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయకులను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయంలో వినాయక పూజలకు ఎంతో విశిష్టమైన ప్రాధాన్యం ఉందని అన్నారు. ప్రతి శుభ కార్యక్రమంలో మొదటి పూజ విఘ్నేశ్వర స్వామికి చేస్తారని, ప్రతి ఇంటిలో మట్టి వినాయకుడి పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు. సమాజంలో ఆధ్యాత్మికత పెరగడంతోపాటు విఘ్నాలు తొలగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందని అన్నారు. వినాయక ఉత్సవాలు భారత దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని వివరించారు. సమాజంలో ఐక్యత, భక్తి, ఆధ్యాత్మికతను పెంచుకోవాలని, అప్పుడు హిందూ సంస్కృతి ఉట్టిపడే విధంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద విద్యాసంస్థల డైరెక్టర్ విజయ్‌కుమార్, సత్యనారాయణ, కరుణాకర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు యం సాని శ్రీనివాస్, ప్రకాష్, రవికుమార్, వంశీకృష్ణ, పేట అశోక్, మల్చలం మురళీ, గజ్జల ప్రవీణ్, క్యామ మహేష్, సుబ్బు, గుడాల రమేష్‌లు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధి గురువులతోనే సాధ్యం




ప్రభుత్వ పాఠశాలలకు సర్కార్ పెద్దపీట వేయాలి
ప్రొఫసర్ కోదండరాం

**ప్రజాపక్షం/గజ్వేల్ :** సమాజాభివృద్ధి ఉపాధ్యాయులతోనే సాధ్యపడుతుందని ప్రొఫసర్ కోదండరాం పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞగార్డెన్లో ఉపాధ్యాయుడు పంబాల ఎల్లయ్య పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రొఫసర్ కాసిం, విమలక్క, డాక్టర్ అనితతో కలిసి ఆయన మాట్లాడారు. సమాజంలో గురువు స్థానం ఉన్నతమైనది కాగా, బాధ్యతతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వాలు కూడా బాధ్యతగా పాఠశాల విద్య బలోపేతానికి నిధులను సమకూర్చాలని స్పష్టం చేశారు. టిపిటిఎఫ్ కార్యకర్తలు ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని కోరారు. ప్రొఫసర్ ఖాసిం మాట్లాడుతూ సమాజం విలువలతో కూడిన విద్యను అందించే ప్రతి గురువుకు సముచిత స్థానం దక్కుతుందని, సమాజంలోని అన్ని వర్గాలను చైతన్యం చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలను సర్కార్ నిర్లక్ష్యం చేయకుండా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాఠ్యాంశాలను తయారు చేసే సంస్థలు నాణ్యమైన విద్యను అందించే విధంగా పాఠ్యాంశాలను రూపొందించాలని, సీబీఎస్సీ, ఐసిఎస్సి పాఠ్యాంశాల మాదిరిగా తెలంగాణ పాఠ్యాంశాలు కూడా పకడ్బందీగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రస్తుత సమాజంలో విద్య ప్రైవేటు దిశగా ముందుకెళ్తోందని, దానిని ప్రభుత్వాలు కూడా ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. పేద విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమై కూలీలుగా పనులు చేస్తూ దుర్భరమైన జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సమాజంలో రోజు రోజుకు పేదవారి సంఖ్య పెరిగిపోతూ, వారి జీవితాలు ఆగమ్య గోచరమవుతున్నాయని స్పష్టం చేశారు. సమాజంలో సమాన జ్ఞాన కోసం ఒకే రకమైన నాణ్యమైన విద్యను అందించాలని, ఆ బాధ్యత ప్రభుత్వాలపై ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి దామెర రాజయ్య, ఫడరేషన్ పూర్వాధ్యక్షులు రాంచంద్రం, జిల్లా ఉపాధ్యక్షులు పాపిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, మహిళా కార్యదర్శి మంజుల, నేతలు నేతి శంకర్, నర్సింలు గౌడ్, మహేందర్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు తాళ్ల నాగరాజు, సత్తయ్య గోవర్ధన్ రెడ్డి, విద్యాదర్ రెడ్డి, పర్వతం నర్సయ్య, ప్రధాన కార్యదర్శిలు విద్యాసాగర్, రాజనర్సింహ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ‘స్థానికం’లో 42శాతం బిసి రిజర్వేషన్ల సాధనకు
# నేడు ఆర్.కృష్ణయ్య సత్యాగ్రహ దీక్ష

జయప్రదం చేయాలని
18 బిసి సంఘాల పిలుపు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లను చట్టప్రకారం అమలుచేయాలని డిమాండ్‌చేస్తూ ఈ నెల 25న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్. కృష్ణయ్య చేపట్టే ‘సత్యాగ్రహ’ దీక్షను జయప్రదం చేయాలని 18 బిసి సంఘాల సమావేశం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి వేలాదిమంది బిసి సంఘం నేతలు, ప్రజలు తరలిరావాలని కోరింది. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన 18 బిసి సంఘాల సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బిసి రిజర్వేషన్లను పార్టీపరంగా ఇచ్చే కుట్ర జరుగుతుందని, దీనిని అసలు ఒప్పుకోబోమన్నారు. బిసి రిజర్వేషన్ల చట్టబద్ధతకోసం గవర్నర్ చేత ఆర్డినెన్స్ ఆమోదింపజేసి జీవో జారీ చేయాలని సూచించారు. లేకపోతే అసెంబ్లీలో మరోసారి బిసి బిల్లు పెట్టి, దానిని గవర్నర్‌కు పంపితే దానిని ఆటోమేటిక్‌గా ఆమోదింపజేస్తారని తెలిపారు.

కానీ, ఎనిమిది నెలలుగా బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. బిసి బిల్లులను గవర్నర్ నుంచి రాష్ట్రపతికి పంపించి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకొని కేంద్రాన్ని బద్నాం చేయడం సరికాదన్నారు. అన్ని వర్గాలను అభివృద్ధి చేయాలని దృఢ సంకల్పంతో జనగణనలో కులగణనకు కేంద్రప్రభుత్వం సిద్ధపడిందన్నారు. ఇకనైనా సిఎం రేవంత్ రెడ్డి మంచి మనసుతో స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత చేయాలని డిమాండ్ చేశారు. తాను చేపట్టే సత్యాగ్రహ దీక్షకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, నేతలు జిల్లపల్లి అంజి, సి.రాజేందర్, నిమ్మల వీరన్న, మోదీ రాందేవ్, మహిళా నేత సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

## అవసరాలకు అనుగుణంగా రుచికరమైన భోజనం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రజలకు రుచికరమైన నాణ్యమైన భోజనం అంధించేందుకు నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ సూచించారు. ఆదివారం మున్సిపాలిటిలోని పాత జాతీయ రహదారి ఎస్‌బిఐ బ్యాంక్ సమీపంలో బగారా బువ్వ.. నాటుకోడి హోటల్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా సంచరిస్తుంటారని, సరసమైన ధరలను అందుబాటులోకి తీసుకువచ్చి నాణ్యమైన భోజనం అంధిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో దసరా, సంక్రాంతి పండుగలతోపాటు ఇతర శుభ కార్యక్రమాల్లో ఎక్కువగా నాటుకోడి కూర.. బగార బువ్వను ప్రజలు ఇష్టపడుతుంటారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి హోటల్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని, ప్రజల అవసరాలకు, ఇష్టాలకు అనుగుణంగా భోజనాలు అందించేందుకు నిర్వాహకులు కృషి చేయాలని అన్నారు. హోటల్ యాజమానులు భవనం సుజిత్‌రెడ్డి, భవనం సునీత రెడ్డి, వరుణ్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డిలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినంధించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి భార్గవ్‌కుమార్, జర్నలిస్టు కేపి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కట్ట వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ పెంటయ్య, చించోడు అనంతం, భవనం సంజీవరెడ్డి, చిల్కమర్రి నర్సింలు, లింగారెడ్డి గూడ అశోక్, మార్గం రాజేష్, శేఖర్‌లు పాల్గొన్నారు.

## ప్రజాభిమానం చూరగొన్న మహానేత సురవరం



అస్తమించిన ఎర్ర సూర్యుడు... జోహార్ కామ్రేడ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజాభిమానం చూరగొన్న మహానేత సురవరం సుధాకర్‌రెడ్డికి జోహార్లు అర్పించారు. ఆదివారం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో సిపిఐ రంగారెడ్డి జిల్లా నియోజకవర్గ సభ్యుడు ఎం.శ్రీనునాయక్ ఆధ్వర్యంలో కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి అంకితం చేశారని వివరించారు. కార్మికులు, కర్షకులు, పేదల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూ వారి హక్కులను సాధించేందుకు అనేక ఉద్యమ మార్గాలను చూపించిన మహానీయుడు సురవరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య, టంగుటూరి నర్సింహ్మారెడ్డి, మండల కార్యదర్శులు గడ్డం గంజయ్య, గోవింద్‌నాయక్, లింగం నాయక్, రమేష్, రవి, నర్సింహ్మా, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్, సాయిలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎంఎల్ఏ సుధీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** ప్రజా సమస్యల పరిష్కారమే తనలక్ష్యం అని ఎల్‌బి నగర్ ఎంఎల్ఏ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆదివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని అగమయ్యా కాలనీలో జరిగిన కాలనీవాసుల సమావేశంలో ముఖ్య ఎల్.బి.నగర్ శాసనసభ్యులు సుధీర్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీవాసులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా ఇట్టి కాలనీలోకి రావడానికి సరియైన రహదారి లేదని, అలాగే గతంలో వేసిన డ్రైన్స్ ప్రస్తుతానికి సరిపోవడం లేదని తెలిపారు. అలాగే పందులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని తెలిపారు. అలాగే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ట్రంక్ లైన్ పనులు వేగవంతం చేయాలని కోరారు. ఓపెన్ వాటర్ లైన్స్ పనులు త్వరగా చేయాలని కోరారు. అలాగే కాలనీ చివర అక్రమంగా గుడిసెలు వేసుకొని నివసిస్తూ మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు అని అన్నారు. అలాగే ప్రైవేటు ట్రావెల్ బస్సులు ఇష్టారాజ్యంగా రోడ్ల మీద పెట్టడం జరుగుతుంది అని అన్నారు. అలాగే కాలనీ చివర మొత్తం డంపింగ్ యార్డుగా మారింది అని అన్నారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మీరు ప్రస్తావించిన సమస్యలు రెండు రోజుల క్రితం జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కాగా కమిషనర్ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తామని తెలపడం జరిగింది అని తెలిపారు. అతి త్వరలోనే అట్టి పనులు ప్రారంభం కావడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా కుక్కల బెడద గురించి అధికారులచే మాట్లాడడం జరుగుతుంది అని తెలిపారు. అలాగే కాలనీ చివర డంపింగ్ యార్డు కూడా ఎత్తివేయిస్తామని హామీ ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, మల్లారెడ్డి, జగదీష్ యాదవ్, నాగరాజు, రఘువీర్ రెడ్డి, రుద్ర యాదగిరి నేత, కన్న, దస్తగిరి నర్సింహా గౌడ్ బాలు గౌడ్ చంద్ర మోహన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంత వంటకాలకు ప్రాధాన్యత

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఆరోగ్య దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల వంటకాలను ప్రజలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని షాద్‌నగర్ మాజీ శాసన సభ్యులు వై.అంజయ్య యాదవ్ వివరించారు. ఆదివారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన నాటుకోడి పులావ్ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రుచుల్లో నాటుకోడి పులావ్ అన్నంకు ఎంతో డిమాండ్ ఉంటుందని, వంటకాల్లో వినియోగించే సుగంధ దినుసులతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. బాయిలర్ కోడి కంటే నాటుకోడి వంటకం ఆరోగ్యానికి అనేక పోషకాలు అందుతాయని, గ్రామీణ ప్రాంత వంటకాలను భోజనం ప్రియులను నాణ్యమైన ఆహారం అందించేందుకు నిర్వాహకులు కృషి చేయాలని పేర్కొన్నారు. వ్యాపార పరంగా అభివృద్ధి సాధించడంతోపాటు పరిశుభ్రత పాటించేందుకు నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ చైర్మెన్ ఈట గణేష్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నేతలు నక్కల వెంకటేష్ గౌడ్, దేవేందర్ యాదవ్, వెంకట్ రెడ్డి, నంద కిషోర్, ఈశ్వర్‌రాజు, జూపల్లి శంకర్, లంకాల రాఘువేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిప్రసాద్, రమేష్, భువనేశ్వర్‌రెడ్డి, రాఘవేందర్, నార్ల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

**నాణ్యమైన ఆహారం అందిస్తేనే గుర్తింపు**
**ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి**

ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు నిర్వాహకులు కృషి చేయాలని, అప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసి నాటుకోడిపులావ్ అన్నం రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపార రంగంలో నిర్వాహకులు పోటీ పడటంతో పాటు ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అప్పుడు సమాజంలో మంచి గుర్తింపు రావడంతోపాటు వ్యాపారం అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. నిర్వాహకులు సుజిత్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి, వినీత్‌రెడ్డి, వరుణ్‌రెడ్డిలను ఎమ్మెల్సీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నందకిశోర్, ఈశ్వర్‌రాజు, టౌన్ యువత అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యారం శేఖర్‌రెడ్డి, నేతలు రాజారెడ్డి, దినేష్‌సాగర్‌లు పాల్గొన్నారు.

## యూరియా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలి

మేడిపల్లి సహకార సంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప

**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా సరఫరా చేసి ఆదుకోవాలని మేడిపల్లి సహకారసంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప శ్రీనివాస్ అన్నారు. అదివారం యాచారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ యూరియా కోసం రైతులు రోజు సహకార సంఘం కార్యాలయం చుట్టు తిరుగుతున్నారని అన్నారు. వచ్చిన యూరియా గంటలోపె అయి పోతుందన్నారు. యారియా కోసం వచ్చిన రైతులు గత్యతరం లేక వేను దిరిగి పోతున్నారని పేర్కోన్నారు. రైతులందరికి సరిపడా యూరియాను సరఫరా చేయాలన్నారు. రైతులు లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి పత్తి, వరి తదితర పంటలను వేశారు. సీజన్‌లో యూరియా వేయక పోతే రైతు నష్టపోయే అవకాశం ఉంది దీనిని అర్థం చేసుకొని ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలన్నారు. కొరత లేకుండా చూడాల్సిన భాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

## ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలు



ఇబ్రహీంపట్నం ఎసిపి కెవిపి రాజు

**ప్రజాపక్షం/యాచారం :** మండలంలో గణేశ్ నవరాత్రుల ఉత్సవాలను ప్రశాంతంగా జరపుకోవాలని ఇబ్రహీంపట్నం ఎసిపి కెవిపి రాజు అన్నారు. ఆదివారం యాచారం మండల పరిధిలోని చింతపట్ల లక్ష్మణ్ చెరువును అయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడకి వచ్చిన యువకులతో మాట్లాడారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. గణేశ్ ఉత్సవాలకు ఎట్టి పరిస్థితిలో డిజెలకు అనుమతి లేదని చెప్పారు. గ్రామంలో పెట్టిన వినాయక మండపాలకు సంభందించి పోలిసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మండపాల వద్ద సిసి కెమెరా ఎర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొరారు. గణేశ్ మండపాల నిర్వాహకులదే పూర్తి భాధ్యత అన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలున్న పోలిస్ శాఖ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి, ఎస్ఐ మధు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలి




రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బీసిలకు దామాషా ప్రకారం ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని బీసి మేధావులు, కుల సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో బీసి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... దేశంలో బిసి సామాజిక వర్గ ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి దోపిడికి గురవుతున్నారని మండిపడ్డారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి బిసి బిడ్డ ముందుకు వచ్చి రిజర్వేషన్ల సాధన కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్ 42శాతం నిర్ణయించి శాసన సభలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపిస్తే ఆమోదించకుండా పెండింగ్ పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసి బిల్లుపై కుంటి సాకులు చెప్పకుండా పార్లమెంట్‌లో ఆమోదించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బీసిల స్థితి గతులపై మూడు కమిషన్లు వేయడం జరిగిందని, ఇప్పటి వరకు ఓబిసిలకు బీపి మండల్ కమీషన్ రిపోర్టు వీపి సింగ్ ప్రభుత్వం మాత్రమే కొంతమేరకు న్యాయం చేసిందని వివరించారు. బీసిల న్యాయమైన వాటా కోసం కలిసి కట్టుగా పార్టీలకు అతీతంగా పని చేయాలని సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు.

**బిసి జెఎసి నూతన కార్యవర్గం ఏర్పాటు**

బీసి జెఎసి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీసి జెఎసి చైర్మెన్‌గా టిజి శ్రీనివాస్, కన్వీనర్‌గా రవీంద్రనాథ్, కోఆర్డినేటర్‌గా ఎన్.నర్సింలు గౌడ్, వైస్ చైర్మెన్‌లుగా బి.వరలక్ష్మి, డి.సురేష్‌కుమార్, కో కన్వీనర్లుగా టి.కరుణాకర్, ఎం.వెంకటేష్, పి.శేఖర్ గౌడ్, ఎన్.బాల్‌రాజ్ గౌడ్‌లు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వక్తలు నర్సింలు, రఘునాథ్ యాదవ్, రాఘవేందర్ గౌడ్, వెంకటరమణ, నక్క బాలరాజ్, రాము, మల్లేష్, జనార్ధన్, టిపిఎఫ్ అర్జునప్ప, శివకుమార్ గౌడ్, శ్రీశైలం, రమేష్, చంద్రశేఖర్ అప్ప, వెంకటేష్, శ్రీనివాస్, నరేందర్, నరేష్‌కుమార్, గౌతమ్, క్యాసెట్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తా

జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్
కొప్పుల నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/హయత్‌నగర్:** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని జెడ్జెస్ కాలనీలలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఓపెన్ జిమ్‌లు, పిల్లల ఆడుకునే సామాగ్రి ఏర్పాటు, పార్కుల అభివృద్ధిని కాలనీ వాసులతో కలిసి జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఓపెన్ జిమ్‌లు ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు రోజూ వ్యాయామం చేసే అవకాశం కల్పించడానికి కాలనీల్లో ఆధునిక పరికరాలతో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామని ఇది వయసుతో సంబంధం లేకుండా అందరికీ లాభం చేకూరుస్తుందని తెలిపరు ఈ కార్యక్రమంలో ఆయా కాలనీల నాయకులు చంద్రారెడ్డి,దామోదర్ గౌడ్, సురేందర్ రెడ్డి, వెంకటేష్, జనార్దన్ రావు, ప్రభాకర్ రావు, సుధీర్ రెడ్డి, బాలరాజ్, వీరాచారీ, అనిల్, శ్రీశైలం నర్సింహ్మా యాదవ్, రవి కుమార్, బాలాజీ, జయ తేజ, రమేష్ చారి మరియు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పిఎం సహాయనిధి చెక్కు అందజేత



ప్రజాపక్షం/నాగారం: సిఎం సహాయ నిధి పేదలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లికి చెందిన ఈగ లక్ష్మణ్ ముదిరాజ్ రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందిన ఈయనకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కు 60 వేల రూపాయలను వజ్రేష్ యాదవ్ అందజేశారు.సిఎం రిలీఫ్ ఫండ్ పేదకు ఓ వరంలాంటిదని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సురవరం సేవలు అపూర్వం



ప్రజాపక్షం/కాప్రా/ఘట్‌కేసర్ : దేశ రాజకీయాల్లో వామపక్ష భావజాలాన్ని పెంపొందించటంలో కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి ఎనలేని కృషి చేసారంటూ ఏఐటియుసి నేతలు కొనియాడారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) నేతలు వాసిరెడ్డి సీతారామయ్య, సారయ్య, భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి రమేష్, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజిసైదా, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆలవందార్, వేణుమాధవ్‌లు ఆదివారం మఖ్దూంభవన్‌లో సురవరం భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## కొండ సత్యం మాతృమూర్తి శేషమ్మ మృతి



ప్రజాపక్షం/జవహర్‌నగర్ : సిపిఐ గిరిప్రసాద్ నగర్ సహాయ కార్యదర్శి కొండ సత్యం మాతృమూర్తి శేషమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నరసింహులు, మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, ఏఐటియుసి మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, కీసర మండల సహాయ కార్యదర్శి వి.రవినాయక్, సిపిఐ నేతలు నాని, సిహెచ్‌ఎల్లయ్య, సురేందర్, సూర్యం, డి.మల్లిక, కుమార్ తదితరులు ఆదివారం ఆమె నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

## ముమ్మరంగా సభ్యత్వ నమోదు



ప్రజాపక్షం/జవహర్‌నగర్ : సంఘటితంగా పని చేస్తూ సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వపరంగా సంఘ సభ్యులందరూ లబ్ది పొందేలా కృషి చేయాలని మున్నూరు కాపు సంఘ రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ పటేల్, మేడ్చల్ జిల్లా నాయకులు వెలుపుల శ్రీనివాస్‌లు పిలుపిచ్చారు. ఆదివారం జవహర్‌నగర్‌లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగుదలకు సంఘం పాటు పడాలన్నారు. కీసర, శామీర్‌పేట, దమ్మాయిగూడ, జవహర్‌నగర్ అధ్యక్షులు మహేందర్‌పటేల్, నర్సింగరావు, తోట నరేష్, రాంమ్మోహన్, ముఖ్య సలహాదారులు వెంకటేశ్వరపటేల్, రాజేశ్వర్, కనకయ్య, మధుసుదన్, సింగం వెంకటేష్, విశ్వనాథ్, నరేందర్, కుమార్, పడగం వెంకటేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బస్తీ సమస్యలపై ఆరా



ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని సాయిపూజా కాలనీ, చంద్రశేఖర్ రెడ్డి నగర్, ఇందిరా నగర్ కాలనీ వాసులతో కలిసి బస్తి సమస్యల పై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు బొంగునురి కిషోర్ రెడ్డి పర్యటించారు. కాలనీలో ఉన్న డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం, విద్యుత్ పనుల సమస్యల పై సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటానని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాయిపూజ కాలనీ, ఇందిరా నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పేదలకు నిరంతరం వైద్య సేవలు




ప్రజాపక్షం/చర్లపల్లి: జన విజ్ఞాన వేదిక మెగా హెల్త్ మెడికల్ క్యాంపు విజయవంతమైందని రాష్ట్ర అధ్యక్షులు చెలిమల రాజేశ్వర్ అన్నారు.జన విజ్ఞాన వేదిక కాప్రా,కీసర,మల్కాజ్‌గిరి మండలాల ఆధ్వర్యంలో చక్రీపురం చక్రీ విద్యా నికేతన్ ఆధ్వర్యంలో 120వ ఉచిత మెగా హెల్త్ మెడికల్ క్యాంపును యశోద ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలను అరికట్టడం,విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందించడం,పేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వేదిక ప్రధాన లక్ష్యం,నిరంతరం సేవలందిస్తున్న జిల్లా కమిటీ కృషి అభినందనీయమన్నారు.ఉపాధ్యక్షులు బిఎన్‌రెడ్డి,వరప్రసాద్,డాక్టర్ రమాదేవి,రాష్ట్ర కోశాధికారి పి నాగరాజు,ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు,ఎడిటర్ ఆనందరావు,స్కూల్ ప్రిన్సిపాల్ స్వప్న,నాయకులు సీతారాంరెడ్డి,కె అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విత్తన గణపతులనే పూజించాలి



ప్రజాపక్షం/శామీర్‌పేట: రాబోయే వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత జరుపుకోవాలని మేడ్చల్ ఎంఎల్‌ఎ చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం ఎంఎల్‌ఎ మల్లారెడ్డి క్యాంప్ కార్యాలయంలో వినాయక చవితి పండగను పురస్కరించుకుని గ్రీన్ ఇండియా చాలెంజ్, హరితసేన వ్యవస్థాపకులు, మాజి రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన పర్యావరణ రక్షణలో బాగంగా మేడ్చల్ ఎంఎల్‌ఎ చామకూర మల్లారెడ్డికి విత్తన గణపతిని జిల్లా ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. బిఆర్‌ఎస్ శామీర్‌పేట అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు వంగ వెంకట్‌రెడ్డి, ఎంఎల్‌ఎ పిఎ దీరజ్, తదితరులు పాల్గొన్నారు.

# భార్యను చంపి ముక్కలు చేసి..



### మూసీలో పడవేసిన కర్కోటక భర్త
### ఏడాదిన్నర క్రితమే ప్రేమ వివాహం
### శరీర భాగాల కోసం మూసీలో గాలింపు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : చిన్నతనం నుండి పరిచయం ఉన్న తన గ్రామానికే చెందిన యువతిని గాఢంగా ప్రేమించాడు. కలకాలం పువ్వుల్లో పెట్టుకొని కంటికిరెప్పలాఉంటానన్న మాయమాటలు చెప్పి నమ్మించి కలిసి తిరిగారు, కులాలు వేరైనా చివరికి ఇరు పక్షాల అంగీకారంతో వివాహం చేసుకొన్నాడు. ఏమైందో తెలియదు కానీ రెండు నెలల నుండే గొడవలు పడుతున్న ఆ దంపతులు కొద్ది రోజుల క్రితమే బోడుప్పల్‌కు మకాం మార్చి భార్యతో పాటు ఉంటున్న అతడు మరో సారి ఘర్షణ పడి నిండు గర్భిణీగా ఉన్న ఆమెను క్రూరంగా హతమార్చి శరీర భాగాలను ముక్కముక్కలుగా చేసి మూసి కాలువలో పడేసి కనపడటం లేదంటూ నాటక మాడిన దారుణ ఉదంతం మేడ్చల్ జిల్లాలోని మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. హతురాలి కుటుంబ సభ్యులు, మల్కాజిగిరి డిసిపి పద్మజ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కామారెడ్డి గూడ గ్రామానికి చెందిన స్వాతి (25), అదే గ్రామస్తుడైన మహేందర్‌రెడ్డిలు చిన్ననాటి నుండి ప్రేమించుకొన్నారు. వారిద్దరి కులాలు వేరవటంతో మొదట్లో ఇరువర్గాలకు చెందిన కుటుంబ సభ్యులు ఒప్పుకోక పోయినప్పటికి పట్టుబట్టి మరీ ఆమోదించేలా చేసుకొని ఏడాదిన్నర క్రితం వివాహం చేసుకొన్నారు. తమ ఊరిలోనే ఉంటున్న మహేందర్‌రెడ్డి మూడు వారాల క్రితం గర్భం దాల్చిన భార్యను తీసుకొని నగరంలోని బోడుప్పల్ ఈస్ట్ బాలాజి హిల్స్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని మకాం మార్చాడు. అతడు ర్యాపిడో డ్రైవర్‌గా, ఆమె ఓ కాల్ సెంటర్ ఉద్యోగిగా పని చేయసాగారు. అప్పటికే వారిద్దరి మధ్య చెలరేగుతున్న ఘర్షణల క్రమంలో ఏం జరిగిందో కానీ అతడు తన భార్య స్వాతిని కొట్టి బెడ్‌పై పడేసి అపస్మాకర స్థితిలోకి వెళ్ళేలా చేసి హతమార్చాడు. ఆ తర్వాత ముందస్తు పథకం ప్రకారం తాను తెచ్చుకొన్న యాక్సా బ్లేడ్‌తో ఆమె తల, మొండెం, కాళ్లు, చేతులు కోసి వేరు చేసాడు, సమీపవాసులకు కానీ పోలీసులకు ఎలాంటి అనుమానాలు రాకుండా జాగ్రత్తలు తీసుకొని శవాన్ని అక్కడి నుండి మాయం చేయాలన్న ఆలోచనతో ముక్కలుగా చేసిన శరీర భాగాలను చిన్న చిన్న కవర్లలో తీసుకొని వెళ్లి సమీపంలోని మూసీ కాలువలో పడేసాడు. ఈ విధంగా తల ఓ సారి, కాళ్లు ఓ సారి, చేతులు ఓ సారి కవర్లలో తీసుకొని వెళ్లిన అతడు మూడు సార్లు మూసీ కాలువలో పదేయగా మొండెం మాత్రం ఇంట్లో మిగిలింది. ఆ తర్వాత తన పథకంలో భాగంగా తన భార్య స్వాతి కనపడటం లేదంటూ మరదలు చంద్రకళకు ఫోన్‌లో చెప్పటం, అప్పటికే వారి మధ్య గొడవలు జరుగుతూండటంతో అనుమానించి దిల్‌షుక్‌నగర్‌లో ఉంటున్న మేనమామ గోవర్ధన్ రెడ్డికి సమాచారం అందించటంతో అతడు హుటాహుటిని బోడుప్పల్‌కు చేరుకొని మహేందర్‌రెడ్డిని కలిసాడు. భార్య కనిపించటం లేదని నమ్మించి ఇంటికి వచ్చిన గోవర్ధన్‌రెడ్డిని తీసుకొని శనివారం రాత్రి తొలుత పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఉప్పల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా వారి సూచనల మేరకు మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి భార్య కనిపించటం లేదని, జాడ తెలపాలంటూ చెప్పాడు. అతడి మాటల్లో తేడా కనిపిస్తుండటంతో అనుమానించిన పోలీసులు గుచ్చి గుచ్చి రకాలుగా ప్రశ్నించటంతో తాను చేసిన హత్యను కాస్తా కక్కాడు. వెంటనే అతడిని అదుపులో తీసుకొని విచారించంతో పూర్తి వివరాలుచెప్పడంతో ఒక్కసారిగా పోలీసులు విస్తుపోయారు.

### ఇంట్లో మొండెం మాత్రమే మిగిలింది

అదుపులోకి తీసుకొన్న నిందితుడిచ్చిన సమాచారంతో అతడి ఇంటికి వెళ్లి చూడగా హతురాలు స్వాతి మొండెం మాత్రమే ఉందని, శవపంచనామా నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి డిఎన్‌ఎ, శవపంచనామా నివేదికలు, సాంకేతిక ఆధారాలను పకడ్బందీగా సేకరించి చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని డిసిపి పద్మజ తెలిపారు. నిందితుడు పేర్కొన్న విధంగా శరీర భాగాల కోసం మూసీ కాలువలో జిహెచ్‌ఎంసి, ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సాయంతో గాలిస్తున్నామని తెలిపారు. వివాహమైన రెండు మాసాల నుండే వారిద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవని,ఈ క్రమంలో కామారెడ్డిగూడలో 498(ఎ) సెక్షన్ కింద మహేందర్‌రెడ్డిపై కేసు నమోదు అవటం, పోలీసులు కౌన్సిలింగ్ ఇవ్వటం, పెద్దల సమక్షంలో రాజీ పడటం జరిగిందని డిసిపి తెలిపారు. పెళ్లైన ఏడాదిన్నర కాలంలో ఆ దంపతులకు నాలుగుసార్లు కౌన్సిలింగ్ జరిగిందని, వారిద్దరి మధ్య కొనసాగుతున్న ఘర్షణలనేపథ్యంలోనిందితుడుపథకం ప్రకారమే ఈ హత్యకు పాల్పడ్డాడే తప్ప క్షణికావేశంలో జరిగింది మాత్రం కాదన్నారు. సిసిటివి కెమెరాల్లో నిందితుడు హతురాలి శరీర భాగాలు కవర్లలో తీసుకొని వెళుతున్న దృశ్యాలు నమోదయ్యాయని, శరీర భాగాలు సేకరించి సాంకేతిక ఆధారాలతో కేసు దర్యాప్తు చేస్తున్నామని డిసిపి తెలిపారు.

## అపోహలు వీడండి..రక్తదానం చేయండి



ప్రజాపక్షం / వికారాబాద్ : వికారాబాద్ పట్టణంలోని బ్రమహ్మకుమారిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన వికారాబాద్ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే అనంద్ ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రక్తదానం చేస్తే బలహీనమైనపోతామేమోఅనే అపోహ చాలమందికి ఉంటుందని కానీ అది వాస్తవం కాదు, రక్తదానం చేసినా చేయకపోయినా మానవునిలో పాత రక్త కణాలు 120 రోజుల తర్వత చనిపోవడం, కొత్తవి రావటం జరుగుతుంది. అత్యవసరమ సమయాల్లో రక్తదానం న్నో ప్రాణాలను నిలబెడుతుంది. కుల మతాలకతీతంగా రక్తదానం చేయుటం చాలా గొప్ప విషయం అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గోపాల్ , అనంత్‌రెడ్డి , ప్రభాకర్‌రెడ్డి ,కృష్ణరెడ్డి ,విజయ్‌కుమార్ , సుభాన్‌రెడ్డి , చంద్రశేఖర్‌రెడ్డి పాల్గోన్నారు.

## తాండూరులో యూరియ కొరత లేదు

### తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి



ప్రజాపక్షం/తాండూరు: తాండూరులో యూరియకు ఎలాంటి ఇబ్బంది లేదని, కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హబీబ్ లాలతో పాటు సీనియర్ నాయకులు రావుఫ్, మహిళ అధ్యక్షరాలు మాదవి తదితరులతో కలసి తాండూరులో నూతన ఏర్పాటు చేస్తున్న ఎటిసి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి పక్షాలు రైతులను రెచ్చగొట్టుతున్నారు. మార్కెట్‌లో యూరియా లేదని, అధిక ధరలకు విక్రహిస్తున్నారని ఆపోహలు సృష్టిస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. రైతులకు కావాల్సినంత యూరియ తాండూరు మార్కెట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. యూరియా కొరత అసలే లేదని చెప్పు కొచ్చారు. దొడ్డు యూరియ, సన్న యూరియ రైతులకు అందుబాటులో ఉందని అన్నారు. యూరియా కావాల్సిన రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించిన కావాల్సినంత యూరియను తీసుకోవాలని సూచించారు. ఫర్టిలైజర్స్ షాపుల వ్యాపారులు ఎవ్వరైన అధిక ధరలకు యూనియను విక్రహిస్తే అధికారుల దృష్టికి తీసుకపోవాలని సూచించారు. తాండూరులో యూరియ కొరత అసలే లేదని, కొందరు పనిగట్టుకుని యూరియ కొరత అంటూ ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి సహకారంతో తాండూరు నూతనంగా ఎటిసి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారని, ఆసక్తి కల్గిన యువకులు ఎటిసి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదవ తరగతి ఉతీర్ణలైన యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీనియర్ నాయకులు సర్దార్ ఖాన్, మాజీ కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్, వడ్డే శ్రీనివాస్, రొంపల్లి సంతోష్ తదితరులు ఉన్నారు.

## నేడు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కోసం ధర్నా

ప్రజాపక్షం/ వికారాబాద్ : బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25వ తేదిన రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఎంపి బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షులు హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న బీసీ ల సత్యాగ్రహ దీక్షకు బీసీలే అందరూ స్వచ్చందంగా పార్టీలకు అతీతంగా తరలిరావాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బిఆర్ కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్టంలో అత్యధిక జనాభా కలిగిని బీసీలను రాజకీయ పార్టీలు నేటికి మోసం చేస్తునే ఉన్నాయి. ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలు బీసీల గురించి గళం విప్పినప్పటికీ కూడా కేంద్ర ,రాష్ట ప్రభుత్వలు బీసీలకు 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేసన్ గురించి ఎందుకు చట్టం చేయాలేకపోతున్నారు. బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తూ రాజకీయ పార్టీలు పబ్బం గడుపుతున్నారు. బీసీలు అంటే రాజకీయ పార్టీలకు ఓట్లు వేసే ఓటు బ్యాంకు గానే పార్టీలే బీసీలను చూస్తున్నారు. ఆర్.కృష్ణయ నాయకత్వంలో సత్యాగ్రహ దీక్షను పార్టీలకు అతీతంగా బీసీ మేధావులు ,విద్యార్థ సంఘలు వచ్చేసి మద్దుతు తెలిపి విజయవంతం చేయాలని తెలిపారు.

## బండమీదిపల్లిలో హనుమాన్ పల్లకి శోభయాత్ర



ప్రజాపక్షం/పెద్దేముల్: పెద్దేముల్ మండల పరిధిలోని బండమీదిపల్లి గ్రామంలో శ్రావణమాసం భజన సమాప్తిని వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. భజన సమాప్తి వేడుకలను పురస్కరించుకుని శనివారం గ్రామంలో గ్రామ పెద్దలు, భజన మండలి ఆద్వర్యాన నిర్వహించిన హనుమాన్ పల్లికి సేవా శోభయాత్ర వేడుకలు వైభవంగా నిర్వహించారు. హనుమాన్ మందిరంలో పూజారి శ్రీనివాస్ శర్మపంతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ వేడుకలను ప్రారంభించారు. అనంతరం శ్రీ హనుమాన్ శోభయాత్రను హనుమాన్ మందిరం నుండి గ్రామంలోని పుర వీదుల గుండా భక్తుల ఆట పాటల మధ్య కన్నుల పండువగా చేపట్టారు. శ్రావణ మాసాన్ని పురష్కరించుకుని నెల రోజు పాటు హనుమాన్ భజనమండలి ఆద్వర్యాన భజన కీర్తనలు ఆలపించారు. శ్రావణ మాస భజన సమాప్తిని పురష్కరించుకుని చేపట్టిన శోభయాత్రలో చిటికెల భజన భక్తులు ఆడిపాడిన కీర్తనలు ఆకట్టుకున్నా యి. హనుమాన్‌మందిర్ నుండి శోభయాత్ర పలు వీదుల గుండా సాగింది. పెద్దలు గౌరి మల్లప్ప, తాంద్ర రాంచందర్, బెన్నూర్ రాములు, మల్లేష్, భజన మండలి చైర్మన్ పండరి, శంకరయ్య, వీరన్న, పేటి మాస్టర్ రాములు, రవి, తబల మాస్టర్ రాజు, లక్ష్మప్ప, రాములు, వెంకట్, నారాయణ, బాలయ్య, రాంచంద్రయ్య, నర్సిములు తదితరులు భక్తులు పాల్గోన్నారు.

## మూసీ కాలువ కబ్జా ..పట్టించుకోని అధికారులు



ప్రజాపక్షం/వికారాబాద్ : మూసీ కాలువ కబ్జా.. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అలంపల్లిలోనిమూసి జన్మస్థలానికి అత్యంత చేరువులో జరిగింది. ప్రభుత్వవిభాగాల అధికారుల పర్యవేక్షణ లోపం ,ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, వివిధ విభాగాల సిబ్బంది చేతివాటంతో వెరసి జీవనది మూసీ ఉనికికే భంగం వాటిల్లుతోంది. పట్టా భూమి కలిగిన ఓ వ్యాపారి పక్కనే ఉన్న మూసి కాలువను సగానికిపైగా కబ్జా చేసి గోడ పేర్చేయడం గమనార్హం. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. తెలంగాణ ప్రభుత్వం భూములను,చెరువులు,నదులు కాలువలను పరిరక్షించేందుకు హైడ్రాహైదరాబాద్ పట్టణంలో అక్రమ నిర్మాణాలు తొలగిస్తోంది. వికారాబాద్ జిల్లా కేంద్రంలో మూసి కాలువ కబ్జా చేసి ఎలాంటి పర్మిషన్ లేకుండా ఫంక్షన్‌హాల్ నిర్మిస్తున్నట్టు సమాచారం. నిర్మాణాలు కొందరుఅధికారుల ,పాలకుల అండదండలతోనే కొనసాగుతున్నట్లు సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కాలువ గుండా నీరు కొత్తగాడి, అనంతగిపల్లి నుండి నవాబ్‌పేట్ మండలం చించల్ పేట్ నందు గల మూసీ నదిలో కలుస్తాయి. మూసీ జన్మస్థలానికి అత్యంత సమీపంలోనే కబ్జా జరుగుతుంటే అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందంటున్నారు. ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ప్రకృతి విపత్తు ఏర్పడే అవకాశాలుంటాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కబ్జాలను అడ్డుకోవాలని కోరుతున్నారు.

### ఇరిగేషన్ అధికారి రవి వివరణ

వికారాబాద్ మున్సిపల్‌లోని ఆలంపల్లి రెవెన్యూ పరిధిలోగల అట్టి సర్వే నెంబర్‌లోనిపట్టభూమిలోనిర్మాణం చేపడుతున్నట్లు దరఖాస్తు పెట్టుకున్నారు. ఇరిగేషన్ శాఖనుండి అనుమతులు ఇవ్వలేదని,నిర్మాణలు చేపట్టవద్దని చెప్పినా వినకుండా కబ్జా చేసి గోడ నిర్మిస్తున్నట్టు తెలిసింది. ఇంటి విషయంపై స్థానిక తహసీల్దార్‌కు లెటర్ రాయడం జరుగుతుందని తెలిపారు.

## నారాయణగూడలో కొకైన్ పట్టివేత

### ముగ్గురు అరెస్ట్



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎక్సైజ్ పోలీసులు నారాయణగూడలో విక్రయించడానికి తీసుకువచ్చిన కొకైన్ డ్రగ్స్‌ను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గురు నిందితులను అరెస్టు చేసి 33.3 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మిస్ బాబా ఖాన్, అలీ అంగర్, గులాబ్ సూపర్, మహ్మద్ అజీమ్‌లు బెంగుళూరు నుంచి కొకైన్‌ను తీసుకువచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు నిందితులపై నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే నిందితులు నారాయణగూడ వద్ద కొకైన్‌ను విక్రయిస్తుండగా పట్టుకున్నారు. మిస్‌బాబా ఖాన్, అలీ అంగర్, గులాబ్ సూపర్‌ను అరెస్టు చేయగా మహ్మద్ అజీమ్ పరారీలో ఉన్నాడు.

### ఎండిఎంఎ డ్రగ్స్ పట్టివేత

శంషాబాద్ ప్రాంతంలో ఎండిఎంఎ డ్రగ్స్‌ను సరఫరాచేస్తున్న నిందితులు మీర్జా సాఫీ అలీ, అబ్దుల్ ఉబ వైట్ సయ్యద్, అబ్దుల్ హుస్సేన్‌లను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 5.88 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శంషాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు అప్పగించారు.

### శేరిలింగంపల్లిలో..

శేరిలింగంలపల్లిలో డ్రగ్స్ విక్రయిస్తున్న నాగుల సాయి ప్రవీణ్, మనోచందర్, శ్రీ వర్దన్‌లను ఎక్సైజ్ ఎస్‌ఐ బాలరాజు ఆదివారం చాకచక్యంగా అరెస్టుచేశారు. నిందితుల నుంచి 2.07 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. sssఈ కేసులో మిస్ బాబా ఖాన్, అలీ అంగర్, గులాబ్ సూపర్, మహమ్మద్ అజీమ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

### శంషాబాద్‌లో..

శంషాబాద్ ఏరియాలో స్కూటీపై అక్రమంగా తరలిస్తున్నటువంటి5.88 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్సు పట్టుకున్నారు.ఈ కేసులో మీర్జా సాఫీ అలీ, అబ్దుల్ ఉబ వైట్ సయ్యద్, అబ్దుల్ హుస్సేన్ లను అరెస్ట్ చేశారు. ఒక స్కూటీని కూడా స్వాధీనం చేసుకున్నట్లు నిందితులను డ్రగ్స్ ను శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

### 2.07 ఎండిఎం స్వాధీనం

శేర్లింగంపల్లి ఏరియాలో 2.07 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ ను బి టీం ఎస్సు బాలరాజు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నాగుల సాయి ప్రవీణ్ మనోచందర్ శ్రీ వర్దన్ లను అరెస్టు చేసి శేర్లింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.నిందితులను కాజా గూడ ప్రాంతంలో డ్రగ్స్ అమ్ముతున్నప్పుడు పట్టుకున్నారు.

## ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో 'బర్డ్ వాక్'



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఆదివారం 'బర్డ్ వాక్ (పక్షుల వీక్షణ)' నిర్వహించారు.వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన పక్షి ప్రేమికులకు ప్రాజెకట్స్‌మానేజర్,ఎకో టూరిజం కె. సుమన్, నేచురలిస్ట్ అపరంజని ఫారెస్ట్ ట్రెక్ పార్క్ గురించి, ట్రెక్ పార్క్ లోని వివిధ రకాల పక్షుల గురించి వివరించారు.టిజిఎఫ్‌డిసి రూపొందించిన బర్డ్స్ పాకెట్ గైడ్‌ను అందించారు. అనంతరం బర్డ్ వాక్ చేస్తూ పక్షుల వీక్షణకు వచ్చిన వారు చూసిన పక్షులను పాకెట్ గైడ్ ద్వారా గుర్తిస్తూ, నిపుణులు పక్షుల వీక్షణ ఎలా చేయాలి, ఎలా గుర్తించాలి, పక్షులు ఎలాంటి శబ్దలు చేస్తాయి వంటి విషయాలను వివరించారు.బర్డ్ వాక్ లో షిక్రా, మగ నెమలి, ఆడ నెమలి, నల్ల యోత్రింత, చిన్నపసరిక, ముఖిపిట్ట, కొంగ, గిజిగాడు,కోకిల, మైనా,మ్రింగు పక్షి, ఎర్ర తిట్టెటి,జనువాయి పక్షులను వారు వీక్షించారు. పక్షులు, ప్రకృతి వ్యవస్థలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి, వాటి ద్వారా వృద్ధి, విత్తనాల వ్యాప్తి మరియు పర్యావరణ సంతులనం సృష్టించబడుతుంది. పక్షుల సంరక్షణ గురించిఅవగాహన పెంచడం, పర్యావరణ విద్య నిర్వహించడం చాలా అవసరమని, లేదంటే పక్షులను కూడా మ్యూజియంలలో చూడాల్సిన రోజు వస్తుందని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్ నాయక్ తెలిపారు. ఈ నెల 31న బర్డ్ వాక్ వికారాబాద్ జిల్లా అనంతగిరి అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్నట్లు , ఆసక్తి గలవారు 9493549399 73823 07476 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు. ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ వి. తనూజ, ప్రాజెకట్స్ మానేజర్ సుమన్, ఎఫ్.ఆర్.ఓ. శ్రీనివాస్, ప్లాంటేషన్ మానేజర్ లక్ష్మారెడ్డి, నేచురలిస్ట్ అపరంజని, కిరణ్, బాబు పాల్గొన్నారు.








# ఎర్రసూర్యుడికి విప్లవ జోహార్లు





Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com